॥ श्रीहरि ॥

# अध्यात्मरामायण

( तेलुगू )

# విషయసూచిక


| క్ర.సం. | విషయము | పుట |
|---|---|---|
| 1. | శ్రీ జానకీ జీవనాష్టకము | 8 |
| 2. | గాయత్రీ రామాయణము | 9 |
| 3. | శ్రీరామ స్తుతి | 10 |
| 4. | శ్రీ హనుమ స్తుతి | 10 |
| 5. | మాహాత్మ్యము | 11 - 15 |

| సర్గ | విషయము | పుట |
|---|---|---|

## బాలకాండము

| | | |
|---|---|---|
| 1. | శ్రీరామ హృదయము | 17-24 |
| 2. | భారపీడితయైన భూదేవి బ్రహ్మకడ కేగుట, భగవానుడు ప్రత్యక్షమై అభయమునిచ్చి, ధైర్యము గలిగించుట. | 25-28 |
| 3. | శ్రీరామావిర్భావము - బాల్యలీలలు | 29-34 |
| 4. | విశ్వామిత్రుని ఆగమనము- రామ లక్ష్మణుల అనుగమనము, తాటకా వధ | 35-39 |
| 5. | విశ్వామిత్ర యాగ రక్షణము - అహల్యా శాపవిమోచనము | 41-48 |
| 6. | ధనుర్భంగము - వివాహము | 49-56 |
| 7. | పరశురామ సమాగమము | 57-62 |

## అయోధ్యాకాండము

| | | |
|---|---|---|
| 1. | శ్రీరామచంద్ర భగవానుని కడకు నారదుడు వచ్చుట | 63-66 |
| 2. | రాజ్యాభిషేకసన్నాహము - వసిష్ఠ రామ సంవాదము | 67-74 |
| 3. | దశరథుడు కైకకు వరములిచ్చుట | 75-82 |

| సర్గ | విషయము | పుట |
|---|---|---|
| 4. | శ్రీరాముడు తల్లి అనుజ్ఞ తీసికొనుట, సీతాలక్ష్మణ సమేతుడై వనవాసమునకు సంసిద్ధుడగుట | 83-91 |
| 5. | శ్రీరాముడు వనమున కేగుట | 92-98 |
| 6. | గంగాతరణము - భరద్వాజ, వాల్మీకి మునులతో సమాగమము | 99-106 |
| 7. | సుమంత్రుడు అయోధ్యకు తిరిగి వచ్చుట, దశరథమహారాజు స్వర్గస్థుడగుట, భరతుడు మేనమామల ఇంటి నుండి వచ్చుట మరియు వసిష్ఠుని ఆదేశముతో తండ్రికి అంత్యేష్టి సంస్కారము చేయుట. | 107-116 |
| 8. | భరతుని వనగమనము; నిషాద, భరద్వాజ సమాగమము; చిత్రకూట దర్శనము | 117-123 |
| 9. | శ్రీరామ భరత సమాగమము - భరతుడు అయోధ్యకు, శ్రీరాముడు అత్రిముని ఆశ్రమమునకు పోవుట. | 124-132 |

## అరణ్యకాండము

| | | |
|---|---|---|
| 1. | విరాధవధ | 133-137 |
| 2. | శరభంగ సుతీక్ష్ణాది మునీశ్వరుల సందర్శనము | 138-143 |
| 3. | అగస్త్యమునివరునితో సమాగమము. | 144-150 |
| 4. | పంచవటీ నివాసము - లక్ష్మణోపదేశము | 151-156 |
| 5. | శూర్పణఖ భంగపాటు - ఖరాది రాక్షస వధ, రావణునకు శూర్పణఖ నివేదన. | 157-162 |

| సర్గ | విషయము | పుట |
|---|---|---|
| 6. | రావణుడు మారీచుని కడకేగుట | 163-166 |
| 7. | మారీచ వధ - సీతాపహరణము | 167-175 |
| 8. | సీతా వియోగమున రాముని విలాపము - జటాయు సమాగమము | 176-181 |
| 9. | కబంధోద్ధరణము | 182-187 |
| 10. | శబరితో సమాగమము | 188-191 |


## కిష్కింధకాండము


| సర్గ | విషయము | పుట |
|---|---|---|
| 1. | సుగ్రీవునితో సమాగమము | 193-203 |
| 2. | వాలి వధ - కపీశ నరేశ సంవాదము | 204-212 |
| 3. | తారావిలాపము - శ్రీరామసాంత్వనము - సుగ్రీవ పట్టాభిషేకము | 213-218 |
| 4. | రామ లక్ష్మణుల సంభాషణము - క్రియాయోగవిశ్లేషణము | 219-224 |
| 5. | శ్రీరామ విలాపము - లక్ష్మణుని కిష్కింధాగమనము | 225-230 |
| 6. | సీతాన్వేషణము - స్వయంప్రభ చరితము | 231-239 |
| 7. | వానర ప్రాయోపవేశము -సంపాతి కలయిక | 240-245 |
| 8. | సంపాతి ఆత్మ కథ | 246-251 |
| 9. | సముద్రోల్లంఘన సమాలోచనము | 252-255 |


## సుందరకాండము


| సర్గ | విషయము | పుట |
|---|---|---|
| 1. | హనుమంతుడు సముద్రమును లంఘించుట - లంకలో ప్రవేశించుట | 257-264 |
| 2. | హనుమ అశోకవాటిక చేరుట, రావణుడు సీతను భయపెట్టుట | 265-271 |
| 3. | సీతా హనుమ సంభాషణ, అశోకవన ధ్వంసము - బ్రహ్మపాశ బంధము | 272-280 |
| 4. | హనుమద్రావణ సంవాదము - లంకాదహనము | 281-288 |
| 5. | సీతకు వీడుకోలు - శ్రీరామునకు వేడికోలు | 289-296 |


## యుద్ధకాండము


| సర్గ | విషయము | పుట |
|---|---|---|
| 1. | సమర సన్నాహములు | 297-302 |
| 2. | విభీషణ నిష్కాసనము | 303-306 |
| 3. | విభీషణ శరణాగతి - సేతుబంధనము | 307-315 |
| 4. | సముద్ర తరణము - లంకానగర దర్శనము - శుక రావణ సంవాదము | 317-320 |
| 5. | శుకుని పూర్వచరిత్ర, మాల్యవంత హితోపదేశము, సంగ్రామారంభము | 321-328 |
| 6. | లక్ష్మణుని మూర్ఛ - రామరావణ సంగ్రామము సంజీవనీ అనయనము - రావణ కాలనేమి సంవాదము | 329-334 |
| 7. | కాలనేమి వధ - లక్ష్మణుడు తేరుకొనుట - కుంభకర్ణుని మేలుకొలుపు | 335-341 |
| 8. | కుంభకర్ణ వధ | 342-348 |
| 9. | మేఘనాద వధ | 349-355 |
| 10. | రావణ యజ్ఞ విధ్వంసము - రావణ మండోదరీ సంవాదము | 356-361 |
| 11. | రామ రావణ సంగ్రామము - రావణ నిధనము | 362-371 |
| 12. | విభీషణ పట్టాభిషేకము - సీత అగ్నిప్రవేశము | 372-379 |

# శ్రీజానకీ జీవనాష్టకమ్

ఆలోక్య యస్యాతిలలామలీలాం
సద్భాగ్యభాజౌ పితరౌ కృతార్థౌ.
తమర్భకం దర్పకదర్పచోరం
శ్రీజానకీజీవనమానతోఽస్మి. 1

శ్రుత్వైవ యో భూపతిమాత్తవాచం
వనం గతస్తేన న నోదితోఽపి.
తం లీలయాహ్లాదవిషాదశూన్యం
శ్రీజానకీజీవనమానతోఽస్మి. 2

జటాయుషో దీనదశాం విలోక్య
ప్రియావియోగప్రభవం చ శోకమ్.
యో వై విసస్మార తమార్ద్రచిత్తం
శ్రీజానకీజీవనమానతోఽస్మి. 3

యో వాలినా ధ్వస్తబలం సుకంఠం
న్యయోజయద్రాజపదే కపీనామ్.
తం స్వీయసంతాపసుతప్తచిత్తం
శ్రీజానకీజీవనమానతోఽస్మి. 4

యద్ధ్యాననిర్ధూతవియోగవహ్నిర్వి
దేహబాలా విబుధారివన్యామ్.
ప్రాణాందధే ప్రాణమయం ప్రభుం తం
శ్రీజానకీజీవనమానతోఽస్మి. 5

యస్యాతివీర్యాంబుధివీచిరాజౌ
వంశ్యైరహో వైశ్రవణో విలీనః
తం వైరివిధ్వంసనశీలలీలం
శ్రీజానకీజీవనమానతోఽస్మి. 6

యద్రూపరాకేశమయూఖమాలా-
నురంజితా రాజరమాపి రేజే.
తం రాఘవేంద్రంవిబుధేంద్రవంద్యం
శ్రీజానకీజీవనమానతోఽస్మి. 7

ఏవం కృతా యేన విచిత్రలీలా
మాయామనుష్యేణ నృపచ్ఛలేన.
తం వై మరాలం మునిమానసానాం
శ్రీజానకీజీవనమానతోఽస్మి. 8

1. బాలకాండము :- ఎవ్వాని సుందర బాల్య చేష్టలను తిలకించి, తిలకించి భాగ్యశాలురగు ఆ తల్లిదండ్రులు (కౌసల్యా దశరథులు) పులకించి కృతార్థులైనారో, అట్టి మన్మథుని గర్వమును హరింపజేయు బాలరాముడగు శ్రీ జానకీ ప్రాణనాథునికి నమస్కరించుచున్నాను.

2. అయోధ్యకాండము :- దశరథ మహారాజా వాగ్దానమును స్వయముగా తనతో చెప్పుకున్నను, పితృవాక్య పరిపాలనా తత్పరుడై వనసీమలకేగుచున్న శ్రీరామచంద్రుని వదనారవిందము (రాజ్యాభిషేకవార్తను విని) హర్షాతిరేకముతో విప్పారలేదు; (వనవాస దీక్షను విని) శోకాకులమై వాడిపోలేదు; అట్టి సమభావయుక్త నిత్యసౌందర్యోపేతము (మంగళప్రదము) అగు శ్రీజానకీ ప్రాణనాథునికి నమస్కరించుచున్నాను.

3. అరణ్యకాండము :- (రావణుని తోడి సంగరమున) క్షతగాత్రుడై పడియున్న జటాయువు దీనదశను చూచి, ఏ దయార్ద్ర హృదయశీలి, తన ప్రియురాలగు సీతావియోగ జనిత శోకమును కూడా విస్మరింప గలిగిన కరుణారస వరుణాలయుడగు శ్రీ జానకీ ప్రాణనాథునికి నమస్కరించుచున్నాను.

4. కిష్కింధాకాండము :- వాలి వలన పీడింపబడిన స్వీయమిత్రుడగు సుగ్రీవుని సంతాపమును సైపలేక పరితపించెడు హృదయముతో వెంటనే వానర రాజ్యాధిపత్యమున నియోగించినవాడగు, (భక్తవరదుడగు) శ్రీ జానకీ ప్రాణనాథునికి నమస్కరించుచున్నాను.

5. సుందరకాండము :- అశోకవనములో (రాక్షసీ గణము మధ్య) నిలచిన సీతాదేవి ఎవ్వాని తదేక ధ్యానము వలన వియోగాగ్నిని నాశమొనరించుకొని ప్రాణములు నిలుపుకొనెనో, అట్టి (సకల ప్రాణుల) ప్రాణప్రదుడగు శ్రీరామచంద్ర ప్రభువగు శ్రీజానకీ నాథునకు నమస్కరించుచున్నాను.

6. యుద్ధకాండము :- ఎవ్వాని అతిలోక పరాక్రమ సముద్ర తరంగశ్రేణులలో రావణాసురుని వంశము కలిసిపోయెనో, అట్టి శత్రువినాశకరుడగు శ్రీజానకీ ప్రాణనాథునికి నమస్కరించుచున్నాను.

7. ఉత్తరకాండము :- ఎవ్వాని రూపము యొక్క చంద్ర శీతల కిరణాల మాలికలతో (కోసల) రాజ్యలక్ష్మి కూడా పరవశించి పోయినదో, అట్టి రాఘవేంద్రుడు, సకల దేవగణవంద్యుడగు శ్రీ జానకీ ప్రాణనాథునికి నమస్కరించుచున్నాను.

8. శరణాగతి :- మాయామానుష రూపముతో, రాజలాంఛన మిషతో, లోకోత్తరమగు లీలలు ప్రదర్శించిన మునిమానస రాజహంసయగు, శ్రీ జానకీ ప్రాణనాథునికి నమస్కరించుచున్నాను.

---ooo---

॥ శ్రీరామ ॥

# శ్రీ గాయత్రీ రామాయణమ్

ఓం తపః స్వాధ్యాయనిరతం తపస్వీ వాగ్విదాం వరమ్
నారదం పరిపప్రచ్ఛ వాల్మీకిర్మునిపుఙ్గవమ్. 1

స హత్వా రాక్షసాన్ సర్వాన్ యజ్ఞఘ్నాన్ రఘునందనః
ఋషిభిః పూజితస్సమ్యగ్ యథేంద్రో విజయే పురా. 2

విశ్వామిత్రస్స ధర్మాత్మా శ్రుత్వా జనకభాషితమ్
వత్స రామ ధనుః పశ్య ఇతి రాఘవమబ్రవీత్. 3

తుష్టావాస్య తదా వంశం ప్రవిశ్య స విశాంపతేః
శయనీయం నరేంద్రస్య తదాసాద్య వ్యతిష్ఠత. 4

వనవాసం హి సంఖ్యాయ వాసాంస్యాభరణాని చ
భర్తారమనుగచ్ఛంత్యై సీతాయై శ్వశురో దదౌ. 5

రాజా సత్యం చ ధర్మశ్చ రాజా కులవతాం కులమ్
రాజా మాతా పితా చైవ రాజా హితకరో నృణామ్. 6

నిరీక్ష్య స ముహూర్తం తు దదర్శ భరతో గురుమ్
ఉటజే రామమాసీనం జటామండల ధారిణమ్. 7

యది బుద్ధిః కృతా ద్రష్టుమగస్త్యం తం మహామునిమ్
అద్యైవ గమనే బుద్ధిం రోచయస్వ మహామతే. 8

భరతస్యార్యపుత్రస్య శ్వశ్రూణాం మమ చ ప్రభో
మృగరూపమిదం దివ్యం విస్మయం జనయిష్యతి. 9

గచ్ఛ శీఘ్రమితో వీర సుగ్రీవం తం మహాబలమ్
వయస్యం తం కురు క్షిప్రమితో గత్వాద్య రాఘవ. 10

దేశకాలౌ భజస్వాద్య క్షమమాణః ప్రియాప్రియే
సుఖదుఃఖసహః కాలే సుగ్రీవవశగో భవ. 11

వన్దితవ్యాస్తపః సిద్ధాస్తపసా వీతకల్మషాః
ప్రష్టవ్యా చాపి సీతాయాః ప్రవృత్తిర్వినయాన్వితైః. 12

స నిర్జిత్య పురీం లఙ్కాం శ్రేష్ఠాం. తాం కామరూపిణీమ్
విక్రమేణ మహాతేజా హనూమాన్ కపిసత్తమః. 13

ధన్యా దేవాః సగంధర్వాః సిద్ధాశ్చ పరమర్షయః
మమ పశ్యంతి యే వీరం రామం రాజీవలోచనమ్. 14

మంగలాభిముఖీ తస్య సా తదాసీన్మహాకపేః
ఉపతస్థే విశాలాక్షీ ప్రయతా హవ్యవాహనమ్. 15

హితం మహార్థం మృదుహేతుసంహితం
వ్యతీతకాలాయతి సంప్రతి క్షమమ్
నిశమ్య తద్వాక్యముపస్థితజ్వరః
ప్రసఙ్గవానుత్తరమేతదబ్రవీత్. 16

ధర్మాత్మా రక్షసాంశ్రేష్ఠః సంప్రాప్తోయం విభీషణః
లంకైశ్వర్యమిదం శ్రీమాన్ ధ్రువం ప్రాప్నోత్యకంటకమ్. 17

యో వజ్రపాతాశనిసన్నిపాతా
న్నచుక్షుభే నాపి చచాల రాజా
స రామబాణాభిహతో భృశార్త
శ్చచాల చాపంచ ముమోచ వీరః. 18

యస్య విక్రమమాసాద్య రాక్షసా నిధనం గతాః
తం మన్యే రాఘవం వీరం నారాయణమనామయమ్. 19

న తే దదృశిరే రామం దహన్తమపి వాహినీమ్
మోహితాః పరమాస్త్రేణ గాంధర్వేణ మహాత్మనా. 20

ప్రణమ్య దేవతాభ్యశ్చ బ్రాహ్మణేభ్యశ్చ మైథిలీ
బద్ధాఞ్జలిపుటా చేదమువాచాగ్ని సమీపతః. 21

చాలనాత్ పర్వతస్యైవ గణా దేవస్య కంపితాః
చచాల పార్వతీ చాపి తదాశ్లిష్టా మహేశ్వరమ్. 22

దారాః పుత్రాః పురం రాష్ట్రం భోగాచ్ఛాదనభాజనమ్
సర్వమేవావిభక్తం నౌ భవిష్యతి హరీశ్వర. 23

యామేవ రాత్రిం శత్రుఘ్నః పర్ణశాలాం సమావిశత్
తామేవ రాత్రిం సీతాపి ప్రసూతా దారకద్వయమ్. 24

ఇదం రామాయణం కృత్స్నం గాయత్రీబీజ సంయుతమ్
త్రిసన్ధ్యం యః పఠేన్నిత్యం సర్వపాపైః ప్రముచ్యతే. 25

మఙ్గలం కోసలేంద్రాయ మహనీయ గుణాబ్ధయే
చక్రవర్తితనూజాయ సార్వభౌమాయ మఙ్గలమ్. 26

══★══

# శ్రీరామ - స్తుతి

ఆపదామపహర్తారం దాతారం సర్వసంపదామ్ ।
లోకాభిరామం శ్రీరామం భూయో భూయో నమామ్యహమ్ ॥
రామాయ రామభద్రాయ రామచంద్రాయ మానసే ।
రఘునాథాయ నాథాయ సీతాయాః పతయే నమః ॥
నీలాంబుజశ్యామలకోమలాఙ్గం
సీతాసమారోపితవామభాగమ్ ।
పాణౌ మహాసాయకచారుచాపం
నమామి రామం రఘువంశనాథమ్ ॥
శ్రీరామచంద్ర కృపాలు భజు మన హరణ భవభయ దారుణం ।
నవకంజ-లోచన, కంజ-ముఖ, కర-కంజ పద కంజారుణం ॥
కందర్ప అగణిత అమిత ఛబి, నవనీల-నీరద సుందరం ।
పట పీత మానహు తడిత రుచి శుచి నౌమి జనక సుతావరం ॥
భజు దీనబంధు దినేశ దానవ-దైత్యవంశ-నికందనం ।
రఘునంద ఆనందకంద కోశలచంద దశరథ-నందనం ॥
సిర్ ముకుట్ కుండల్ తిలక్ చారు ఉదారు అంగ విభూషణం ।
ఆజానుభుజ శర-చాప-ధర్, సంగ్రామ-జిత్-ఖరదూషణం ॥
ఇతి వదతి తులసీదాస్ శంకర-శేష-ముని-మన-రంజనం ।
మమ హృదయ-కంజ నివాస కురు, కామాది ఖలదల-గంజనం ॥

# శ్రీ హనుమత్-స్తవన్

ప్రనవఉం పవనకుమార ఖల బన పావక గ్యానఘన ।
జాసు హృదయ అగార బసహిం రామ సర చాప ధర్ ॥
అతులితబలధామం హేమశైలాభదేహం
దనుజవనకృశానుం జ్ఞానినామగ్రగణ్యమ్ ।
సకలగుణనిధానం వానరాణామధీశం
రఘుపతిప్రియభక్తం వాతజాతం నమామి ॥
గోష్పదీకృతవారీశం మశకీకృతరాక్షసమ్ ।
రామాయణమహామాలారత్నం వందేఽనిలాత్మజమ్ ॥
అఞ్జనానందనం వీరం జానకీశోకనాశనమ్ ।
కపీశమక్షహంతారం వందే లఙ్కాభయఙ్కరమ్ ॥
ఉల్లఙ్ఘ్య సింధోః సలిలం సలీలం
యః శోకవహ్నిం జనకాత్మజాయాః ।
ఆదాయ తేనైవ దదాహ లఙ్కాం
నమామి తం ప్రాఞ్జలిరాఞ్జనేయమ్ ॥
మనోజవం మారుతతుల్యవేగం జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠమ్ ।
వాతాత్మజం వానరయూథముఖ్యం శ్రీరామదూతం శరణం ప్రపద్యే ॥
ఆఞ్జనేయమతిపాటలాననం కాఞ్చనాద్రికమనీయవిగ్రహమ్ ।
పారిజాతతరుమూలవాసినం భావయామి పవమాననందనమ్ ॥
యత్ర యత్ర రఘునాథకీర్తనం తత్ర తత్ర కృతమస్తకాఞ్జలిమ్ ।
బాష్పవారిపరిపూర్ణలోచనం మారుతిం నమత రాక్షసాంతకమ్ ॥

॥ శ్రీహరిః ॥

ఓం శ్రీపరమాత్మనే నమః

# అధ్యాత్మ రామాయణము

## మాహాత్మ్యము

రామం విశ్వమయం వందే రామం వందే రఘూద్వహమ్ । రామం విప్రవరం వందే రామం శ్యామాగ్రజం భజే ॥
యస్య వాగంశుతః ఖ్యాతం రమ్యం రామాయణామృతమ్ । శైలజాసేవితం వందే తం శివం సోమరూపిణమ్ ॥
సచ్చిదానందసందోహం భక్తిభూతివిభూషణమ్ । పూర్ణానందమహం వందే సద్గురుం శంకరం స్వయమ్ ॥
అజ్ఞానధ్వాంతసంహర్త్రీ జ్ఞానాలోకవిలాసినీ । చంద్రచూడవచశ్చంద్రచంద్రికేయం విరాజతే ॥

జయతి రఘువంశతిలకః కౌసల్యానంది వర్ధనో రామః
దశవదన నిధనకారీ దాశరథిః పుండరీకాక్షః

అప్రమేయత్రయాతీతనిర్మలజ్ఞానమూర్తయే,
మనోగిరాం విదూరాయ దక్షిణామూర్తయే నమః. 1

ప్రత్యక్షాది ప్రమాణములచే నిర్దేశింపబడనివాడు, త్రిగుణాతీతుడు, మాలిన్యరహితుడు, జ్ఞానస్వరూపుడు, మనోవాక్కులకు అందనివాడగు దక్షిణామూర్తి భగవాను (సదాశివు)నకు నమస్కారములు (1).

సూత ఉవాచ

కదాచిన్నారదో యోగీ పరానుగ్రహవాంఛయా,
పర్యటన్సకలాఁల్లోకాన్ సత్యలోకముపాగమత్. 2

తత్ర దృష్ట్వా మూర్తిమద్భిశ్ఛందోభిః పరివేష్టితమ్,
బాలార్కప్రభయా సమ్యగ్భాసయంతం సభాగృహమ్. 3

మార్కండేయాదిమునిభిః స్తూయమానం ముహుర్ముహుః
సర్వార్థగోచరజ్ఞానం సరస్వత్యా సమన్వితమ్. 4

చతుర్ముఖం జగన్నాథం భక్తాభీష్టఫలప్రదమ్.
ప్రణమ్య దండవద్భక్త్యా తుష్టావ మునిపుంగవః. 5

సూతుడు ఇట్లు అనెను–''ఒకానొక సమయమున పరమయోగి యగు నారదుడు ఇతరులకు మేలు చేయు నుద్దేశ్యముతో, సమస్త లోకములు సంచరించుచు, సత్యలోకమును చేరెను. (2) అచ్చట మూర్తిమంతములైన వేదములచే పరివృతుడై, బాలసూర్యసమప్రభచే సభాభవనమును సంపూర్ణముగా ప్రకాశింపచేయుచు, మార్కండేయాది మునులచే పలుమారులు స్తుతింపబడుచున్నవాడు, సమస్త పదార్థముల జ్ఞానము కలవాడు, భక్తులకు అభీష్టఫలముల నిచ్చువాడు, సరస్వతీసహితుడు, జగత్పతి యగు బ్రహ్మను చూచి మునిపుంగవుడగు నారదుడు భక్తిపూర్వకముగా సాష్టాంగప్రణామము చేసి స్తుతించెను. (3-5)

సన్తుష్టస్తం మునిం ప్రాహ స్వయంభూర్వైష్ణవోత్తమమ్,
కిం ప్రష్టుకామస్త్వమసి తద్వదిష్యామి తే మునే. 6

అంతట స్వయంభువైన బ్రహ్మ ప్రసన్నుడై వైష్ణవోత్తముడైన నారదునితో ఇట్లనెను – ''మహామునీ! నీవేమి ప్రశ్నింపగోరుచున్నావు? నేను నీకు ఆ విషయములన్నియు తెలిపెదను.'' (6)

ఇత్యాకర్ణ్య వచస్తస్య మునిర్బ్రహ్మాణమబ్రవీత్,
త్వత్తః శ్రుతం మయా సర్వం పూర్వమేవ శుభాశుభమ్. 7

ఇదానీమేకమేవాస్తి శ్రోతవ్యం సురసత్తమ,
తద్రహస్యమపి బ్రూహి యది తేఽనుగ్రహో మయి. 8

బ్రహ్మ పలికిన యీ మాటలువిని నారదుడు ఆయనతో '' ఓ దేవశ్రేష్ఠా! శుభాశుభ కర్మలగూర్చి నేను మీనుండి ఇంతకుమునుపే వినియున్నాను. ఇంక నేను వినదగు విషయమొక్కటియే యున్నది. నాపై మీకు కృపయున్నచో రహస్యమైనను నాకది వినిపింపుడు''. (7-8)

ప్రాప్తే కలియుగే ఘోరే నరాః పుణ్యవివర్జితాః,
దురాచారరతాః సర్వే సత్యవార్తాపరాఙ్ముఖాః. 9

ఘోరమైన కలియుగము ప్రారంభమైన తరువాత, మానవులు పుణ్యకర్మలు వదలివేయుదురు. సత్యభాషణము నందు విముఖులై దురాచార ప్రవృత్తులగుదురు (9).

పరాపవాదనిరతాః పరద్రవ్యాభిలాషిణః,
పరస్త్రీసక్తమనసః పరహింసాపరాయణాః. 10

దేహాత్మదృష్టయో మూఢా నాస్తికాః పశుబుద్ధయః,
మాతాపితృకృతద్వేషాః స్త్రీదేవాః కామకింకరాః. 11

విప్రా లోభగ్రహగ్రస్తా వేదవిక్రయజీవినః,
ధనార్జనార్థమభ్యస్తవిద్యా మదవిమోహితాః. 12

త్యక్తస్వజాతికర్మాణః ప్రాయశః పరవంచకాః,
క్షత్రియాశ్చ తథా వైశ్యాః స్వధర్మత్యాగశీలినః. 13

తద్వచ్ఛూద్రాశ్చ యే కేచిద్బ్రాహ్మణాచారతత్పరాః,
స్త్రియశ్చ ప్రాయశో భ్రష్టా భర్త్రవజ్ఞాననిర్భయాః. 14

శ్వశురద్రోహకారిణ్యో భవిష్యంతి న సంశయః,
ఏతేషాం నష్టబుద్ధీనాం పరలోకః కథం భవేత్. 15

ఇతి చిన్తాకులం చిత్తం జాయతే మమ సంతతమ్,
లఘూపాయేన యేనైషాం పరలోకగతిర్భవేత్,
తముపాయముపాఖ్యాహి సర్వం వేత్తి యతో భవాన్.16

ఇత్యృషేర్వాక్యమాకర్ణ్య ప్రత్యువాచాంబుజాసనః,
సాధు పృష్టం త్వయా సాధో వక్ష్యే తచ్ఛృణు సాదరమ్.17

పురా త్రిపురహన్తారం పార్వతీ భక్తవత్సలా,
శ్రీరామతత్త్వం జిజ్ఞాసుః పప్రచ్ఛ వినయాన్వితా. 18

ప్రియాయై గిరిశస్తస్యై గూఢం వ్యాఖ్యాతవాన్ స్వయమ్,
పురాణోత్తమమధ్యాత్మరామాయణమితి స్మృతమ్. 19

తత్పార్వతీ జగద్ధాత్రీ పూజయిత్వా దివానిశమ్,
ఆలోచయంతీ స్వానందమగ్నా తిష్ఠతి సాంప్రతమ్. 20

ప్రచరిష్యతి తల్లోకే ప్రాణ్యదృష్టవశాద్యదా,
తస్యాధ్యయనమాత్రేణ జనా యాస్యన్తి సద్గతిమ్. 21

తావద్విజృంభతే పాపం బ్రహ్మహత్యాపురఃసరమ్,
యావజ్జగతి నాధ్యాత్మరామాయణముదేష్యతి. 22

తావత్కలిమహోత్సాహో నిశ్శంకం సంప్రవర్తతే,
యావజ్జగతి నాధ్యాత్మరామాయణముదేష్యతి. 23

ఇతరులను నిందించుటలో ఆసక్తి కలవారగుదురు. ఇతరుల ధనము నభిలషింతురు. పరస్త్రీలయందు మనసు పెట్టెదరు. పరులను హింసింతురు (10). వారు దేహమే ఆత్మగా భావించువారు, మూఢులు, నాస్తికులు, పశుప్రవృత్తి కలవారు, తల్లిదండ్రులను ద్వేషించువారు, స్త్రీలకు భక్తులు, కామమునకు దాసులు అగుదురు. బ్రాహ్మణులు లోభబుద్ధి కలవారై వేదములను అమ్మి తన జీవనము గడపుకొను వారగుదురు. ధనార్జనకొరకే విద్యాభ్యాసము చేయుదురు. విద్యాబ్రాహ్మణత్వముల మదముతో మోహితులగుదురు. తమ జాతి కర్మలను విడచి తరచుగా ఇతరులను వంచింతురు. ఇట్లే క్షత్రియ వైశ్య గణములు కూడా స్వధర్మమును వీడును. శూద్రులు కూడ బ్రాహ్మణాచార తత్పరులయ్యెదరు. స్త్రీలు భ్రష్టాచారిణులై, నిర్భయముగా తమ భర్తలను అవమానించెదరు. తమ అత్తమామలకు ద్రోహము చేయుదురు. ఈ మాట యందెట్టి సందేహము లేదు. నష్టబుద్ధులైన ఇట్టివారికి పరలోకప్రాప్తి ఎట్లు కలుగును (11-15)? ఈ చింతతో నా మనసు వ్యాకులపడుచున్నది. ఏవిధమైన సులభోపాయముచే వీరికి ఉత్తమలోకప్రాప్తి కలుగునో దానిని నాకు తెలియచేయవలయును. ఏలయన మీరు సర్వము తెలిసినవారు కదా (16)'' అని ప్రార్థించెను.

దేవర్షియగు నారదుని మాటవిని కమలాసనుడైన బ్రహ్మ ఇట్లనెను - ''సాధుపుంగవా! నీవు చాల మంచి విషయము గురించి అడిగితివి. నేనా విషయమును (సులభోపాయమును) తెలిపెదను. నీవు శ్రద్ధాళుడవై వినుము (17). పూర్వము భక్తవత్సలయగు పార్వతీదేవి శ్రీరామ తత్త్వము తెలియగోరి వినయపూర్వకముగా త్రిపురసంహారి యగు శంకరభగవానుని ప్రార్థించెను (18). అంత మహాదేవుడు తన ప్రియురాలగు పార్వతీదేవికి స్వయముగా అతి రహస్యమైన అధ్యాత్మ రామాయణమని ప్రసిద్ధినొందిన ఉత్తమపురాణమును (గూర్చి) వివరించి చెప్పెను (19).

జగజ్జనని పార్వతి దానిని పూజించి, రేయింబవళ్లు మననము చేయుచు, ఎల్లవేళల ఆత్మానందమున నిమగ్నురాలాయెను (20).

జీవకోటి సౌభాగ్యముచే అధ్యాత్మ రామాయణము లోకమున ప్రచారము పొందినపుడు అధ్యయన మాత్రముననే సకలజనులు సద్గతుల నొందుదురు (21).

ప్రపంచమున అధ్యాత్మ రామాయణము ప్రాదుర్భావము కానంతవరకు మాత్రమే బ్రహ్మహత్యాది పాపములు వృద్ధి చెందుచుండును (22). అధ్యాత్మ రామాయణము (లోకములో) ప్రచలితము కానంతవరకే కలియుగదుష్ప్రభావము నిశ్శంకముగ పెచ్చరిల్లుచుండును

తావద్యమభటాః శూరాః సంచరిష్యంతి నిర్భయాః,
యావజ్జగతి నాధ్యాత్మరామాయణముదేష్యతి. 24

తావత్సర్వాణి శాస్త్రాణి వివదంతే పరస్పరమ్. 25

తావత్స్వరూపం రామస్య దుర్బోధం మహతామపి,
యావజ్జగతి నాధ్యాత్మరామాయణముదేష్యతి. 26

అధ్యాత్మరామాయణసంకీర్తనశ్రవణాదిజమ్,
ఫలం వక్తుం న శక్నోమి కార్త్స్న్యేన మునిసత్తమ. 27

తథాపి తస్య మాహాత్మ్యం వక్ష్యే కించిత్తవానఘ,
శృణు చిత్తం సమాధాయ శివేనోక్తం పురా మమ. 28

అధ్యాత్మరామాయణతః శ్లోకం శ్లోకార్థమేవ వా,
యః పఠేద్భక్తిసంయుక్తః స పాపాన్ముచ్యతే క్షణాత్. 29

యస్తు ప్రత్యహమధ్యాత్మరామాయణమనన్యధీః,

యథాశక్తి వదేద్భక్త్యా స జీవన్ముక్త ఉచ్యతే. 30

యో భక్త్యార్చయతేఽధ్యాత్మరామాయణమతంద్రితః,
దినే దినేఽశ్వమేధస్య ఫలం తస్య భవేన్మునే. 31

యదృచ్ఛయాపి యోఽధ్యాత్మరామాయణమనాదరాత్,
అన్యతః శృణుయాన్మర్త్యః సోఽపి ముచ్యేత పాతకాత్. 32

నమస్కరోతి యోఽధ్యాత్మరామాయణమదూరతః,
సర్వదేవార్చనఫలం స ప్రాప్నోతి న సంశయః. 33

లిఖిత్వా పుస్తకేఽధ్యాత్మరామాయణమశేషతః,
యో దద్యాద్రామభక్తేభ్యస్తస్య పుణ్యఫలం శృణు. 34

అధీతేషు చ వేదేషు శాస్త్రేషు వ్యాకృతేషు చ,
యత్ఫలం దుర్లభం లోకే తత్ఫలం తస్య సమ్భవేత్. 35

ఏకాదశీదినేఽధ్యాత్మరామాయణముపోషితః,
యో రామభక్తః సదసి వ్యాకరోతి నరోత్తమః. 36

తస్య పుణ్యఫలం వక్ష్యే శృణు వైష్ణవసత్తమ,
ప్రత్యక్షరం తు గాయత్రీపురశ్చర్యాఫలం భవేత్. 37

(23). అధ్యాత్మరామాయణము ప్రకటితము కానంతవరకే శూరులైన యమభటులు నిశ్శంకగా నిర్భయులై సంచరింపుచుందురు (24). అధ్యాత్మ రామాయణము ప్రకాశితము కానంతవరకే వివిధశాస్త్రముల నడుమ పరస్పర వివాదము లుండును. మహాపురుషులకు కూడ శ్రీరామచంద్రుని యథార్థస్వరూపము తెలియుట కష్టసాధ్యము. (25-26)

ఓ మునివరా! నేను కూడ అధ్యాత్మరామాయణ కీర్తన శ్రవణములచే కలుగు ఫలమును సంపూర్ణముగా వర్ణింపజాలను. ఐనను ఓ పుణ్యశీలీ! దాని మాహాత్మ్యమును కొంత వివరించెదను. పూర్వము దీనిని పరమశివుడు నాకు వినిపించెను. నీవు సావధానచిత్తుడవై వినుము. (27-28) అధ్యాత్మరామాయణమునందలి ఒక్క శ్లోకముగాని, అర్ధ శ్లోకముగాని, భక్తితో చదివినవాడు తత్క్షణమే పాపవిముక్తుడగును (29). అధ్యాత్మరామాయణమును అనన్యచిత్తముతో నిత్యము భక్తిపూర్వకముగా యథాశక్తి వినిపించువాడు జీవన్ముక్తుడగును (30). ఓ మునిశ్రేష్ఠా! అలసత్వము వదలి భక్తిపూర్వకముగా అనుదినము అధ్యాత్మ రామాయణమును పూజించువానికి అశ్వమేధయజ్ఞ ఫలము లభించును. (31)

అబుద్ధిపూర్వకముగాగాని నియమ రహితముగా అనాదరముతో గాని, యాదృచ్ఛికముగా గాని ఇతరులనుండి అధ్యాత్మరామాయణ శ్రవణము చేయువాడు కూడ సమస్త పాపములనుండి ముక్తుడగును (32). అధ్యాత్మ రామాయణ గ్రంథమునకు దగ్గరగానుండి నమస్కరించువాడు సమస్త దేవతలను పూజించిన ఫలము పొందుననుటలో సంశయము ఏ మాత్రము లేదు (33).

(ఇంక) అధ్యాత్మరామాయణ గ్రంథము సంపూర్ణముగ వ్రాసి శ్రీరామభక్తులకు ఇచ్చెడివాడు పొందెడి ఫలము వినుము (34). వేదాధ్యయనము చేయుట చేతను, శాస్త్రములను వ్యాఖ్యానించుట చేతను, దుర్లభమైన ఫలము వానికి ప్రాప్తించును (35).

ఓ వైష్ణవాగ్రేసరా! ఏకాదశి రోజున ఉపవసించి, సభయందు అధ్యాత్మరామాయణము వ్యాఖ్యానించు రామభక్తునికి లభించు పుణ్యఫలమును తెలిపెదను వినుము. అతడు చదువు ప్రతి అక్షరము వలన గాయత్రీ మంత్ర పునశ్చరణ ఫలము లభించును (36-37). శ్రీరామనవమి

ఉపవాసవ్రతం కృత్వా శ్రీరామనవమీదినే,
రాత్రౌ జాగరితోఽధ్యాత్మరామాయణమనన్యధీః,
యః పఠేచ్ఛృణుయాద్వాపి తస్య పుణ్యం వదామ్యహమ్. 38

కురుక్షేత్రాదినిఖిలపుణ్యతీర్థేష్వనేకశః,
ఆత్మతుల్యం ధనం సూర్యగ్రహణే సర్వతోముఖే. 39

విప్రేభ్యో వ్యాసతుల్యేభ్యో దత్త్వా యత్ఫలమశ్నుతే,
తత్ఫలం సమవాప్నోతి సత్యం సత్యం న సంశయః. 40

యో గాయతే ముదాఽధ్యాత్మరామాయణమహర్నిశమ్,
ఆజ్ఞాం తస్య ప్రతీక్షన్తే దేవా ఇంద్రపురోగమాః. 41

పఠన్నిత్యమహముధ్యాత్మరామాయణమనువ్రతః,
యద్యత్కరోతి తత్కర్మ తతః కోటిగుణం భవేత్. 42

తత్ర శ్రీరామహృదయం యః పఠేత్సుసమాహితః,
స బ్రహ్మఘ్నోఽపి పూతాత్మా త్రిభిరేవ దినైర్భవేత్. 43

శ్రీరామహృదయం యస్తు హనూమత్ప్రతిమాన్తికే,
త్రిః పఠేన్నిత్యహం మౌనీ స సర్వేప్సితభాగ్భవేత్. 44

పఠన్ శ్రీరామహృదయం తులస్యశ్వత్థయోర్యది,
ప్రత్యక్షరం ప్రకుర్వీత బ్రహ్మహత్యానివర్తనమ్. 45

శ్రీరామగీతామాహాత్మ్యం కృత్స్నం జానాతి శంకరః,
తదర్థం గిరిజా వేత్తి తదర్థం వేద్మ్యహం మునే. 46

తత్తే కిఞ్చిత్ప్రవక్ష్యామి కృత్స్నం వక్తుం న శక్యతే,
యజ్ఞాత్వా తత్క్షణాల్లోకశ్చిత్తశుద్ధిమవాప్నుయాత్. 47

శ్రీరామగీతా యత్పాపం న నాశయతి నారద,
తన్న నశ్యతి తీర్థాదౌ లోకే క్వాపి కదాచన,
తన్న పశ్యామ్యహం లోకే మార్గమాణోఽపి సర్వదా. 48

రామేణోపనిషత్సింధుమున్మథ్యోత్పాదితాం ముదా,
లక్ష్మణాయార్పితాం గీతాసుధాం పీత్వామరో భవేత్. 49

పర్వదినమున ఉపవాసముచేసి రాత్రి జాగరణముచేసి అనన్యమనస్కుడై అధ్యాత్మరామాయణ పఠనము గాని శ్రవణముగాని గావించు పురుషుని పుణ్యఫలము తెలిపెదను (వినుము) (38). కురుక్షేత్రాది సకల పుణ్య క్షేత్రములలో సంపూర్ణ సూర్యగ్రహణ సమయమున పలుమార్లు వ్యాసభగవానునితో సమానులైన బ్రాహ్మణులకు తన యథాశక్తి తనకు ప్రియమైన ధనమును సమర్పించగా కలుగు ఫలితము అతనికి లభించును. ఇది ముమ్మాటికి సత్యము. ఇందు సందేహము లేదు (39-40). అహర్నిశము ప్రసన్నచిత్తుడై అధ్యాత్మరామాయణము గానము చేయువాని ఆజ్ఞకై ఇంద్రాది దేవతలు సైతము నిరీక్షించు చుందురు (41). ''అధ్యాత్మరామాయణమును ప్రతిదినము నియమ పూర్వకముగా పఠించు మానవుడు, తాను చేయు ఏ పుణ్యకర్మ ఫలముకన్నను కోటిరెట్లు ఫలము పొందును (42). ఈ అధ్యాత్మరామాయణ గ్రంథాంతర్గతమైన శ్రీరామ హృదయమును ఏకాగ్రచిత్తుడై పఠించినవాడు బ్రహ్మఘాతి అయినను, మూడు దినములలోనే పవిత్రు డగును (43). హనుమంతుని ప్రతిమ ముందు నిలిచి, ప్రతిదినము ముమ్మారు మౌనముగ శ్రీరామహృదయము పఠించువాడు అన్ని కోర్కెలను పొందును (44). తులసి మొక్క వద్దగాని, రావిచెట్టువద్ద గాని నిలిచి శ్రీరామ హృదయమును పఠించునతని ప్రతి అక్షరము బ్రహ్మహత్యాది పాపములను దూరము గావించును (45).

''మునివరా! శ్రీరామగీతా మాహాత్మ్యమును శ్రీమహాదేవుడు మాత్రమే సంపూర్ణముగా తెలిసినవాడు. ఆతడెరిగిన దానిలో సగభాగము పార్వతీదేవికి తెలియును. ఆమెకు తెలిసినదానిలో సగము నాకు తెలియును (46). అందుచే ఆ మాహాత్మ్యమును సంపూర్ణముగా నేను వినిపించజాలను. దేనిని తెలిసికొని లోకము తక్షణమే చిత్తశుద్ధి పొందగలుగునో, ఆ కొంచెము (మాహాత్మ్యము) నీకు వినిపించెదను (47).

''నారదా! 'శ్రీరామగీత' నశింపచేయ(లే)ని పాపము లోకములో తీర్థాదులు సేవించుట వలన (కూడ) నశించదు. లోకములో ఎన్నిమారులు (ఎంత) వెదకినను శ్రీరామగీత వలన నశించని పాపము నాకు కానరాలేదు. అనగా శ్రీరామ గీతా పఠనముచే తొలగని పాపమే లేదు (48). శ్రీరాముడు ఉపనిషత్సాగరమును మథించి, ఆవిర్భవింప చేసిన గీతామృతమును ప్రసన్నహృదయుడై లక్ష్మణున కిచ్చెను. దానిని పానమొనర్చెడి మానవులు ముక్తులు కాగలరు (49).

జమదగ్నిసుతః పూర్వం కార్తవీర్యవధేచ్ఛయా,
ధనుర్విద్యామభ్యసితుం మహేశస్యాన్తికే వసన్. 50

అధీయమానాం పార్వత్యా రామగీతాం ప్రయత్నతః,
శ్రుత్వా గృహీత్వాసౌ పఠన్నారాయణకలామగాత్. 51

బ్రహ్మహత్యాదిపాపానాం నిష్కృతిం యది వాంఛతి,
రామగీతాం మాసమాత్రం పఠిత్వా ముచ్యతే నరః. 52

దుష్ప్రతిగ్రహదుర్భోజ్యదురాలాపాదిసమ్భవమ్,
పాపం యత్తత్కీర్తనేన రామగీతా వినాశయేత్. 53

శాలగ్రామశిలాగ్రే చ తులస్యశ్వత్థసన్నిధౌ,
యతీనాం పురతస్తద్వద్రామగీతాం పఠేత్తు యః. 54

సతత్ఫలమవాప్నోతి యద్వాచో౽పి న గోచరమ్. 55

రామగీతాం పఠన్భక్త్యా యః శ్రాద్ధే భోజయేద్ద్విజాన్,
తస్య తే పితరః సర్వే యాన్తి విష్ణోః పరం పదమ్. 56

ఏకాదశ్యాం నిరాహారో నియతో ద్వాదశీదినే,
స్థిత్వాగస్త్యతరోర్మూలే రామగీతాం పఠేత్తు యః
స ఏవ రాఘవః సాక్షాత్సర్వదేవైశ్చ పూజ్యతే. 57

వినా దానం వినా ధ్యానం వినా తీర్థావగాహనమ్,
రామగీతాం నరో౽ధీత్య తదనంతఫలం లభేత్. 58

బహునా కిమిహోక్తేన శృణు నారద తత్త్వతః,
శ్రుతిస్మృతిపురాణేతిహాసాగమశతాని చ,
అర్హంతి నాల్పమధ్యాత్మరామాయణకలామపి. 59

అధ్యాత్మరామచరితస్య మునీశ్వరాయ
మాహాత్మ్యమేతదుదితం కమలాసనేన,
యః శ్రద్ధయా పఠతి వా శృణుయాత్స మర్త్యః
ప్రాప్నోతి విష్ణుపదవీం సురపూజ్యమానః. 60

''పూర్వకాలమున సహస్రార్జునుని వధించు తలపుతో, జమదగ్ని నందనుడైన పరశురాముడు ధనుర్విద్యాభ్యాసము చేయుటకు శ్రీమహాదేవుని సన్నిధిలో నుండి (50), పార్వతిచే పఠించబడు రామగీతను విని, ఆసక్తితో దానిని ఆమెనుండి పరిగ్రహించి, పఠించి శ్రీమన్నారాయణుని కళను పొందెను (51). మానవుడు బ్రహ్మహత్యాది ఘోరపాపములనుండి ముక్తుడు కాదలచెనేని, కేవలము ఒక మాసము శ్రీరామగీతా పారాయణము చేసి విముక్తుడు కాగలడు (52). కూడనివి దానముగా పరిగ్రహించుట, నిషిద్ధములను భుజించుట, దుర్భాషలాడుటచేత కలుగు పాపము రామగీతా పారాయణముచే తొలగును (53). సాలగ్రామశిల ముందు గాని తులసిమొక్క వద్దగాని రావిచెట్టు చెంతగాని యతీశ్వరుల సన్నిధియందుగాని శ్రీరామగీత పారాయణము చేయువానికి లభించు ఫలము మాటల కందనిది (54-55)

శ్రాద్ధములలో ''రామగీతను'' భక్తిపూర్వకముగా పఠించుచు, బ్రాహ్మణులకు భోజనము సమర్పించెడివాని సమస్త పితృదేవతాగణము శ్రీమహావిష్ణువు పరమధామము చేరును. ఏకాదశీ తిథియందు ఉపవసించి జితేంద్రియుడై, ద్వాదశీతిథియందు అగస్త్యవృక్షము క్రింద కూర్చుండి శ్రీరామగీతను పారాయణము చేయువాడు సాక్షాత్తుగ శ్రీరామచంద్రస్వరూపుడే యగును. సమస్త దేవతలచే పూజించబడును (57). దానము చేత గాని ధ్యానముచేత గాని తీర్థస్నానము చేత గాని పొందు ఫలములను, మానవుడు వాటిని ఆచరించకున్నను శ్రీరామగీతాపఠనముచే అక్షయఫలములు పొందుచున్నాడు (58). నారదా! పలుమాటలేల! యథార్థమును వినుము. శ్రుతి స్మృతి పురాణ ఇతిహాసాదులు, వందలాది (ఇతర) శాస్త్రములు అధ్యాత్మ రామాయణముయొక్క స్వల్పాంశమునకైనను సరిరావు'' (59).

ఈ అధ్యాత్మరామాయణ మాహాత్మ్యమును బ్రహ్మ, మునీశ్వరుడగు నారదునికి తెల్పెను. దీనిని శ్రద్ధాపూర్వకముగా చదివెడి, వినెడి మానవుడు దేవతలచే పూజించబడి శ్రీమహావిష్ణుపదము పొందును (60).

( ఇది బ్రహ్మాండపురాణములో ఉత్తరఖండాంతర్గత అధ్యాత్మరామాయణ మాహాత్మ్యము – సంపూర్ణము)



సీతా లక్ష్మణ భరత శత్రుఘ్న హనుమత్ సమేత శ్రీరామచంద్ర సభ



श्रीदशरथ-नन्दन Śrī Daśarathanandana (The darling of Daśaratha)




क्रीड़ा-वेशमें आनन्दकन्द The blissful Lord in sport-costume




चारों भाई वर-वेशमें

The four brothers in wedding-costume



पादुका-दान

Sandals handed over




जटायुकी स्तुति

The Prayer by Jaṭāyu



हनुमान्‌जीकी प्रार्थना

The Prayer by Hanumān



भूधराकार हनुमान् The mountainous Hanumān



भगवान् श्रीरामका राज्याभिषेक

The coronation of Lord Rāma




श्रीरामदरबारकी झाँकी

Rāma's Court—A panoramic view

॥ శ్రీహరిః ॥

ఓం శ్రీపరమాత్మనే నమః

# అధ్యాత్మ రామాయణము

## బాలకాండము

## ప్రథమ సర్గము

### శ్రీరామ హృదయము

యః పృథ్వీభరవారణాయ దివిజైః
    సంప్రార్థితశ్చిన్మయః
సంజాతః పృథివీతలే రవికులే
    మాయామనుష్యోఽవ్యయః,
నిశ్చక్రం హతరాక్షసః పునరగాద్
    బ్రహ్మత్వమాద్యం స్థిరాం
కీర్తిం పాపహరాం విధాయ జగతాం
    తం జానకీశం భజే. 1

చిన్మయుడు, అవ్యయుడు అగు పరమాత్మ (శ్రీమహావిష్ణువు) భూభారము బాపుటకై దేవతలచే ప్రార్థింపబడి భూలోకమున సూర్యవంశమున మాయా మానుషరూపముతో అవతరించి రాక్షససమూహమును వధించి లోకమున పాపవినాశినియగు తన స్థిరకీర్తిని స్థాపించి (తిరిగి అవతార ప్రయోజనము ముగిసిన పిదప) తన ఆది బ్రహ్మ స్వరూపమున లీనమైన జానకీనాథుని నేను భజించుచున్నాను (1).

విశ్వోద్భవస్థితిలయాదిషు హేతుమేకం
    మాయాశ్రయం విగతమాయమచింత్యమూర్తిమ్
ఆనందసాంద్రమమలం నిజబోధరూపం
    సీతాపతిం విదితతత్త్వమహం నమామి. 2

విశ్వముయొక్క ఉత్పత్తి, స్థితి, లయములకు ఒకే (మూల) కారణమై, మాయను ఆశ్రయించినను మాయాతీతుడై, అచింత్యస్వరూపుడై ఆనందఘనుడై, రాగాది దోషరహితుడై, నిర్మలుడై, స్వయంప్రకాశ స్వరూపుడై, స్వస్వరూప, యాథాత్మ్యజ్ఞానయుతుడై (వెలయు) శ్రీసీతాపతికి నమస్కరించుచున్నాను (2).

పఠంతి యే నిత్యమనన్యచేతసః
    శృణ్వంతి చాధ్యాత్మికసంజ్ఞితం శుభమ్,
రామాయణం సర్వపురాణసమ్మతం
    నిర్ధూతపాపా హరిమేవ యాంతి తే. 3

సర్వపురాణ సమ్మతము, పవిత్రము అగు ఈ ''అధ్యాత్మ రామాయణము''ను ఏకాగ్రచిత్తముతో నిత్యము పఠించువారు, వినెడివారు పాపరహితులై శ్రీహరిని పొందెదరు (3). సంసారబంధమునుండి విముక్తులు కాదలచినవారు ''అధ్యాత్మరామాయణము''నే నిత్యము పఠించవలెను. దీనిని నిత్యము శ్రవణము చేయువారికి అసంఖ్యాక గోదానఫలము లభించును. (4)

అధ్యాత్మరామాయణమేవ నిత్యం
    పఠేద్యదీచ్ఛేద్భవబంధముక్తిమ్,
గవాం సహస్రాయుతకోటిదానాత్
    ఫలం లభేద్యః శృణుయాత్స నిత్యమ్. 4

పురారిగిరిసంభూతా శ్రీరామార్ణవసంగతా,
అధ్యాత్మరామగంగేయం పునాతి భువనత్రయమ్. 5

త్రిపురాంతక (శంకర)మను పర్వతమునుండి బయలువెడలి శ్రీరామ(రూప) సాగరమున సంగమించెడి యీ అధ్యాత్మరామాయణ గంగానది మూడు లోకములను పవిత్రము గావించును (5).

కైలాసాగ్రే కదాచిద్రవిశతవిమలే
మందిరే రత్నపీఠే
సంవిష్టం ధ్యాననిష్ఠం త్రినయనమభయం
సేవితం సిద్ధసంఘైః,
దేవీ వామాంగసంస్థా గిరివరతనయా
పార్వతీ భక్తినమ్రా,
ప్రాహేదం దేవమీశం సకలమలహరం
వాక్యమానందకందమ్. 6

ఒకానొక సమయమున కైలాసగిరి శిఖరముపై వేనవేల సూర్యుల ప్రకాశముతో వెలిగెడి శుభమందిరమున రత్నసింహాసనముపై ధ్యానావస్థయందున్న సిద్ధసమూహ సేవితుని, నిత్యనిర్భయుని, సర్వపాపహారిని, ఆనంద నిలయుని, దేవదేవుని, త్రిలోచనుని, పరమశివుని, అతని వామాంకమున విరాజిల్లు గిరికుమారి పార్వతి భక్తితో వినమ్ర భావముతో ఇట్లు అడిగెను (6).

పార్వత్యువాచ

నమోఽస్తు తే దేవ జగన్నివాస
సర్వాత్మదృక్ త్వం పరమేశ్వరోఽసి,
పృచ్ఛామి తత్త్వం పురుషోత్తమస్య
సనాతనం త్వం చ సనాతనోఽసి. 7

(పార్వతీదేవి ఇట్లనెను -) "దేవా! జగన్నివాసా! నమస్కారము. మీరు సకల జీవుల అంతఃకరణములకు సాక్షి పరమేశ్వరులు! పురుషోత్తముడైన భగవానుని సనాతన తత్త్వము గురించి నేను మిమ్ము ప్రశ్నింపగోరుచున్నాను. ఎందుకనగా మీరు కూడ సనాతనులే (7).

గోప్యం యదత్యంతమనన్యవాచ్యం
వదంతి భక్తేషు మహానుభావాః,
తదప్యహోఽహం తవ దేవ భక్తా
ప్రియోఽసి మే త్వం వద యత్తు పృష్టమ్. 8

జ్ఞానం సవిజ్ఞానమథానుభక్తి-
వైరాగ్యయుక్తం చ మితం విభాస్వత్,
జానామ్యహం యోషిదపి త్వదుక్తం
యథా తథా బ్రూహి తరంతి యేన. 9

"మహాత్ములైనవారు ఇతరులకు తెలుపకూడనంతటి అత్యంత రహస్యవిషయములను గూడా భక్తులకు చెప్పుచుందురు. ఓ దేవా! నేను తమ భక్తురాలను. కావున (నేనడుగబోవు) దానిని మీరు తెలుపుడు. నాకు మీరు ఎంతో ప్రియులు. కావున నేనేమి కోరితినో అది వర్ణించి తెలుపుడు (8). ఏ జ్ఞానముద్వారా మానవుడు సంసార సముద్రము దాటగలడో, అట్టి భక్తివైరాగ్యపరిపూర్ణమగు విజ్ఞానయుతమైన ఆత్మజ్ఞానమును సహజముగా స్త్రీనైన నేను (కూడ) గ్రహించునట్లు హిత, మిత వచనములతో అనుగ్రహింపుడు (9).

పృచ్ఛామి చాన్యచ్చ పరం రహస్యం
తదేవ చాగ్రే వద వారిజాక్ష,
శ్రీరామచంద్రేఽఖిలలోకసారే
భక్తిర్దృఢా నౌర్భవతి ప్రసిద్ధా. 10

"ఓ విశాలాక్షా! నేను మరొక పరమ రహస్యమును (గూర్చి) మిమ్ము ప్రశ్నింతును. దయతో దీనిని ముందుగ మీరు వర్ణింపుడు. అఖిలలోకసారుడగు శ్రీరామచంద్రుని యందలి విశుద్ధభక్తియే సంసారసాగరమును దాటుటకు సుదృఢమగు నౌకయని ప్రసిద్ధి! (10).

భక్తిః ప్రసిద్ధా భవమోక్షణాయ
నాన్యత్తతః సాధనమస్తి కించిత్,
తథాపి హృత్సంశయబంధనం మే
విభేత్తుమర్హస్యమలోక్తిభిస్త్వమ్. 11

"ఈ సంసారమునుండి విముక్తి పొందుటకు భక్తి కన్న శ్రేష్ఠమైన సాధనము వేరొకటి లేదని ప్రసిద్ధము. కావున నా హృదయము నందలి సంశయగ్రంథిని విచ్ఛేదము గావింపుడు (11).

వదంతి రామం పరమేకమాద్యం
నిరస్తమాయాగుణసంప్రవాహమ్.
భజంతి చాహర్నిశ మప్రమత్తాః
పరం పదం యాంతి తథైవ సిద్ధాః. 12

వదంతి కేచిత్పరమోఽపి రామః
స్వావిద్యయా సంవృతమాత్మసంజ్ఞమ్.
జానాతి నాత్మానమతః పరేణ
సంబోధితో వేద పరాత్మతత్త్వమ్. 13

యది స్మ జానాతి కుతో విలాపః
సీతాకృతేఽనేన కృతః పరేణ.
జానాతి నైవం యది కేన సేవ్యః
సమో హి సర్వైరపి జీవజాతైః. 14

అత్రోత్తరం కిం విదితం భవద్భి -
స్తద్బ్రూత మే సంశయభేది వాక్యమ్. 15

శ్రీమహాదేవ ఉవాచ

ధన్యాసి భక్తాసి పరాత్మనస్త్వం
యజ్జ్ఞాతుమిచ్ఛా తవ రామతత్త్వమ్.
పురా న కేనాప్యభిచోదితోఽహం
వక్తుం రహస్యం పరమం నిగూఢమ్. 16

త్వయాద్య భక్త్యా పరినోదితోఽహం
వక్ష్యే నమస్కృత్య రఘూత్తమం తే.
రామః పరాత్మా ప్రకృతేరనాది -
రానంద ఏకః పురుషోత్తమో హి. 17

స్వమాయయా కృత్స్నమిదం హి సృష్ట్వా
నభోవదంతర్బహిరాస్థితో యః,
సర్వాంతరస్థోఽపి నిగూఢ ఆత్మా
స్వమాయయా సృష్టమిదం విచష్టే. 18

జగంతి నిత్యం పరితో భ్రమంతి
యత్సన్నిధౌ చుంబకలోహవద్ధి.
ఏతన్న జానంతి విమూఢచిత్తాః
స్వావిద్యయా సంవృతమానసా యే. 19

ఏకాగ్రచిత్తముతో సిద్ధపురుషులు శ్రీరామచంద్రుని పరముడని, అద్వితీయుడని, సర్వమునకు ఆదికారణమని, ప్రకృతిగుణ ప్రవాహమునకు అతీతుడని తెలిపెదరు. వారు రేయింబవళ్లు శ్రీరామునే భజించి పరమపదస్థానమును పొందుదురు (12).

"శ్రీరాముడు పరబ్రహ్మమైనను, తన మాయచే కప్పబడియున్న కారణమున ఆత్మస్వరూపము గుర్తెరుగలేదు. అందువలననే ఇతరుల (యోగవాశిష్ఠాది) ఉపదేశముల ద్వారా ఆత్మతత్త్వము తెలిసికొనగలిగెనని కొందరు చెప్పుదురు (13). కావున నేను ప్రశ్నించునది ఏమనగా ఆత్మతత్త్వము గుర్తెరింగినచో పరమాత్మ సీతకై అంతగా ఏల విలపించును? ఒకవేళ అతడు ఆత్మజ్ఞానము లేనివాడైన అన్యులగు సామాన్య జీవులతో సమానమే యగును కదా! అపుడు అతనిని ఏల భజించవలెను? ఈ విషయమున మీరు ఏమి బదులు చెప్పుదురు? నా సందేహము తొలగు విధముగా దీనిని వివరింపుడు (14-15).

శ్రీమహాదేవుడు ఇట్లు చెప్పెను - "దేవీ! నీవు ధన్యురాలవు. శ్రీరామతత్త్వము ఎరుగవలెనను కోర్కె కలిగిన నీవు పరమాత్ముని పరమభక్తురాలవు. ఇంతకుముందు ఈ పరమ నిగూఢ రహస్యమును వర్ణింపుడని ప్రేరణ యిచ్చిన వారెవరును లేరు (16). నేడు నీ భక్తిభరితమగు ప్రశ్నచే సంతుష్టుడనై నేను శ్రీరఘునాథునకు వందనము గావించి శ్రీరామతత్త్వమును నీకు తెల్పెదను. శ్రీరామచంద్రుడు పరమాత్మ. ప్రకృతికి అతీతుడు, ఆనందఘనుడు, అద్వితీయుడు, పురుషోత్తముడు ఇది నిశ్చయము. (17)

"ఎందువలననగా అతడే తన మాయచేత సమస్త జగత్తును సృష్టించి దీని లోపల వెలుపల అంతట ఆకాశము వలె వ్యాపించి ఆత్మరూపముతో అందరి అంతఃకరణములలో నుండి తన మాయచే విశ్వమును నడిపించుచున్నాడు (18). లోహము జడమైనను, అయస్కాంత సమీపమున నుంటచే చలించుచున్నది. అట్లే ప్రపంచము కూడా పరమాత్మయగు శ్రీరాముని సత్తాశక్తిచే అన్నివంకల పరిభ్రమించుచుండును. అజ్ఞానము ఆవరించిన మనసు గల మూఢులు ఇది గుర్తెరుంగరు (19).

స్వాజ్ఞానమప్యాత్మని శుద్ధబుద్ధే
స్వారోపయంతీహ నిరస్తమాయే.
సంసారమేవానుసరంతి తే వై
పుత్రాదిసక్తాః పురుకర్మయుక్తాః. 20

"అట్టి మూఢులు మాయాతీత, శుద్ధ బుద్ధ స్వరూపమైన పరమాత్మయందు కూడ తమ అజ్ఞానమును ఆరోపింతురు. అనగా అతడు కూడ తమవలెనే అజ్ఞానిగా తలతురు. అట్టి మానవులు సర్వదా స్త్రీపుత్రాదులయందాసక్తి కలవారై అనేక కర్మలలో నిమగ్నులై సంసారచక్రములోనే పరిభ్రమించుచుందురు (20).

జానంతి నైవం హృదయే స్థితం వై
చామీకరం కంఠగతం యథాజ్ఞాః,
యథాప్రకాశో న తు విద్యతే రవౌ
జ్యోతిః స్వభావే పరమేశ్వరే తథా,
విశుద్ధవిజ్ఞానఘనే రఘూత్తమే
ఽవిద్యా కథం స్యాత్పరతః పరాత్మని. 21

ఆ అజ్ఞానులు తమ మెడలోనున్న కంఠాభరణమునే ఎరుగని విధముగా తమ హృదయములోని పరమాత్మను శ్రీరామచంద్రునిగా ఎరుగజాలరు. అందువలన తమ అజ్ఞానమును శ్రీరామునియందు ఆరోపించుచున్నారు. వాస్తవముగా జ్యోతిస్వరూపుడైన సూర్యునియందు అంధకారముండనట్లు ప్రకృత్యాదుల కతీతుడు, విశుద్ధవిజ్ఞానఘనుడు, పరమేశ్వరుడు, పరమాత్మయగు శ్రీరామునిలో అవిద్య ఎట్లుండును? (21)

యథా హి చాక్ష్ణా భ్రమతా గృహాదికం
వినష్టదృష్టేర్భ్రమతీవ దృశ్యతే,
తథైవ దేహేంద్రియకర్తురాత్మనః
కృతం పరేఽధ్యస్య జనో విముహ్యతి. 22

నాహో న రాత్రిః సవితుర్యథా భవేత్
ప్రకాశరూపావ్యభిచారతః క్వచిత్,
జ్ఞానం తథాజ్ఞానమిదం ద్వయం హరౌ
రామే కథం స్థాస్యతి శుద్ధచిద్ఘనే. 23

"గిరగిర తిరుగువానికి ఏ విధముగా దృష్టిదోషము వలన గృహాదులు తిరుగుచున్నట్లు కనిపించునో, అదే విధముగా మానవుడు తన దేహము ఇంద్రియరూపమైన కర్త ద్వారా జరుగు పనులను దేహముకంటె పరమైన ఆత్మయందు ఆరోపించి, మోహితుడగుచున్నాడు (22). ప్రకాశస్వరూపుడైన సూర్యునియందు ప్రకాశము తప్ప ఇతర మిశ్రమ (ద్రవ్య)మేమియు లేకుండుటచే అతనికి రాత్రి పగలు అను భేదము ఉండదు. అట్లే శుద్ధచేతన ఘనస్వరూపుడైన రామునియందు జ్ఞానము, అజ్ఞానమను ద్వైదీభావము ఎట్లుండును? (అనగా అతడు జ్ఞాన ఘన స్వరూపుడే) (23).

తస్మాత్పరానందమయే రఘూత్తమే
విజ్ఞానరూపే హి న విద్యతే తమః,
అజ్ఞానసాక్షిణ్యరవిందలోచనే
మాయాశ్రయత్వాన్న హి మోహకారణమ్. 24

అత్ర తే కథయిష్యామి రహస్యమపి దుర్లభమ్,
సీతారామమరుత్సూనుసంవాదం మోక్షసాధనమ్. 25

"అందువలన పరమానంద స్వరూపుడు, విజ్ఞాన స్వరూపుడు, పరమేశ్వరుడగు శ్రీరామునిలో అజ్ఞానము లేశమాత్రమైనను లేదు. అతడు ప్రకృతికి ఆధారభూతుడు. మాయ అతని అధీనములో నుండును. కావున విశాలాక్షి! మాయ శ్రీరాముని మోహింపచేయజాలదు (24). ఓ పార్వతీ! ఈ విషయమై నీకు అత్యంత గోపనీయము పరమ దుర్లభము అయిన మోక్షసాధనరూపమగు శ్రీసీతారామ హనుమత్సంవాదమును వినిపించెదను (25).

పురా రామాయణే రామో రావణం దేవకంటకమ్,
హత్వా రణే రణశ్లాఘీ సపుత్రబలవాహనమ్. 26

సీతయా సహ సుగ్రీవలక్ష్మణాభ్యాం సమన్వితః,
అయోధ్యామగమద్రామో హనూమత్ప్రముఖైర్వృతః. 27

పూర్వము శ్రీరామావతార కాలమున రణకోవిదుడగు శ్రీరామచంద్రుడు, దేవలోక కంటకుడగు రావణుని పుత్రసేనావాహన సహితముగా యుద్ధమున పరిమార్చి, సీతా సుగ్రీవ లక్ష్మణ సహితుడై హనుమదాది వానర పరివృతుడై అయోధ్యాపురి చేరెను (26–27).

అభిషిక్తః పరివృతో వసిష్ఠాద్యైర్మహాత్మభిః,
సింహాసనే సమాసీనః కోటిసూర్యసమప్రభః. 28

దృష్ట్వా తదా హనూమంతం
 ప్రాంజలిం పురతః స్థితమ్,
కృతకార్యం నిరాకాంక్షం
 జ్ఞానాపేక్షం మహామతిమ్. 29

రామః సీతామువాచేదం బ్రూహి తత్త్వం హనూమతే,
నిష్కల్మషోఽయం జ్ఞానస్య పాత్రం నౌ నిత్యభక్తిమాన్. 30

తథేతి జానకీ ప్రాహ తత్త్వం రామస్య నిశ్చితమ్,
హనూమతే ప్రపన్నాయ సీతా లోకవిమోహినీ. 31

రామం విద్ధి పరం బ్రహ్మ సచ్చిదానందమద్వయమ్,
సర్వోపాధివినిర్ముక్తం సత్తామాత్రమగోచరమ్. 32

ఆనందం నిర్మలం శాంతం నిర్వికారం నిరంజనమ్,
సర్వవ్యాపినమాత్మానం స్వప్రకాశమకల్మషమ్. 33

మాంవిద్ధిమూలప్రకృతిం
 సర్గస్థిత్యంతకారిణీమ్,
తస్య సన్నిధిమాత్రేణ
 సృజామీదమతంద్రితా. 34

తత్సాన్నిధ్యాన్మయా సృష్టం తస్మిన్నారోప్యతేఽబుధైః,
అయోధ్యానగరే జన్మ రఘువంశేఽతినిర్మలే. 35

విశ్వామిత్రసహాయత్వం మఖసంరక్షణం తతః,
అహల్యాశాపశమనం చాపభంగో మహేశితుః. 36

మత్పాణిగ్రహణం పశ్చాద్భార్గవస్య మదక్షయః,
అయోధ్యానగరే వాసో మయా ద్వాదశవార్షికః. 37

దండకారణ్యగమనం విరాధవధ ఏవ చ,
మాయామారీచమరణం మాయాసీతాహృతిస్తథా. 38

జటాయుషో మోక్షలాభః కబంధస్య తథైవ చ,
శబర్యాః పూజనం పశ్చాత్సుగ్రీవేణ సమాగమః. 39

అచట రాజ్యాభిషేకము చేసికొని వశిష్ఠాది మహర్షులచేత పరివృతుడై అనంత సూర్యప్రభాభాసమానుడై శ్రీరామచంద్రుడు సింహాసనమున విరాజిల్లుచుండెను (28).

"కృతకృత్యుడు, ఏ కోరికలు లేనివాడు, పరమాత్మ జ్ఞానమునందు మాత్రమే మనసు నిలిపినవాడు, మహాబుద్ధిశాలి యగు హనుమంతుడు అంజలి ఘటించి ఎదురుగా నిలువగా చూచి, శ్రీరాముడు సీతాదేవితో ఇట్లు పలికెను – "ఓ సీతా! ఈ హనుమ మన ఇరువురియందు అచంచలమైన భక్తిగల వాడు. పాపము లేనివాడు. జ్ఞానము పొందుటకు యోగ్యుడు. కనుక నీవు ఇతనికి నా తత్త్వము ఉపదేశించుము" (29-30).

అంత లోకవిమోహిని జనకనందిని సీత శ్రీరామునితో "అట్లే" నని చెప్పి, శరణాగతుడగు హనుమంతునికి రామచంద్రుని యథార్థతత్త్వమును తెలియచేయ మొదలిడెను (31).

సీత చెప్పుచున్నది – "నాయనా! నీవు రాముని సాక్షాత్తుగ అద్వితీయ సచ్చిదానంద ఘనపరబ్రహ్మమని, సర్వ ఉపాధిరహితుడని, సత్తామాత్రుడని, మనసునకు, ఇంద్రియములకు గోచరించనివాడని, ఆనందఘనుడని, నిర్మలుడని, శాంతుడని, నిర్వికారుడని, నిరంజనుడని, సర్వవ్యాపకుడని, స్వయం ప్రకాశక స్వభావుడని, పాపరహితుడని, నిస్సంశయముగా తెలిసికొనుము (32-33). నన్ను ఈ సృష్టి స్థితి లయములు గావించు మూలప్రకృతిగా తెలియుము. నేనే జాగరూకురాలనై ఈతని సన్నిధి మాత్రముననే ఈ విశ్వమును రచించుచున్నాను (34).

"అయినను ఈతని సాన్నిధ్యమున నాచే చేయబడిన రచనను (సృష్టిని) బుద్ధిహీనులు ఈతనియందు ఆరోపించు చున్నారు. అయోధ్యాపురిలో అత్యంత పవిత్రమగు రఘుకులమునందు ఇతడు పుట్టుట, విశ్వామిత్రునకు సహాయముచేయుట, అతని యజ్ఞము రక్షించుట, అహల్యకు శాపవిమోచనము గావించుట, శివధనుర్భంగము గావించుట, పిదప నన్ను పరిణయమాడుట, పరశురాముని గర్వభంగము గావించుట, తదుపరి అయోధ్యానగరములో నాతో పండ్రెండు సంవత్సరములు నివసించుట, దండకారణ్యము నకు వెడలుట, విరాధుని వధించుట, మాయామృగరూపి మారీచుని

వాలినశ్చ వధః పశ్చాత్సీతాన్వేషణమేవ చ,
సేతుబంధశ్చ జలధౌ లంకాయాశ్చ నిరోధనమ్. 40

రావణస్య వధో యుద్ధే సపుత్రస్య దురాత్మనః,
విభీషణే రాజ్యదానం పుష్పకేణ మయా సహ. 41

అయోధ్యాగమనం పశ్చాద్రాజ్యే రామాభిషేచనమ్,
ఏవమాదీని కర్మాణి మయ్యైవాచరితాన్యపి,
ఆరోపయంతి రామేఽస్మిన్నిర్వికారేఽఖిలాత్మని. 42

రామో న గచ్ఛతి న తిష్ఠతి నానుశోచ-
త్యాకాంక్షతే త్యజతి నో న కరోతి కించిత్,
ఆనందమూర్తి రచలః పరిణామహీనో
మాయాగుణాననుగతో హి తథా విభాతి. 43

తతో రామః స్వయం ప్రాహ
హనూమంతముపస్థితమ్,
శృణు తత్త్వం ప్రవక్ష్యామి
హ్యాత్మానాత్మపరాత్మనామ్. 44

ఆకాశస్య యథా భేద
స్త్రివిధో దృశ్యతే మహాన్,
జలాశయే మహాకాశ-
స్తదవచ్ఛిన్న ఏవ హి,
ప్రతిబింబాఖ్యమపరం
దృశ్యతే త్రివిధం నభః. 45

బుద్ధ్యవచ్ఛిన్నచైతన్య-
మేకం పూర్ణమథాపరమ్,
ఆభాసస్త్వపరం బింబ-
భూతమేవం త్రిధా చితిః. 46

వధించుట, మాయాసీత అపహరింపబడుట, తదనంతరము జటాయు, కబంధులకు ముక్తిప్రదానము, శబరి చేత భగవానుడు పూజలు గొనుట, సుగ్రీవునితో మైత్రి చేయుట, వాలిని వధించుట, సీతాన్వేషణము చేయుట, సముద్రముపై వారధి నిర్మించుట, లంకాపురమును ముట్టడించుట, పుత్ర సహితముగా దురాత్ముడగు రావణుని యుద్ధమున చంపుట, విభీషణునికి లంకారాజ్యమునిచ్చి, పుష్పక విమానముపై నాతోడ అయోధ్యానగరమునకు మరలివచ్చుట, రాజ్యమున అభిషిక్తుడగుట - ఇత్యాది సమస్త కర్మలు నాచేత చేయబడినవే అయినను అజ్ఞానులైన జనులు వానిని ఈ నిర్వికారుడు, సర్వాత్మ, భగవానుడగు శ్రీరామచంద్రునియందు ఆరోపించుచున్నారు (35-42).

''శ్రీరాముడు సర్వవ్యాపి అగుట వలన గమనాగమనములు లేవు. ఆ కారణమువలన ఒక్కచోట ఉండువాడు కాడు. నిత్యానంద స్వరూపుడగుటవలన శోకాదులు లేవు. అతడు పూర్ణకాముడు. కావున ఆకాంక్షారహితుడు. ప్రియాప్రియాది ద్వంద్వభావములు లేనందువలన అతనికి రాగ ద్వేషభావములు లేవు. జననాది జడవికార రహితుడు కావున పరిణామి కాడు. ఈ విధముగా ఏ క్రియయు చేయకుండువాడు. ఆనందమూర్తి, అచలుడు, పరిణామహీనుడు, నిర్గుణుడు, మాయాగుణములను అంగీకరించి లీలలు చేయుచు, లోకానుసారిగా ప్రతీతుడగుచున్నాడు (43).

పిమ్మట శ్రీరాముడు సమ్ముఖమున నిలుచుండిన పవనసుతునితో ఇట్లనెను - ''నేను నీకు పరమాత్మ ఆత్మ అనాత్మ తత్త్వములను గూర్చి తెలిపెదను. సావధానముగా వినుము (44).

ఆకాశమునందు మూడు మహాభేదములు కనబడుచున్నవి. ఒకటి మహాకాశము, రెండవది జలావచ్ఛిన్నాకాశము, (జలాశయమునకు పరిమితమైనది) మూడవది జలాశయమునందు నీటిలో ప్రతిబింబించుచున్నది. ఇది ప్రతిబింబాకాశము (45).

అదేవిధముగా చేతనుడు మూడు విధములుగా కనబడును. ఒకటి సర్వత్ర వ్యాపించిన పరిపూర్ణచైతన్యము. అదియే పరమాత్మ, రెండవది బుద్ధ్యవచ్ఛిన్న చైతన్యము. అది బుద్ధియందు వ్యాప్తమైనది. ఇదియే ఆత్మ. మూడవది బుద్ధియందు ప్రతిబింబితమైనది. ఇది ఆభాసచేతనము. దీనిని చిదాభాసమందురు. ఇది అనాత్మ (46).

సాభాసబుద్ధేః కర్తృత్వ
మవిచ్ఛిన్నేఽవికారిణి,
సాక్షిణ్యారోప్యతే భ్రాంత్యా
జీవత్వం చ తథాబుధైః. 47

పరమాత్మ అవిచ్ఛిన్నుడు, అనగా అఖండుడు; సర్వవ్యాపి, అవికారి – అనగా షడ్వికార రహితుడు. ప్రకృతికి సాక్షియగుటచే ప్రకృతికి అతీతుడు. ఆత్మ ఈ పరమాత్మకు అంశమగుటచే అతడు కూడ పితాపుత్ర సంబంధమువలె అపరిచ్ఛిన్నుడు, సాక్షి. పరమాత్మకన్న భిన్నుడు కాడు. కాని సాభాసయుక్తమైన బుద్ధికారణముగా అహంకారమోహితులైన వారు ప్రకృతిగుణములద్వారా చేసిన కర్మలను భ్రమతో ఆత్మకు ఆరోపించి దానియందు కర్తృత్వ, భోక్తృత్వములు కల్పించుచున్నారు. అనగా ఆత్మను కర్తగా, భోక్తగా తలచుచున్నారు (47).

ఆభాసస్తు మృషా
బుద్ధిరవిద్యాకార్యముచ్యతే,
అవిచ్ఛిన్నం తు తద్బ్రహ్మ
విచ్ఛేదస్తు వికల్పతః. 48

ఆభాసమెప్పటికిని మిథ్యయే! బుద్ధి అవిద్యా (అనగా ప్రకృతి) కార్యము. అందుచే ఇది అనాత్మ అనగా జడము (జీవుడు). పరమాత్మ అఖండుడు, అవికారి, సాక్షి. ఆత్మ అతని అంశమగుట వలన అతడు పరమాత్మకంటె వేరు కాడు. వేరుగా ఉన్నటుల కనబడుట వైకల్పికము. అనగా ఆత్మ పరమాత్మ అభిన్నములు (48). ఇదియే జలావచ్ఛిన్న ఆకాశము, మహాకాశము ఒకటియే అని తెలియుట.

అవచ్ఛిన్నస్య పూర్ణేన
ఏకత్వం ప్రతిపాద్యతే,
తత్త్వమస్యాదివాక్యైశ్చ
సాభాసస్యాహమస్తథా. 49

ఐక్యజ్ఞానం యదోత్పన్నం
మహావాక్యేన చాత్మనోః,
తదాఽవిద్యా స్వకార్యైశ్చ
నశ్యత్యేవ న సంశయః. 50

ఇక ఆభాసము మిథ్య. బుద్ధి అవిద్యాకార్యము కనుక జడము అని ముందే తెలుపబడినది. సాభాసయుక్తమైన బుద్ధి యొక్క మిథ్యాభ్రమ, వివేకము ద్వారా దూరమైనపుడు అంశ (జీవుడు) అంశి (పరమాత్మ) యొక్క అభిన్నత్వము అను బోధను సద్గురు ఉపదేశముల ద్వారా 'తత్త్వమసి' మొదలగు శ్రుతివాక్యముల జ్ఞానము పొందినపుడు అవిద్య తనంతట తానే తన కార్యములతో సహా మాయమైపోవును. జ్ఞానము ప్రకాశించును. అపుడే ''ఆత్మ పరమాత్మ అభిన్నము'' అను జ్ఞానము కలుగును (49 – 50).

ఏతద్విజ్ఞాయ మద్భక్తో
మద్భావాయోపపద్యతే,
మద్భక్తివిముఖానాం హి
శాస్త్రగర్తేషు ముహ్యతామ్,
న జ్ఞానం న చ మోక్షః
స్యాత్తేషాం జన్మశతైరపి. 51

ఇంక ఆభాసావచ్ఛిన్నమగు చైతన్యము అనగా జీవుడు. ఇది జడము; ప్రతిబింబ ఆకాశము. ప్రతిబింబ ఆకాశము మహాకాశము కన్న భిన్నము కాదు. అటులే జీవుడు పరమాత్మ కన్న భిన్నుడు కాడు. ఆభాసమైన అహము, అనగా జీవుడు జడము. 'తత్త్వమసి' ఇత్యాది వాక్యములతో పూర్ణుడగు ఈశ్వరునితో ఏకత్వము ప్రతిపాదించబడినది. అపుడు జీవుడు పరమాత్మ అను భేదము తొలగును. 'తత్త్వమసి' అను ఇత్యాది వాక్యములతో ఆత్మకు పరమాత్మతో ఏకత్వము ప్రతిపాదించబడుచున్నట్లు, జీవ పరమాత్మలకు కూడ (సాభాసచేతనునకు అనగా ప్రతిబింబాకాశము) పరమాత్మతో 'తత్త్వమసి' ఇత్యాది వాక్యములతో ఏకత్వము

తస్మాత్క్షీరసముద్రతీరమగమద్
బ్రహ్మాఽథ దేవైర్వృతో
దేవ్యా చాఖిలలోకహృత్స్థమజరం
సర్వజ్ఞమీశం హరిమ్,
అస్తౌషీచ్ఛ్రుతిసిద్ధనిర్మలపదైః
స్తోత్రైః పురాణోద్భవైః -
ర్భక్త్యా గద్గదయా గిరాఽతివిమలై -
రానందబాష్పైర్వృతః. 7

"భూదేవి ప్రార్థనానుసారము అప్పటినుండి బ్రహ్మదేవుడు ఇతర దేవతలతో సహా ఆమెను వెంట నిడుకొని క్షీరసాగరతీరమును చేరెను. సకలప్రాణులకు అంతర్యామి, షడ్వికార రహితుడు, సర్వజ్ఞుడు, సర్వ నియామకుడు అగు శ్రీహరిని వేదప్రసిద్ధములగు దోషగంధ రహితములగు మంత్రములతో, పురాణోక్త స్తోత్రములతో, ఆనందబాష్ప పరిప్లుతుడై, గద్గదస్వరముతో, భక్తి పూర్వకముగా స్తుతించెను (7).

తతః స్ఫురత్సహస్రాంశుసహస్రసదృశప్రభః,
ఆవిరాసీద్ధరిః ప్రాచ్యాం దిశాం వ్యపనయంస్తమః. 8

"అంతట అసంఖ్యాక సూర్యగోళముల తేజస్సుతో సమానమైన ప్రభ కలిగి భగవానుడగు శ్రీహరి దిశల యందలి అంధకారమును దూరము చేయుచు వారి ఎదుట ఆవిర్భవించెను (8). మిరుమిట్లు గొలుపు భగవంతుని ప్రకాశము చూడలేక బ్రహ్మదేవుని కన్నులు మూతపడెను. పుణ్యహీనులు దర్శింప దుర్లభమైన ఆ స్వరూపమును బ్రహ్మ అతి కష్టముతో ఎటులనో చూడగలిగెను.

కథంచిద్దృష్టవాన్బ్రహ్మా దుర్దర్శమకృతాత్మనామ్,
ఇంద్రనీలప్రతీకాశం స్మితాస్యం పద్మలోచనమ్. 9

కిరీటహారకేయూరకుండలైః కటకాదిభిః,
విభ్రాజమానం శ్రీవత్సకౌస్తుభప్రభయాన్వితమ్. 10

స్తువద్భిః సనకాద్యైశ్చ పార్షదైః పరివేష్టితమ్.
శంఖచక్రగదాపద్మవనమాలా విరాజితమ్. 11

స్వర్ణయజ్ఞోపవీతేన స్వర్ణవర్ణాంబరేణ చ.
శ్రియా భూమ్యా చ సహితం గరుడోపరి సంస్థితమ్. 12

హర్షగద్గదయా వాచా స్తోతుం సముపచక్రమే. 13

"ఇంద్రనీలమణి కాంతిగల ముఖమున మందహాసముతో కమలముల వంటి విశాల మనోహర నేత్రములతో, కిరీట, హార, కేయూర కుండల కటకాది భూషణముల సుశోభితుడై శ్రీవత్స కౌస్తుభమణుల కాంతులతో నొప్పుచు, సనకాది భక్తులచే నుతింపబడుచు, నంద సునందాది పార్షదులు నాలుగు వంకల నిలిచియుండగా శంఖ, చక్ర, గదా, పద్మ వనమాలా విరాజితుడై బంగారు యజ్ఞోపవీతముతో, పీతాంబరముతో వెలుగొందుచు శ్రీదేవి, భూదేవి సమేతుడై గరుడారూఢుడై నిలిచిన ఆ దివ్యరూపమును గాంచి, బ్రహ్మ హర్షముతో గద్గదకంఠుడై, స్తుతింప మొదలిడెను" (9-13).

బ్రహ్మోవాచ

నతోఽస్మి తే పదం దేవ ప్రాణబుద్ధీంద్రియాత్మభిః,
యచ్చింత్యతే కర్మపాశాద్ధృది నిత్యం ముముక్షుభిః. 14

బ్రహ్మ ఇట్లనెను – "దేవా! కర్మ బంధమునుండి ముక్తులగుటకు ముముక్షువులు తమ ప్రాణములతో, బుద్ధితో, ఇంద్రియములతో, మనస్సుతో నిత్యము చింతనము చేయు మీ చరణారవిందములకు నేను నమస్కరించుచున్నాను (14).

మాయయా గుణమయ్యా త్వం సృజస్యవసి లుంపసి.
జగత్తేన న తే లేప ఆనందానుభవాత్మనః. 15

మీరు మీ త్రిగుణమయయగు మాయద్వారా జగదుత్పత్తి, పాలన, లయములు గావించుచున్నారు. అయినను జ్ఞానానంద స్వరూపులు అగు మీరు వానితో లిప్తులు కారు (15).

తథా శుద్ధిర్న దుష్టానాం దానాధ్యయనకర్మభిః,
శుద్ధాత్మతా తే యశసి సదా భక్తిమతాం యథా. 16

అతస్తవాంఘ్రిర్మే దృష్టశ్చిత్తదోషాపనుత్తయే,
సద్యోఽంతర్హృదయే నిత్యం మునిభిః సాత్వతైర్వృతః. 17

బ్రహ్మాద్యైః స్వార్థసిద్ధ్యర్థమస్మాభిః పూర్వసేవితః,
అపరోక్షానుభూత్యర్థం జ్ఞానిభిర్హృది భావితః. 18

తవాంఘ్రిపూజానిర్మాల్యతులసీమాలయా విభో,
స్పర్ధతే వక్షసి పదం లబ్ధ్వాపి శ్రీః సపత్నివత్. 19

అతస్త్వత్పాదభక్తేషు తవ భక్తిః శ్రియోఽధికా,
భక్తిమేవాభివాఞ్ఛంతి త్వద్భక్తాః సారవేదినః. 20

అతస్త్వత్పాదకమలే భక్తిరేవ సదాస్తు మే,
సంసారామయతప్తానాం భేషజం భక్తిరేవ తే. 21

ఇతి బ్రువంతం బ్రహ్మాణం బభాషే భగవాన్ హరిః,
కిం కరోమీతి తం వేధాః ప్రత్యువాచాతిహర్షితః. 22

భగవన్ రావణో నామ పౌలస్త్యతనయో మహాన్,
రాక్షసానామధిపతిర్మద్దత్తవరదర్పితః. 23

త్రిలోకీం లోకపాలాంశ్చ బాధతే విశ్వబాధకః,
మానుషేణ మృతిస్తస్య మయా కల్యాణ కల్పితా,
అతస్త్వం మానుషో భూత్వా జహి దేవరిపుం ప్రభో. 24

శ్రీభగవానువాచ

కశ్యపస్య వరో దత్తస్తపసా తోషితేన మే. 25

యాచితః పుత్రభావాయ తథేత్యంగీకృతం మయా,
స ఇదానీం దశరథో భూత్వా తిష్ఠతి భూతలే. 26

"భగవన్! మీ విమల యశమునందు సదా ప్రేమ యుంచు భక్తుల అంతఃకరణమ్ము లెట్లు శుద్ధములగునో, అట్టి శుద్ధిని మలినాంతఃకరణము గలవారు దానాధ్యయనాది శుభకర్మల నాచరించికూడ పొందలేరు (16). కావున భక్తులచేతను, మునిజనుల చేతను నిరంతరము వారి హృదయములలో ధ్యానింపబడునట్టి మీ చరణకమలము లను నేను నా అంతఃకరణ దోషములను తక్షణమే నాశ మొనరించుకొనుటకై నేడు దర్శించితిని (17).

మీ చరణకమలములను ఇంతకు ముందు కూడ మేము బ్రహ్మాదిదేవగణములను మా అభీష్టసిద్ధికై సేవించి యున్నాము. జ్ఞానులగు మునిజనులు అపరోక్షానుభవమునకై తమ హృదయములలో నిరంతరము ధ్యానించిరి (18).

"ఓ ప్రభూ! లక్ష్మీదేవి మీ వక్షస్థలమునందు స్థానము పొందియుండి కూడ పూజాసమయమున మీ చరణముల యందు అర్పించబడిన తులసిమాలను చూచి సవతిని చూచిన రీతి స్పర్ధ కలిగియుండును (19). భక్తుల పట్ల మీకు లక్ష్మీదేవి యెడల కన్న ఎక్కువ ప్రీతి. కాన మీ తత్త్వము నెరిగిన భక్తులు కేవలము మీ భక్తినే కోరుకొందురు (20). దేవా! మీ చరణ కమలములపై నాకు సర్వదా భక్తి యుండుగాక! ఏలయన సంసార రోగగ్రస్తులగు వారికి మీ యందు భక్తి కలిగి యుండుటే దివ్యౌషధప్రాయము" (21).

ఇట్లు స్తుతించు బ్రహ్మతో భగవానుడగు శ్రీహరి "నీకొరకై నేను ఏ కార్యము చేయవలయును?" అని అడిగెను. బ్రహ్మ అత్యంతానందముతో ఇట్లనెను (22) - "దేవా! పులస్త్యనందనుడగు విశ్రవసుని కుమారుడైన రావణుడు రాక్షసులకు రాజు. అతడు నా వరప్రభావముచే అత్యంత దురభిమాని అయ్యెను (23). అతడు మూడు లోకములను లోకపాలకులను బాధించుచు విశ్వపీడాకరు డైనాడు. కల్యాణమూర్తీ! నేనాతని మృత్యువును, మానవుని చేతిలో నిర్ధారించితిని. కావున స్వామీ! మీరు మానవరూపము ధరించి ఆ దేవశత్రువును వధింపుడు"(24).

శ్రీభగవానుడిట్లు చెప్పెను - "పూర్వము నేను కశ్యపుని తపమునకు సంతుష్టుడనై వరము నిచ్చితిని. అతడు నన్ను పుత్రునిగా పొందునట్టి వరము కోరుకొనెను. నేనాతనితో 'తథాస్తు' అని అనుగ్రహించితిని. ఇపుడాతడు దశరథ మహారాజుగా పుడమిపై నున్నాడు (25-26). అతని

తస్యాహం పుత్రతామేత్య కౌసల్యాయాం శుభే దినే,
చతుర్ధాత్మానమేవాహం సృజామీతరయోః పృథక్. 27

యోగమాయాపి సీతేతి జనకస్య గృహే తదా,
ఉత్పత్స్యతే తయా సార్ధం సర్వం సంపాదయామ్యహమ్.
ఇత్యుక్త్వాంతర్దధే విష్ణుర్బ్రహ్మా దేవానథాబ్రవీత్. 28

బ్రహ్మోవాచ

విష్ణుర్మానుషరూపేణ భవిష్యతి రఘోః కులే. 29

యూయం సృజధ్వం సర్వేఽపి వానరేష్వంశసంభవాన్.
విష్ణోః సహాయం కురుత యావత్స్థాస్యతి భూతలే. 30

ఇతి దేవాన్సమాదిశ్య సమాశ్వాస్య చ మేదినీమ్,
యయౌ బ్రహ్మా స్వభవనం విజ్వరః సుఖమాస్థితః. 31

దేవాశ్చ సర్వే హరిరూపధారిణః
స్థితాః సహాయార్థమితస్తతో హరేః,
మహాబలాః పర్వతవృక్షయోధినః
ప్రతీక్షమాణా భగవంతమీశ్వరమ్. 32

యింట శుభదినములలో కౌసల్య మరి ఇతర ఇద్దరు రాణుల కడుపున నాలుగు రూపములతో వేరువేరుగా నన్ను నేనే సృజించుకొనెదను (27). అదే సమయమున యోగమాయ కూడ జనకుని యింట సీతగా అవతరించును. ఆమెను వెంటగొని నేను మీ సమస్త కార్యములు నెరవేర్చెదను''. ఇట్లు తెలిపి శ్రీమహావిష్ణువు అంతర్ధానమాయెను. పిమ్మట బ్రహ్మ దేవతలతో నిట్లనెను (28).

బ్రహ్మ పలికెను - ''విష్ణువు రఘుకులమున మానవ రూపమున అవతరించును. మీరును మీ మీ అంశలతో వానరజాతియందు జన్మించి విష్ణుభగవానుడు భూలోకమున ఉండునంతవరకు అతనికి సహాయము చేయుచుండుడు (29-30)''. ఈ విధముగా దేవతలకు ఆజ్ఞయిచ్చి భూదేవి నోదార్చి సంతాపరహితుడై సుఖముగా బ్రహ్మ తన లోకమునకు వెళ్ళెను (31). ఇట సమస్త దేవగణములు పర్వతములు, వృక్షములు ఆయుధములుగా ధరించి పోరాడునట్టి మహాబలవంతులైన వానర రూపములను దాల్చి భగవానునకు సహాయభూతులగుటకై స్వామి రాకకై నిరీక్షించుచు అందందు ఉండసాగిరి (32).

ఇది శ్రీమదధ్యాత్మరామాయణాంతర్గత ఉమామహేశ్వరసంవాదములో
బాలకాండ - ద్వితీయ సర్గము ॥ 2 ॥

* * * *

ఓమ్

# తృతీయ సర్గము

## శ్రీరామావిర్భావము - బాల్యలీలలు

శ్రీమహాదేవ ఉవాచ

అథ రాజా దశరథః శ్రీమాన్సత్యపరాయణః,
అయోధ్యాధిపతిర్వీరః సర్వలోకేషు విశ్రుతః. 1

సోఽనపత్యత్వదుఃఖేన పీడితో గురుమేకదా,
వసిష్ఠం స్వకులాచార్యమభివాద్యేదమబ్రవీత్. 2

స్వామిన్పుత్రాః కథం మే స్యుః సర్వలక్షణలక్షితాః,
పుత్రహీనస్య మే రాజ్యం సర్వం దుఃఖాయ కల్పతే. 3

తతోఽబ్రవీద్వసిష్ఠస్తం భవిష్యంతి సుతాస్తవ,
చత్వారః సత్త్వసంపన్నా లోకపాలా ఇవాపరాః. 4

శాంతాభర్తారమానీయ ఋష్యశృంగం తపోధనమ్,
అస్మాభిః సహితః పుత్రకామేష్టిం శీఘ్రమాచర. 5

తథేతి మునిమానీయ మంత్రిభిః సహితః శుచిః,
యజ్ఞకర్మ సమారేభే మునిభిర్వీతకల్మషైః. 6

శ్రద్ధయా హూయమానేఽగ్నౌ తప్తజాంబూనదప్రభః,
పాయసం స్వర్ణపాత్రస్థం గృహీత్వోవాచ హవ్యవాట్. 7

గృహాణ పాయసం దివ్యం పుత్రీయం దేవనిర్మితమ్,
లప్స్యసే పరమాత్మానం పుత్రత్వేన న సంశయః. 8

ఇత్యుక్త్వా పాయసం దత్త్వా రాజ్ఞే సోఽంతర్దధేఽనలః,
వవందే మునిశార్దూలౌ రాజా లబ్ధమనోరథః. 9

వసిష్ఠఋష్యశృంగాభ్యామనుజ్ఞాతో దదౌ హవిః,
కౌసల్యాయై సకైకేయ్యై అర్ధమర్ధం ప్రయత్నతః. 10

తతః సుమిత్రా సంప్రాప్తా
జగృధ్నుః పౌత్రికం చరుమ్,
కౌసల్యా తు స్వభాగార్ధం
దదౌ తస్యై ముదాన్వితా. 11

శ్రీమహాదేవుడిట్లు చెప్పెను – ''సకలలోక ప్రసిద్ధుడు, సత్యపరాయణుడు, శ్రీమంతుడు, వీరవరుడు అగు దశరథుడు అయోధ్యాధిపతి. అతడు పుత్రులు లేని కారణమున అత్యంత దుఃఖితుడై ఆచార్యుడు తమ కుల గురువు అయిన వశిష్ఠుని రావించి, నమస్కరించి ఈ విధముగా పలికెను – (1–2) ''ఆచార్యా! ఏ రీతి నాకు సర్వలక్షణ లక్షితులగు పుత్రులు కలిగెదరు? పుత్రులు లేని నాకు ఈ సమస్త రాజ్యము దుఃఖరూపమే యగుచున్నది (3)''.

అపుడు వశిష్ఠుడు దశరథునితో ఇట్లనెను – ''నీకు నలుగురు పుత్రులు జన్మించగలరు. ఆ నలుగురు సత్త్వ సంపన్నులు, అపర లోకపాలురవంటివారు (4). నీవు శాంతాదేవి భర్తయు, తపోధనుడును అగు ఋష్యశృంగుని శీఘ్రముగ రప్పించి అతని వెంటనిడుకొని పుత్రకామేష్టి యజ్ఞమును అనుష్ఠించుము'' (5).

రాజు ''అట్లే యగుగాక'' అని తెలిపి మునివరుడగు ఋష్యశృంగుని రావించి మంత్రి సహితుడై పవిత్రుడై నిష్కల్మష హృదయులగు మునుల సాయముతో యజ్ఞము నారంభించెను (6).

యజ్ఞానుష్ఠాన సమయమున అగ్నిలో శ్రద్ధా పూర్వకముగా ఆహుతులనర్పించగా సువర్ణ సమాన దీధితులతో హవ్యవాహనుడగు అగ్నిదేవుడు ఒక సువర్ణపాత్రలో పాయసము గొని ప్రత్యక్షమై ఇట్లు చెప్పెను (7) – ''రాజా! ఇది దేవనిర్మితమగు, పుత్రప్రదాయినియగు దివ్యపాయసము. దీనిని గైకొనుము. దీనివలన నీవు నిశ్చయముగ సాక్షాత్తు పరమాత్మునే పుత్రునిగా పొందెదవు (8).

అగ్నిదేవుడు ఈ విధముగా పల్కి, ఆ పాయసమును రాజున కిచ్చి అంతర్ధానమొందెను. తదనంతరము దశరథ మహారాజు సఫలమనోరథుడై మునిశ్రేష్ఠులైన వశిష్ఠ ఋష్యశృంగులకు పాదాభివందనము గావించెను. వారి ఆదేశానుసారము జాగరూకతతో కౌసల్యకు, కైకకు సగము సగము పాయసమిచ్చెను (9–10). పుత్రప్రదాయిని యగు ఆ పాయసమునకై సుమిత్ర కూడ అచటికి వచ్చెను. అంతట కౌసల్య తన భాగమునుండి సగము సంతోషముతో ఆమెకు ఇచ్చెను (11).

కైకేయీ చ స్వభాగార్ధం దదౌ ప్రీతిసమన్వితా.
ఉపభుజ్య చరుం సర్వాః స్త్రియో గర్భసమన్వితాః. 12

దేవతా ఇవ రేజుస్తాః స్వభాసా రాజమందిరే,
దశమే మాసి కౌసల్యా సుషువే పుత్రమద్భుతమ్. 13

మధుమాసే సితే పక్షే
నవమ్యాం కర్కటే శుభే,
పునర్వస్వృక్షసహితే
ఉచ్చస్థే గ్రహపంచకే. 14

మేషం పూషణి సంప్రాప్తే పుష్పవృష్టిసమాకులే,
ఆవిరాసీజ్జగన్నాథః పరమాత్మా సనాతనః. 15

నీలోత్పలదలశ్యామః
పీతవాసాశ్చతుర్భుజః,
జలజారుణనేత్రాంతః
స్ఫురత్కుండలమండితః. 16

సహస్రార్కప్రతీకాశః
కిరీటీ కుంచితాలకః,
శంఖచక్రగదాపద్మ
వనమాలావిరాజితః. 17

అనుగ్రహాఖ్యహృత్స్థేందుసూచకస్మితచంద్రికః,
కరుణారససంపూర్ణవిశాలోత్పలలోచనః,
శ్రీవత్సహారకేయూరనూపురాదివిభూషణః. 18

దృష్ట్వా తం పరమాత్మానం
కౌసల్యా విస్మయాకులా,
హర్షాశ్రుపూర్ణనయనా
నత్వా ప్రాంజలిరబ్రవీత్. 19

కౌసల్యోవాచ

దేవదేవ నమస్తేఽస్తు శంఖచక్రగదాధర,
పరమాత్మాచ్యుతోఽనంతః పూర్ణస్త్వం పురుషోత్తమః 20

కైకేయి కూడా ప్రీతిపూర్వకముగా తన భాగమునుండి సగము సుమిత్రకు ఇచ్చెను. ఈ విధముగా హవిస్సును భుజించి ముగ్గురు రాణులు గర్భవతులైరి (12). ఆ ముగ్గురు రాణులు రాజమందిరములో తమ దేహకాంతులతో దేవతలవలె శోభింపసాగిరి. పదియవ మాసమున కౌసల్యాదేవి ఒక అద్భుతరూపుడగు బాలునికి జన్మనిచ్చెను (13). చైత్రమాసము శుక్లపక్షమున నవమినాడు, శుభకరమగు కర్కాటక లగ్నమందు, పునర్వసు నక్షత్రమున ఐదు గ్రహములు ఉచ్చస్థానములో నుండగా, సూర్యుడు మేషరాశి యందుండగా మధ్యాహ్నకాలమునందు, సనాతనుడగు పరమాత్మ జగన్నాథుడు కౌసల్యకు ఆవిర్భవించెను. ఆ సమయమున ఆకాశమునుండి దివ్యపుష్పముల వర్షము కురిసెను (14-15).

ఆ శిశువు - నల్లకలువవంటి మైచాయ గలవాడు, పీతాంబరుడు, నాల్గుభుజములవాడు ఎర్రకమలములవంటి నేత్రములు కలవాడు, కాంతిమయ దివ్యకుండలధారి (16), అసంఖ్యాక సూర్యగోళములతో సమానమగు కాంతి కలవాడు శిరమున ప్రకాశించు కిరీటము కలవాడు, ముంగురుల జుట్టు కలవాడు, చేతులలో శంఖ, చక్ర, గదా, పద్మములతో, గళమున వైజయంతీమాలతో విరాజిల్లెడివాడు (17).

ఆ స్వామి హృదయములోని అనుగ్రహమను చంద్రుని సూచించు చిరునవ్వు వెన్నెలలు జల్లువాడు, కరుణరసామృతము నిండిన విశాల పద్మ నేత్రములు కలిగి, శ్రీవత్స హార కేయూర నూపురాది భూషణములతో ప్రకాశించువాడు (18).

పుత్రరూపమున ప్రత్యక్షమైన పరమాత్మను కౌసల్యచూచి సంభ్రమాశ్చర్యములు పొందెను. ఆమె నేత్రములు ఆనందాశ్రువులతో నిండెను. ఆమె చేతులు జోడించి నమస్కరించి యిట్లనెను (19) -

కౌసల్య అనుచున్నది - "దేవదేవా! నీకు ప్రణామములు. శంఖచక్రగదాధారీ! నీవు అచ్యుతుడవు, అనంతుడవు, పరమాత్ముడవు, పూర్ణస్వరూపుడవు, పురుషోత్తముడవు (20). వేదవిదులు నిన్ను మనోవాగ

వదంత్యగోచరం వాచాం బుద్ధ్యాదీనామతీంద్రియమ్,
త్వాం వేదవాదినః సత్తామాత్రం జ్ఞానైకవిగ్రహమ్. 21

త్వమేవ మాయయా విశ్వం సృజస్యవసి హంసి చ,
సత్త్వాదిగుణసంయుక్తస్తుర్య ఏవామలః సదా. 22

కరోషీవ న కర్తా త్వం గచ్ఛసీవ న గచ్ఛసి,
శృణోషి న శృణోషీవ పశ్యసీవ న పశ్యసి. 23

అప్రాణో హ్యమనాః శుభ్ర ఇత్యాది శ్రుతిరబ్రవీత్,
సమః సర్వేషు భూతేషు తిష్ఠన్నపి న లక్ష్యసే. 24

అజ్ఞానధ్వాంతచిత్తానాం వ్యక్త ఏవ సుమేధసామ్,
జఠరే తవ దృశ్యంతే బ్రహ్మాండాః పరమాణవః. 25

త్వం మమోదరసంభూత ఇతి లోకాన్విడంబసే,
భక్తేషు పారవశ్యం తే దృష్టం మేఽద్య రఘూత్తమ. 26

సంసారసాగరే మగ్నా పతిపుత్రధనాదిషు,
భ్రమామి మాయయా తేఽద్య పాదమూలముపాగతా. 27

దేవ త్వద్రూపమేతన్మే
సదా తిష్ఠతు మానసే,
ఆవృణోతు న మాం మాయా
తవ విశ్వవిమోహినీ. 28

ఉపసంహర విశ్వాత్మన్నదో రూపమలౌకికమ్,
దర్శయస్వ మహానందబాలభావం సుకోమలమ్,
లలితాలింగనాలాపైస్తరిష్యామ్యుత్కటం తమః. 29

తీతుడవని, ఇంద్రియాతీతుడవని, సత్స్వరూపుడవని, సాక్షాత్ జ్ఞానస్వరూపుడవని తెలుపుచున్నారు. నీవు మాయచే, సత్త్వరజస్తమో గుణయుతుడవై ఈ విశ్వమును సృజించుచు, పోషించుచు, లయము గావించుచున్నావు. అయినను వాస్తవమున నీవు తురీయపదమందు ఉందువు. నీవు కర్మలు చేయుచున్నట్లు, నడచుచున్నట్లు, వినుచున్నట్లు, చూచు చున్నట్లు ప్రతీతుడవయ్యెదవు. కాని నీవు కర్తవు కావు, నడువవు, వినవు, చూడవు. ఇది వాస్తవము. నీవు మనఃప్రమాణాది ఉపాధిరహితుడవని, శుద్ధస్వరూపుడవని వేదము తెలుపుచున్నది. నీవు జీవులందరిలోను అంతర్యామిగా సమాన భావముతో నున్నావు. అయినను అజ్ఞానాంధకారముచే మూయబడిన అంతఃకరణముకలవారికి నీవు గోచరించవు. నీ దివ్యసాక్షాత్కారము నిర్మలాంతఃకరణులకే లభించును. నీ ఉదరమున అణగి ఉన్న అనేక బ్రహ్మాండములు పరమాణువుల వలె గోచరించును. అయినను నీవు నాగర్భమునందు జనించినట్లు లోకములను మభ్యపెట్టుచున్నావు. ఇది నీ లీల! ఓ రఘూత్తమా! నేడు నీకు నీ భక్తులయందు గల పారవశ్యము చూచితిని. స్వామీ! నేను నీ మాయచే మోహితురాలనై సంసార సాగరమున మునిగి పతిసుత ధనాదులయందు చిక్కి భ్రమించుచున్నాను. నేడు నీ చరణముల ఆశ్రయము లభించినది. దేవా! ఈ నీ మనోహర చతుర్భుజరూపము సదా నా హృదయమున యుండుగాక! మరియు విశ్వమును మోహింపచేయు నీ మాయ నన్ను ఆవరించకుండుగాక! విశ్వాత్మా! నీవు ఈ అలౌకికరూపమును ఉపసంహరింపుము. పరమానందదాయకమైన సుకోమల బాలరూపమున దర్శనమిమ్ము. దానివలన నేను లలిత మనోహర ఆలింగన సంభాషణాదులతో నా ఘోరమైన అజ్ఞానాంధకారము నుండి తరించెదను (21-29).

శ్రీభగవానువాచ

యద్యదిష్టం తవాస్త్యంబ తత్తద్భవతు నాన్యథా. 30

అహం తు బ్రహ్మణా పూర్వం
భూమేర్భారాపనుత్తయే,
ప్రార్థితో రావణం హంతుం
మానుషత్వముపాగతః 31

శ్రీభగవానుడిట్లు పలికెను - "అమ్మా! మీరేది కోరుదురో అది అట్లే యగుగాక! దానికి విరుద్ధముగా నేమియును జరుగదు. పూర్వమున పృథ్వీభారమును తొలగించుమని బ్రహ్మ నన్ను ప్రార్థించియున్నాడు. అందులకై రావణాది రాక్షసులను సంహరించుటకు నేనీ మానవ రూపమున అవతరించినాను (30-31).

త్వయా దశరథేనాహం తపసారాధితః పురా,
మత్పుత్రత్వాభికాంక్షిణ్యా తథా కృతమనిందితే. 32

రూపమేతత్త్వయా దృష్టం ప్రాక్తనం తపసః ఫలమ్,
మద్దర్శనం విమోక్షాయ కల్పతే హ్యన్యదుర్లభమ్. 33

సంవాదమావయోర్యస్తు
పఠేద్వా శ్రుణుయాదపి,
స యాతి మమ సారూప్యం
మరణే మత్స్మృతిం లభేత్. 34

ఇత్యుక్త్వా మాతరం రామో
బాలో భూత్వా రురోద హ,
బాలత్వేఽపీంద్రనీలాభో
విశాలాక్షోఽతిసుందరః. 35

బాలారుణప్రతీకాశో లాలితాఖిలలోకపః,
అథ రాజా దశరథః శ్రుత్వా పుత్రోద్భవోత్సవమ్,
ఆనందార్ణవమగ్నోఽసావాయయౌ గురుణా సహ. 36

రామం రాజీవపత్రాక్షం దృష్ట్వా హర్షాశ్రుసంప్లుతః,
గురుణా జాతకర్మాణి కర్తవ్యాని చకార సః. 37

కైకేయీ చాథ భరతమసూత కమలేక్షణా,
సుమిత్రాయాం యమౌ జాతౌ పూర్ణేందుసదృశాననౌ. 38

తదా గ్రామసహస్రాణి బ్రాహ్మణేభ్యో ముదా దదౌ,
సువర్ణాని చ రత్నాని వాసాంసి సురభీః శుభాః. 39

యస్మిన్ రమంతే మునయో విద్యయాఽజ్ఞానవిప్లవే,
తం గురుః ప్రాహ రామేతి రమణాద్రామ ఇత్యపి. 40

భరణాద్భరతో నామ లక్ష్మణం లక్షణాన్వితమ్,
శత్రుఘ్నం శత్రుహంతారమేవం గురురభాషత. 41

"పుణ్యాత్మురాలా! పూర్వము దశరథుడు, నీవు నన్ను పుత్రరూపమున పొందు కోర్కెతో తపము గావించి, నా ఆరాధనము చేసియున్నారు. మీ మనోరథము నే వేళ నెరవేర్చితిని (32).

"నీవు నీ పూర్వజన్మ తపఃఫలముననే నా యీ దివ్యరూపమును దర్శింపగలిగితివి. నా దర్శనము మోక్షమును కూర్చును. పుణ్యహీనులకి దర్శనము చాల దుర్లభము (33). మన యీ సంవాదము చదివిన, వినినవారు నా సారూప్య ముక్తిని పొందగలరు. వారు మరణకాలమున నా స్మృతి కలిగియుందురు" (34).

తల్లితో ఈ విధముగా పలికి భగవానుడు బాలుడై ఏడువసాగెను. అతడు బాలరూపమున కూడ ఇంద్రనీలమణి కాంతి కలిగి, విశాల నేత్రములతో అతి మనోహరముగా నుండెను (35). బాలసూర్యునివలె, అరుణజ్యోతిర్మయుడై వెలిగెను. ఇట్లు శ్రీమహావిష్ణువు మనోహర బాలభావమున అవతరించి, లోకపాలురకందరకు ప్రీతి గూర్చెను. తదుపరి దశరథ మహారాజు పుత్రోదయ సమాచారము విని ఆనందసముద్రమున మునిగి గురువు వశిష్ఠునితో రాజ మందిరమునకు వచ్చెను (36). కమలనయనుడైన బాలుని చూచి అతడు ఆనందాశ్రు పరిప్లుతుడాయెను. తదుపరి గురువు ద్వారా ఆవశ్యక జాతకర్మాదులు నిర్వర్తించెను (37). కైకేయి భరతునకు, సుమిత్ర పూర్ణచంద్రుని బోలు ముఖములుగల కవలలకు జన్మనిచ్చిరి (38). ఆ సమయమున దశరథ మహారాజు అత్యంత ఆనందమున వేలాది గ్రామములను, సువర్ణమును, రత్నములను, నానావిధ వస్త్రములను శుభలక్షణములు గల అనేక గోవులను బ్రాహ్మణులకు దానమిచ్చెను (39).

జ్ఞానముద్వారా అజ్ఞానము నశించిపోయిన తరువాత, మునులు ఎవరియందు రమింతురో, ఎవడు తన సౌందర్యముచే భక్తజనుల చిత్తములను ఆనందింప చేయునో అతనికి 'రాము'డని గురువు వశిష్ఠుడు పేరు పెట్టెను (40). జగత్తును భరించువాడు కావున రెండవపుత్రునకు 'భరతు'డని, సమస్త శుభలక్షణసంపన్నుడు కావున మూడవ వానికి లక్ష్మణుడని, శత్రుహంత యగుటచే నాల్గవవానికి శత్రుఘ్నుడని పేరులిడెను (41). కౌసల్యా కైకేయిలచేత

లక్ష్మణో రామచంద్రేణ
శత్రుఘ్నో భరతేన చ,
ద్వంద్వీభూయ చరంతౌ తౌ
పాయసాంశానుసారతః. 42

రామస్తు లక్ష్మణేనాథ విచరన్బాలలీలయా,
రమయామాస పితరౌ చేష్టితైర్ముగ్ధభాషితైః. 43

ఫాలే స్వర్ణమయాశ్వత్థపర్ణముక్తాఫలప్రభమ్,
కంఠే రత్నమణివ్రాతమధ్యద్వీపినఖాంచితమ్. 44

కర్ణయోః స్వర్ణసంపన్నరత్నార్జునసటాలుకమ్,
శింజానమణిమంజీరకటిసూత్రాంగదైర్వృతమ్. 45

స్మితవక్త్రాల్పదశనమింద్రనీలమణిప్రభమ్,
అంగణే రింగమాణం తం తర్ణకాననుసర్వతః. 46

దృష్ట్వా దశరథో రాజా
కౌసల్యా ముముదే తదా,
భోక్ష్యమాణో దశరథో
రామమేహీతి చాసకృత్. 47

ఆహ్వాయత్యతిహర్షేణ
ప్రేమ్ణా నాయాతి లీలయా,
ఆనయేతి చ కౌసల్యా
మాహ సా సస్మితా సుతమ్. 48

ధావత్యపి న శక్నోతి స్ప్రష్టుం యోగిమనోగతిమ్,
ప్రహసన్స్వయమాయాతి కర్దమాంకితపాణినా.
కించిద్ గృహీత్వా కవలం పునరేవ పలాయతే. 49

కౌసల్యా జననీ తస్య మాసి మాసి ప్రకుర్వతీ,
వాయనాని విచిత్రాణి సమలంకృత్య రాఘవమ్. 50

అపూపాన్మోదకాన్కృత్వా కర్ణశష్కులికాస్తథా,
కర్ణపూరాంశ్చ వివిధాన్ వర్షవృద్ధౌ చ వాయనమ్. 51

గృహకృత్యం తయా త్యక్తం తస్య చాపల్యకారణాత్,
ఏకదా రఘునాథోఽసౌ గతో మాతరమంతికే. 52

భోజనం దేహి మే మాతర్న శ్రుతం కార్యసక్తయా,
తతః క్రోధేన భాండాని లగుడేనాహనత్తదా. 53

ఈయబడిన పాయసాంశముల ననుసరించి లక్ష్మణుడు రామునికి, శత్రుఘ్నుడు భరతునికి జతగా నుండసాగిరి (42).

లక్ష్మణసహితముగా శ్రీరాముడు తన బాల్య లీలతో చరించుచు ముగ్ధమనోహరములగు మాటలతో చేష్టలతో తల్లిదండ్రులను ఆనందింపచేయసాగెను (43). అతడు లలాటమున ముత్యములు గూర్చిన రావి ఆకు ఆకృతిగల బంగారు ఆభరణము, కంఠమున రత్నములు మణులు పొదగబడిన పులిగోరు పతకముచే శోభించుచుండెను (44). చెవులయందు అర్జునఫలరూపములగు రత్నఖచితములగు బంగారుకుండలములు, కాళ్లకు మణిమయ నూపురములు, కటి ప్రదేశమున బంగారు గజ్జెల మొలత్రాడు, బాహు భూషణములు - ఇవన్నియు రాముడు ప్రాంగణమున ఆడుచున్నపుడు మనోహరముగా రవళించుచుండెను (45). మందహాసముతో చిరుదంతములతో ఇంద్రనీలమణి కాంతిగల రాముడు ప్రాంగణమున లేగ దూడల వెంట దోగాడుచున్నవానిని చూచి, కౌసల్యా దశరథులు మిక్కిలి సంతోషించిరి. భోజనము చేయువేళ, దశరథుడు ప్రేమపూర్వకముగా మాటిమాటికి ''రామా! రారా! రా! రా!'' అని పిలుచుచుండెను. అతి హర్షముతో, ప్రేమతో తండ్రి పిలుచుచున్నను, రాముడు తన బాలక్రీడలలో సక్తుడై యుండుటచేత, తండ్రిని చేరరాడు. అపుడు దశరథుడు కౌసల్యాదేవితో 'బాలుని తీసుకొనిరమ్ము' అని చెప్పగా ఆమె చిరునవ్వుతో పరుగెత్తినను, కుమారుని తాకజాలదు; యోగిజనుల మనస్సులలో సంచరించెడి భగవానుని పట్టుకొనలేకపోయెను. రాముడే అపుడు స్వయముగా చిరునవ్వుతో వచ్చి బురద చేతులతో రెండుముద్దలు తిని పరిగెత్తిపోవును (46-49).

తల్లియగు కౌసల్య రామునికి చక్కని వస్త్రములు ఆభరణములు ధరింపచేసి ప్రతిమాసమునందు నానావిధము లగు మధురపదార్థములు చేసి, ఉత్సవములు చేసెడిది. ప్రతివత్సరము జన్మదినమున అప్పాలు, కుడుములు, చక్కిలములు, పుణుకులు మొదలగు వివిధ వ్యంజనములు తయారుచేసి పండుగలు చేసెడిది (50-51).

రాముని అల్లరికారణముగా కౌసల్య గృహ కృత్యములు చేయజాలకపోయెడిది. ఒకరోజు రాముడు తల్లిని చేరి (52), ''అమ్మా! నాకేమైనను తినుటకు పెట్టు'' మనెను. కాని పనిలో నిమగ్నురాలైన తల్లి వినిపించుకొనలేదు. దానితో బాలుడు కోపగించి కర్ర చేతబట్టి దధి భాండములన్నియు పగులగొట్టెను (53). ఉట్టిపై నున్న పాలు, పెరుగు, వెన్న

శిక్యస్థం పాతయామాస గవ్యం చ నవనీతకమ్,
లక్ష్మణాయ దదౌ రామో భరతాయ యథాక్రమమ్. 54

శత్రుఘ్నాయ దదౌ పశ్చాద్దధి దుగ్ధం తథైవ చ,
సూదేన కథితే మాత్రే హాస్యం కృత్వా ప్రధావతి. 55

ఆగతాం తాం విలోక్యాథ తతః సర్వైః పలాయితమ్,
కౌసల్యా ధావమానాపి ప్రస్ఖలంతీ పదే పదే. 56

రఘునాథం కరే ధృత్వా కించిన్నోవాచ భామినీ,
బాలభావం సమాశ్రిత్య మందం మందం రురోద హ. 57

తే సర్వే లాలితా మాత్రా గాఢమాలింగ్య యత్నతః,
ఏవమానందసందోహజగదానందకారకః. 58

మాయాబాలవపుర్ధృత్వా రమయామాస దంపతీ,
అథ కాలేన తే సర్వే కౌమారం ప్రతిపేదిరే. 59

ఉపనీతా వసిష్ఠేన సర్వవిద్యావిశారదాః,
ధనుర్వేదే చ నిరతాః సర్వశాస్త్రార్థవేదినః. 60

బభూవుర్జగతాం నాథా లీలయా నరరూపిణః,
లక్ష్మణస్తు సదా రామమనుగచ్ఛతి సాదరమ్. 61

సేవ్యసేవకభావేన శత్రుఘ్నో భరతం తథా,
రామశ్చాపధరో నిత్యం తూణీబాణాన్వితః ప్రభుః 62

అశ్వారూఢో వనం యాతి మృగయాయై సలక్ష్మణః,
హత్వా దుష్టమృగాన్సర్వాన్ పిత్రే సర్వం న్యవేదయత్.

ప్రాతరుత్థాయ సుస్నాతః పితరావభివాద్య చ,
పౌరకార్యాణి సర్వాణి కరోతి వినయాన్వితః. 64

బంధుభిః సహితో నిత్యం భుక్త్వా మునిభిరన్వహమ్,
ధర్మశాస్త్రరహస్యాని శృణోతి వ్యాకరోతి చ. 65

ఏవం పరాత్మా మనుజావతారో
మనుష్యలోకాననుసృత్య సర్వమ్,
చక్రేఽవికారీ పరిణామహీనో
విచార్యమాణే న కరోతి కించిత్. 66

క్రింద బడద్రోసెను. అచట ఉన్న పాలు పెరుగులను లక్ష్మణ భరత శత్రుఘ్నులకు యిచ్చెను. ఈ విషయమును వంటవాడు కౌసల్యతో చెప్పగా రాముడు నవ్వుచు పరుగెత్తెను. ఆమెకూడ నవ్వుచు అతనిని పట్టుకొనుటకు పరుగెత్తెను (54-55).

తల్లి వచ్చుటచూచి, నలుగురు సోదరులు పారిపోయిరి. కౌసల్య వారి వెంట పరుగెత్తినది. కాని ఆమె అడుగడుగున జారిపడసాగినది (56). చివరకు ఆమె రాముని పట్టుకొన్నది. కాని ఏమియు అనలేదు. రాముడు బాలభావము చూపుచు, ఏడువసాగెను (57). అంతట కౌసల్య పిల్లలనందరను కౌగలించుకొని తల్లిప్రేమతో లాలించెను. ఈ విధముగా జగదానందకారకుడు, ఆనంద ఘనుడైన భగవానుడు లీలగా రాముడై, బాలకుడై, రాజ దంపతులైన కౌసల్యాదశరథులకు ఆనందము కలిగించ సాగెను. కొంతకాలము గడచిన తరువాత ఆ నలుగురు సోదరులు కౌమారావస్థలో ప్రవేశించిరి (58-59).

అంతటవారికి వశిష్ఠుడు ఉపనయన సంస్కారములు గావించెను. జగత్పాలకులైన లీలామానుషవిగ్రహులు, నలుగురు సోదరులు, సమస్త శాస్త్రముల మర్మముల నెరిగి ధనుర్వేదాది సకల విద్యలందు నిష్ణాతులైరి. ఆ సోదరులందరిలోను సేవ్యసేవక భావముతో ఆదరపూర్వకముగా లక్ష్మణుడు శ్రీరామచంద్రుని అనుగమించుచుండెను. అదే ప్రకారముగా శత్రుఘ్నుడు భరతుని సేవలో ఉండెను.

రాముడు లక్ష్మణుని గూడి ధనుర్బాణములు దాల్చి అశ్వారూఢుడై అడవికి పోయి దుష్టమృగములను వేటాడి ఆ విషయమును తండ్రికి నివేదించెడివాడు (60-63). ప్రాతఃకాలమున మేల్కాంచి స్నానమాచరించి మాతా పితరులకు వినయపూర్వకముగా నమస్కరించి ప్రజల హితమునకు సమస్త కార్యములు నిర్వహించుచుండెడివాడు (64). ప్రతిదినము సోదరసమేతుడై భోజనము చేసి మునిజనముల వలన ధర్మశాస్త్రమర్మములను వినుచు స్వయముగా వానిని వ్యాఖ్యానించెడివాడు (65). ఈ విధముగా పరిణామరహితుడైన పరమాత్మ, మానవుడుగా అవతరించి; మానవాచారముల ననుసరించుచు సమస్త కార్యములు చేసెను. కాని విచారించి చూడగా అతడు రాగద్వేషాది వికారములు లేనివాడు, షడ్విధ పరిణామ రహితుడు కనుక అతడు ఏమియు చేయుట లేదు (66).

ఇది శ్రీమదధ్యాత్మరామాయణాంతర్గత ఉమామహేశ్వరసంవాదమునందు
బాలకాండమున తృతీయ సర్గము ॥ 3 ॥

***

ఓం

# చతుర్థ సర్గము

## విశ్వామిత్రుని ఆగమనము- రామలక్ష్మణుల అనుగమనము

### తాటకా వధ

శ్రీమహాదేవ ఉవాచ

కదాచిత్కౌశికోఽభ్యాగా
దయోధ్యాం జ్వలనప్రభః,
ద్రష్టుం రామం పరాత్మానం
జాతం జ్ఞాత్వా స్వమాయయా. 1

దృష్ట్వా దశరథో రాజా ప్రత్యుత్థాయాచిరేణ తు,
వసిష్ఠేన సమాగమ్య పూజయిత్వా యథావిధి. 2

అభివాద్య మునిం రాజా ప్రాంజలిర్భక్తినమ్రధీః,
కృతార్థోఽస్మి మునీంద్రాహం త్వదాగమనకారణాత్. 3

త్వద్విధా యద్గృహం యాంతి తత్రైవాయాంతి సంపదః,
యదర్థమాగతోఽసి త్వం బ్రూహి సత్యం కరోమి తత్. 4

విశ్వామిత్రోఽపి తం ప్రీతః ప్రత్యువాచ మహామతిః,
అహం పర్వణి సంప్రాప్తే దృష్ట్వా యష్టుం సురాన్పితౄన్. 5

యదారభే తదా దైత్యా విఘ్నం కుర్వంతి నిత్యశః,
మారీచశ్చ సుబాహుశ్చాపరే చానుచరాస్తయోః. 6

అతస్తయోర్వధార్థాయ జ్యేష్ఠం రామం ప్రయచ్ఛ మే,
లక్ష్మణేన సహ భ్రాత్రా తవ శ్రేయో భవిష్యతి. 7

వసిష్ఠేన సహామంత్ర్య దీయతాం యది రోచతే,
పప్రచ్ఛ గురుమేకాంతే రాజా చింతాపరాయణః. 8

కిం కరోమి గురో రామం త్యక్తుం నోత్సహతే మనః,
బహువర్షసహస్రాంతే కష్టేనోత్పాదితాః సుతాః. 9

చత్వారోఽమరతుల్యాస్తే తేషాం రామోఽతివల్లభః,
రామస్త్వితో గచ్ఛతి చేన్న జీవామి కథంచన. 10

ప్రత్యాఖ్యాతో యది మునిః శాపం దాస్యత్యసంశయః,
కథం శ్రేయో భవేన్మహ్యమసత్యం చాపి న స్పృశేత్. 11

శ్రీమహాదేవుడిట్లనెను - ''పరమాత్మయే తన మాయచే రాముడై అవతరించెనని తెలిసి అగ్నిప్రభాభాసమానుడైన విశ్వామిత్రుడు ఒకనాడు ఆతనిని దర్శించుటకు అయోధ్యానగరమునకు వచ్చెను (1). ఆతనిని చూచి మహారాజు లేచి నిలువబడి వశిష్ఠునితోగూడి ఆతని సమ్ముఖమునకు వచ్చి స్వాగతసత్కారములు సమర్పించెను. పిమ్మట యథావిధిగా పూజించి, భక్తి వినమ్రచిత్తుడై చేతులు జోడించి ఆతనితో ఇట్లనెను - ''ఓ మునీంద్రా! మీ శుభాగమనముచే నేను కృతకృత్యుడనైతిని (2-3). మీవంటి మహాత్ములు ఎక్కడకు వెళ్లిన అక్కడికే సంపదలన్నియు అనుసరించివచ్చును. మీ శుభాగమనమునకు కారణము సెలవీయుడు. దానిని నెరవేర్చుటకు సిద్ధముగానున్నాను'' (4).

అంతట బుద్ధిశాలియగు విశ్వామిత్రుడు ప్రసన్నుడై ఇటుల పలికెను - ''రాజా! పర్వదినములో నేనెపుడు దేవ పితృగణముల సంతృప్తికై యజ్ఞము చేయ నారంభించినను, మారీచసుబాహులు, వారి అనుయాయులైన ఇతర దైత్యులు విఘ్నము కలిగించుచున్నారు (5-6).

కావున వారిని వధించుటకు శ్రీరాముని తమ్ముడగు లక్ష్మణునితో సహా నా కప్పగింపుము. దానివలన నీకు కడు శ్రేయస్సు కలుగును (7). ఈ విషయము వశిష్ఠునితో సంప్రదించి నీ కిష్టమైనచో ఆ ఇరువురిని నాకు అప్పగించుము''. ఇది విని రాజు చింతాక్రాంతుడై ఏకాంతమున గురువగు వశిష్ఠునితో ఇట్లనెను - ''ఆచార్యా! ఏమి చేయవలెను? రాముని పంపుటకు నా మనసు ఒప్పుటలేదు. అనేక సంవత్సరముల తపఃఫలముగా దైవసదృశులగు కుమారులు నలుగురూ కలిగినారు. వారిలో రాముడు నాకు ప్రాణసముడు, ఆతడు వెడలిన నేను బ్రదుకలేను. ఈ విధముగా మునికి బదులు చెప్పిన నిస్సంశయముగా నన్ను శపించును. నాకు అసత్యదోషము అంటకుండునటుల శ్రేయస్సు కలుగునటుల ఏదేని ఉపాయము చెప్పుడు మిమ్ము వేడుకొనుచున్నాను'' (8-11).



మహర్షి విశ్వామిత్రుని వెంట రామలక్ష్మణులు వెడలుట

వసిష్ఠ ఉవాచ

శృణు రాజన్దేవగుహ్యం గోపనీయం ప్రయత్నతః,
రామో న మానుషో జాతః పరమాత్మా సనాతనః. 12

భూమేర్భారావతారాయ బ్రహ్మణా ప్రార్థితః పురా,
స ఏవ జాతో భవనే కౌసల్యాయాం తవానఘ. 13

త్వం తు ప్రజాపతిః పూర్వం కశ్యపో బ్రహ్మణః సుతః,
కౌసల్యా చాదితిర్దేవమాతా పూర్వం యశస్వినీ,
భవంతౌ తప ఉగ్రం వై తేపాథే బహువత్సరమ్. 14

అగ్రామ్యవిషయౌ విష్ణుపూజాధ్యానైకతత్పరౌ,
తదా ప్రసన్నో భగవాన్ వరదో భక్తవత్సలః. 15

వృణీష్వ వరమిత్యుక్తే త్వం మే పుత్రో భవామల,
ఇతి త్వయా యాచితోఽసౌ భగవాన్ భూతభావనః. 16

తథేత్యుక్త్వాద్య పుత్రస్తే జాతో రామః స ఏవ హి,
శేషస్తు లక్ష్మణో రాజన్ రామమేవాన్వపద్యత. 17

జాతౌ భరతశత్రుఘ్నౌ శంఖచక్రే గదాభృతః,
యోగమాయాపి సీతేతి జాతా జనకనందినీ. 18

విశ్వామిత్రోఽపి రామాయ తాం యోజయితుమాగతః,
ఏతద్గుహ్యతమం రాజన్న వక్తవ్యం కదాచన. 19

అతః ప్రీతేన మనసా పూజయిత్వాథ కౌశికమ్,
ప్రేషయస్వ రమానాథం రాఘవం సహలక్ష్మణమ్. 20

వసిష్ఠేనైవముక్తస్తు రాజా దశరథస్తదా,
కృతకృత్యమివాత్మానం మేనే ప్రముదితాంతరః. 21

ఆహూయ రామరామేతి లక్ష్మణేతి చ సాదరమ్,
ఆలింగ్య మూర్ధ్న్యవఘ్రాయ కౌశికాయ సమర్పయత్. 22

తతోఽతిహృష్టో భగవాన్విశ్వామిత్రః ప్రతాపవాన్,
ఆశీర్భిరభినంద్యాథ అగతౌ రామలక్ష్మణౌ. 23

అంతట వశిష్ఠుడు ఇట్లనెను – ''రాజా! ఒక దేవ రహస్య విషయము చెప్పుచున్నాను, వినుము. ఈ విషయము పరులకు ఎట్టి స్థితిలో నైనను చెప్పకూడనిది. శ్రీరాముడు సాధారణమానవుడు కాడు. సాక్షాత్తు పురాణపురుషుడగు పరమాత్మయే తన మాయచే ఈ రూపమున అవతరించినాడు (12). అనఘా! పూర్వము భూభారమును హరింప చేయుటకు బ్రహ్మ భగవానుని ప్రార్థించెను. అది నెరవేర్చుటకే పరమాత్మ నీయింట కౌసల్యానందనుడై అవతరించినాడు (13). పూర్వజన్మమున నీవు బ్రహ్మకుమారుడవగు కశ్యప ప్రజాపతివి. యశస్వినియగు కౌసల్య దేవమాతయగు అదితి. మీరు సాంసారిక విషయవాసనలను పూర్తిగా వదలి భగవత్సేవా పరాయణులై సదా విష్ణుపూజాతత్పరులై చాలా సంవత్సరములు ఉగ్రతపస్సు చేసితిరి. భక్తవత్సలుడు, వరదుడు అయిన పరమాత్మ మీ భక్తికి ప్రసన్నుడై ప్రత్యక్షమయ్యెను. అతడు మిమ్ములను 'వరము కోరుకొమ్ము' నగా 'ఓ నిరంజనా! మీరే మాకు పుత్రులుగా జన్మింపుడు' అని మీరు కోరుకొనిరి. జగత్కర్తయగు భగవానుడు 'తథాస్తు' అని, ఇపుడు మీకు పుత్రునిగా రామునిగా జన్మించెను. శేషుడు లక్ష్మణునిగా అవతరించి అతనికి అనుచరుడయ్యెను (14-17).

భగవానుడగు గదాధరుని శంఖచక్రములే భరత శత్రుఘ్నులై అవతరించినవి. యోగమాయ జనకనందిని సీతగా అవతరించినది (18). ఇపుడు విశ్వామిత్రుడు శ్రీరామచంద్రునితో సీతను కూర్చుటకు వచ్చియున్నాడు. మహారాజా! ఇది అత్యంత రహస్యము. దీనిని ఎవ్వరికిని తెలుపవలదు (19). కావున నీవిపుడు ప్రసన్నచిత్తుడవై, విశ్వామిత్రుని గౌరవించి అతనివెంట శ్రీహరియగు రాఘవుని లక్ష్మణునితో సహా పంపుము'' (20).

వశిష్ఠునిద్వారా రామావతారరహస్యము తెలిసికొనిన దశరథుడు అంతరంగమున అనిర్వచనీయమైన ఆనందము పొంది, తనను తాను కృతకృత్యునిగా భావించెను (21).

''అతిప్రేమతో 'రామా! లక్ష్మణా!' అని పిలిచి ఆలింగనము చేసికొని, మూర్ధమును ఆఘ్రాణించి, సాదరముగా వారిని విశ్వామిత్రునకు సమర్పించెను (22).

ప్రతాపవంతుడగు విశ్వామిత్రుడు అతి ప్రసన్నుడై తనవద్దకు వచ్చిన రామలక్ష్మణులను ఆశీర్వాదములతో అభినందించెను. వారిరువురు చాపతూణీరబాణములు

శ్రీరామచంద్రుడు తాటకను వధించుట



గృహీత్వా చాపతూణీరబాణఖడ్గధరౌ యయౌ.
కించిద్దేశమతిక్రమ్య రామమాహూయ భక్తితః. 24

దదౌ బలాం చాతిబలాం విద్యే ద్వే దేవనిర్మితే.
యయోర్గ్రహణమాత్రేణ క్షుత్క్షామాది న జాయతే. 25

తత ఉత్తీర్య గంగాం తే తాటకావనమాగమన్.
విశ్వామిత్రస్తదా ప్రాహ రామం సత్యపరాక్రమమ్. 26

అత్రాస్తి తాటకా నామ రాక్షసీ కామరూపిణీ.
బాధతే లోకమఖిలం జహి తామవిచారయన్. 27

తథేతి ధనురాదాయ సగుణం రఘునందనః.
టంకారమకరోత్తేన శబ్దేనాపూరయద్వనమ్. 28

తచ్ఛ్రుత్వాఽసహమానా సా తాటకా ఘోరరూపిణీ.
క్రోధసమ్మూర్ఛితా రామమభిదుద్రావ మేఘవత్. 29

తామేకేన శరేణాశు తాడయామాస వక్షసి.
పపాత విపినే ఘోరా వమంతీ రుధిరం బహు. 30

తతోఽతిసుందరీ యక్షీ సర్వాభరణభూషితా.
శాపాత్పిశాచతాం ప్రాప్తా ముక్తా రామప్రసాదతః. 31

నత్వా రామం పరిక్రమ్య గతా రామాజ్ఞయా దివమ్. 32

తతోఽతిహృష్టః పరిరభ్య రామం
మూర్ధన్యవఘ్రాయ విచింత్య కించిత్.
సర్వాస్త్రజాలం సరహస్యమంత్రం
ప్రీత్యాభిరామాయ దదౌ మునీంద్రః. 33

ఖడ్గములు ధరించి అతనిని అనుసరించిరి. కొంతదూరము నడచిన పిదప విశ్వామిత్రుడు ప్రేమతో 'రామా' అని సంబోధించి దేవ నిర్మితములైన - బల, అతిబల అను రెండువిద్యలను ప్రసాదించెను. ఆ విద్యలను గ్రహించినవారికి ఆకలి, దప్పిక, దుర్బలత్వాది బాధలు కలుగవు (23-25).

ఆ తరువాత వారు గంగానది దాటి తాటకా వనమును చేరిరి. అంతట విశ్వామిత్రుడు సత్యపరాక్రముడగు రామునితో ఇట్లు అనెను (26) - ''ఇక్కడ తాటక యను పేరుగల కామరూపిణి యగు రాక్షసి కలదు. అమె లోకము నంతను మిక్కిలి పీడించుచున్నది. నీవేమియు యోచింపక దానిని సంహరింపుము'' (27). రాఘవుడు 'అట్లే' యని ధనుస్సునకు నారి బిగించి టంకారము చేసెను. ఆ టంకార ధ్వని వనమంతయు నిండెను (28).

ఆ ధ్వని విని సహింపలేక ఘోరరూపిణియగు తాటక క్రోధోన్మత్తయై కారుమబ్బుల గుంపువలె వేగముగా రామునివంక పరుగెత్తి, మీదికి ఉరికెను (29).

వెంటనే రాముడు దాని వక్షమును ఒకే బాణముతో కొట్టగా, ఆ ఘోరరక్కసి నెత్తురు గ్రక్కుచు వనములో నేలకొరిగెను (30). శాపవశమున పిశాచత్వము నొందిన యా తాటక శ్రీరాముని దయచే శాపవిమోచనము పొంది సర్వాలంకార భూషితయైన సుందర యక్షిణిగా మారి శ్రీరామునకు ప్రదక్షిణ నమస్కారములు గావించి, అతని అనుమతితో దివ్యలోకమునకు వెడలిపోయెను (31-32).

శ్రీరాముని అలౌకిక పరాక్రమమును చూచి హర్షాతిరేకమున విశ్వామిత్రుడు అతనిని గాఢాలింగనము చేసికొని శిరను మూర్కొనెను. రామలక్ష్మణులకు గురువైన తన సౌభాగ్యమును తలచి తలచి పులకించుచు అనిర్వచనీయ మగు ఆనందము అనుభవించుచు అతి రహస్యములైన మంత్రములను సర్వాస్త్రజాలములను ప్రేమతో సౌందర్య వారాశి యగు శ్రీరామునికిచ్చెను (33).

ఇది శ్రీమదధ్యాత్మరామాయణాంతర్గత ఉమామహేశ్వరసంవాదములో
బాలకాండ - చతుర్థ సర్గము ॥ 4 ॥

----****----

మారీచుని సముద్రమున పడవేయుట
సుబాహు వధ



విశ్వామిత్ర యాగ రక్షణము

ఓం

# పంచమ సర్గము

## విశ్వామిత్ర యాగ రక్షణము - అహల్యా శాప విమోచనము

శ్రీ మహాదేవ ఉవాచ

తత్ర కామాశ్రమే రమ్యే కాననే మునిసంకులే,
ఉషిత్వా రజనీమేకాం ప్రభాతే ప్రస్థితాః శనైః. 1

సిద్ధాశ్రమం గతాః సర్వే సిద్ధచారణసేవితమ్,
విశ్వామిత్రేణ సందిష్టా మునయస్తన్నివాసినః. 2

పూజాం చ మహతీం చక్రూ
రామలక్ష్మణయోర్ద్రుతమ్,
శ్రీరామః కౌశికం ప్రాహ
మునే దీక్షాం ప్రవిశ్యతామ్. 3

దర్శయస్వ మహాభాగ కుతస్తౌ రాక్షసాధమౌ,
తథేత్యుక్త్వా మునిర్యష్టుమారేభే మునిభిః సహ. 4

మధ్యాహ్నే దదృశాతే తౌ రాక్షసౌ కామరూపిణౌ,
మారీచశ్చ సుబాహుశ్చ వర్షంతౌ రుధిరాస్థినీ. 5

రామోఽపి ధనురాదాయ ద్వౌ బాణౌ సందధే సుధీః,
ఆకర్ణాంతం సమాకృష్య విససర్జ తయోః పృథక్. 6

తయోరేకస్తు మారీచం భ్రామయన్ శతయోజనమ్,
పాతయామాస జలధౌ తదద్భుతమివాభవత్. 7

ద్వితీయోఽగ్నిమయో బాణః సుబాహుమజయత్క్షణాత్,
అపరే లక్ష్మణేనాశు హతాస్తదనుయాయినః. 8

పుష్పౌఘైరాకిరన్దేవా రాఘవం సహలక్ష్మణమ్,
దేవదుందుభయో నేదుస్తుష్టువుః సిద్ధచారణాః. 9

విశ్వామిత్రస్తు సంపూజ్య పూజార్హం రఘునందనమ్,
అంకే నివేశ్య చాలింగ్య భక్త్యా బాష్పాకులేక్షణః. 10

శ్రీమహాదేవుడిట్లనెను - ఓపార్వతీ! అనంతరము విశ్వామిత్రునితో గూడి ఆ ఇరువురు సోదరులు మునిజన సంకులము, అతి సుందరము అయిన కామాశ్రమమను వనమునందు ఒక్కరాత్రి ఉండి ప్రాతఃకాలము కాగానే మెల్లగా అటనుండి ముందుకు పయనించిరి (1). పిదప వారు సిద్ధచారణ సేవితమగు సిద్ధాశ్రమమును చేరిరి.

అక్కడ నివసించు మునులు విశ్వామిత్రుని సంకేతమును పొంది రామ లక్ష్మణులకు అతి శ్రద్ధతో స్వాగత సత్కారములు చేసిరి. పిదప శ్రీరాముడు విశ్వామిత్రునితో "ఓ మునిపుంగవా! మీరు యజ్ఞదీక్ష గైకొనుడు (2-3). ఆచార్యా! మాకు మీరు ఆ రాక్షసాధములు ఎటనున్నారో తెలుపుడు" అని పలికెను. అంత మునివరుడు అట్లే యని ఇతరమునులతో గూడి యజ్ఞారంభము గావించెను (4).

మధ్యాహ్న సమయమున మారీచుడు, సుబాహుడు అను ఇరువురు కామరూపులగు రాక్షసులు రక్తమును, ఎముకలను వర్షించుచు కానవచ్చిరి (5). పరమధీశాలి, ధృతిమంతుడగు శ్రీరాముడు వెంటనే రెండు బాణములు ధనుస్సున సంధించి, ఆకర్ణాంతము లాగి ఒకేసారి వేర్వేరుగ ఆ ఇరువురి రాక్షసుల మీద ప్రయోగించెను. అందొక బాణము మారీచుని ఆకాశమున గిరగిర త్రిప్పుచు, నూరు యోజనముల దూరమున సముద్రమున పడవైచెను. అది పరమాద్భుతముగా జరిగెను. రెండవ అగ్నిమయ శరము క్షణములో సుబాహుని భస్మము గావించెను. ఇతర అనుచరుల నందరను లక్ష్మణుడు వెనువెంటనే సంహరించెను (6-8).

ఆ సమయమున దేవతలు రామలక్ష్మణుల లోకోత్తర ప్రభావమును చూచి పుష్పవర్షమును కురిపించిరి. దేవదుందుభులు మ్రోగినవి. సిద్ధచారణులు వారిని స్తుతింప సాగిరి (9).

విశ్వామిత్రుడు, పూజార్హుడైన రాముని యథావిధిగ పూజించి ఒడిలో కూర్చుండబెట్టుకొని భక్తి భావమున ప్రేమాశ్రువులొలికించుచు అత్యంత వాత్సల్యముతో కౌగలించుకొనెను (10).

భోజయిత్వా సహ భ్రాత్రా రామం పక్వఫలాదిభిః.
పురాణవాక్యై ర్మధురైర్నినాయ దివసత్రయమ్. 11

చతుర్థేఽహని సంప్రాప్తే కౌశికో రామమబ్రవీత్.
రామ రామ మహాయజ్ఞం ద్రష్టుం గచ్ఛామహే వయమ్. 12

విదేహరాజనగరే జనకస్య మహాత్మనః.
తత్ర మాహేశ్వరం చాపమస్తి న్యస్తం పినాకినా. 13

ద్రక్ష్యసి త్వం మహాసత్త్వం పూజ్యసే జనకేన చ.
ఇత్యుక్త్వా మునిభిస్తాభ్యాం యయౌ గంగాసమీపగమ్. 14

గౌతమస్యాశ్రమం పుణ్యం యత్రాహల్యాస్థితా తపః.
దివ్యపుష్పఫలోపేతపాదపైః పరివేష్టితమ్. 15

మృగపక్షిగణైర్హీనం నానాజంతువివర్జితమ్.
దృష్ట్వోవాచ మునిం శ్రీమాన్ రామో రాజీవలోచనః. 16

కస్యైతదాశ్రమపదం భాతి భాస్వచ్ఛుభం మహత్.
పత్రపుష్పఫలైర్యుక్తం జంతుభిః పరివర్జితమ్. 17

ఆహ్లాదయతి మే చేతో భగవన్ బ్రూహి తత్త్వతః. 18

విశ్వామిత్ర ఉవాచ

శృణు రామ పురా వృత్తం గౌతమో లోకవిశ్రుతః.
సర్వధర్మభృతాం శ్రేష్ఠస్తపసారాధయన్ హరిమ్. 19

తస్మై బ్రహ్మా దదౌ కన్యా మహల్యాం లోకసుందరీమ్.
బ్రహ్మచర్యేణ సంతుష్టః శుశ్రూషణపరాయణామ్. 20

తయా సార్ధమిహావాత్సీ ద్గౌతమస్తపతాం వరః.
శక్రస్తు తాం ధర్షయితుమంతరం ప్రేప్సురన్వహమ్. 21

రామలక్ష్మణులకు మధుర ఫలములు ఆరగింపచేసి పురాణగాథలను మధురముగా వినిపించుచు, మూడు దినములు గడిపెను (11).

నాల్గవదినమున విశ్వామిత్రుడు రామునితో ''రామా! మహాత్ముడగు జనకమహారాజా చేయు మహా యజ్ఞమును తిలకించుటకు మనము జనకపురికి ఏగుదము. అచట శ్రీమహాదేవునిచే దాచియుంచబడిన శివధనుస్సు కలదు (12-13). అతి బలిష్ఠమై, శక్తిసంపన్నమైన ఆ ధనుస్సును నీవు చూచెదవు గాక! జనకమహారాజా నీ కవశ్యము గౌరవ సత్కారములు చేయును గాక!'' అని పలికి ఇతర మునులతో రామలక్ష్మణులతో, గంగానది సమీపమున నున్న పవిత్ర గౌతమాశ్రమమునకు చనెను. అచటనే అహల్య తపస్సు చేయుచుండెను. ఆ ఆశ్రమము దివ్యమైన పుష్ప ఫలవృక్షములతో నిండియుండెను (14-15).

కమలనయనుడగు శ్రీరాముడు ఆ ఆశ్రమమున మృగములు, పక్షులు ఇతర జీవులు ఏమియు కనబడకుండుట చూచి మునివర్యుడగు కౌశికుని ఇట్లడిగెను - ''భగవన్! పత్ర పుష్ప ఫల భరితమై అత్యంత సుందరమై యుండియు, రమణీయమై యున్నను, జీవశూన్యముగా నున్న యీ ఆశ్రమ మెవరిది? గురువర్యా! దీనిని చూచి నా చిత్తము అత్యంత ఆహ్లాదపూరితమగుచున్నది. మీరు దీని వృత్తాంత మంతయు యథాతథముగ తెలియచెప్పుడు'' (16-18).

విశ్వామిత్రుడిట్లనెను - ''రామా! ఈ ఆశ్రమము యొక్క పూర్వవృత్తాంతమును వినుము. ధార్మికులందరిలో శ్రేష్ఠుడు జగద్విఖ్యాతుడు గౌతమమహర్షి ఇందు తపస్సు చేయుచు శ్రీహరిని ఆరాధించెడివాడు (19). అతని బ్రహ్మచర్యమునకు సంతుష్టుడై, బ్రహ్మదేవుడు అతనిని సేవించుటకై సేవాపరాయణయగు అతిలోకసుందరిని అహల్యయను కన్యను అతని కిచ్చి వివాహము చేసెను (20). తాపసశ్రేష్ఠుడైన గౌతముడు ఆమెతో ఈ ఆశ్రమమునందు ఉండసాగెను. దేవేంద్రుడు ఆమె రూపలావణ్యములకు ముగ్ధుడై ఆమె సతీత్వము భ్రష్టమొనరించుటకు, ప్రతిదినము అవకాశము కొరకు వెదుకసాగెను (21).

కదాచిన్మునివేషేణ గౌతమే నిర్గతే గృహాత్,
ధర్షయిత్వాథ నిరగాత్త్వరితం మునిరప్యగాత్. 22

దృష్ట్వా యాంతం స్వరూపేణ మునిః పరమకోపనః,
పప్రచ్ఛ కస్త్వం దుష్టాత్మన్మమ రూపధరోఽధమః. 23

సత్యం బ్రూహి న చేద్భస్మ
కరిష్యామి న సంశయః,
సోఽబ్రవీద్దేవరాజోఽహం
పాహి మాం కామకింకరమ్. 24

కృతం జుగుప్సితం కర్మ మయా కుత్సితచేతసా,
గౌతమః క్రోధతామ్రాక్షః శశాప దివిజాధిపమ్. 25

యోనిలమ్పట దుష్టాత్మన్సహస్రభగవాన్భవ,
శప్త్వా తం దేవరాజానం ప్రవిశ్య స్వాశ్రమం ద్రుతమ్. 26

దృష్ట్వాహల్యాంవేపమానాం ప్రాంజలింగౌతమోఽబ్రవీత్,
దుష్టే త్వం తిష్ఠ దుర్వృత్తే శిలాయామాశ్రమే మమ. 27

నిరాహారా దివారాత్రం తపః పరమమాస్థితా,
ఆతపానిలవర్షాదిసహిష్ణుః పరమేశ్వరమ్. 28

ధ్యాయంతీ రామమేకాగ్రమనసా హృది సంస్థితమ్,
నానాజంతువిహీనోఽయమాశ్రమో మే భవిష్యతి. 29

ఏవం వర్షసహస్రేషు హ్యనేకేషు గతేషు చ,
రామో దాశరథిః శ్రీమానాగమిష్యతి సానుజః. 30

యదా త్వదాశ్రయశిలాం పాదాభ్యామాక్రమిష్యతి,
తదైవ ధూతపాపా త్వం రామం సంపూజ్య భక్తితః. 31

పరిక్రమ్య నమస్కృత్య స్తుత్వా శాపాద్విమోక్ష్యసే,
పూర్వవన్మమ శుశ్రూషాం కరిష్యసి యథాసుఖమ్. 32

ఇత్యుక్త్వా గౌతమః ప్రాగాద్ధిమవంతం నగోత్తమమ్,
తదాద్యహల్యా భూతానామదృశ్యా స్వాశ్రమే శుభే. 33

తవ పాదరజః స్పర్శం కాంక్షతే పవనాశనా,
ఆస్తేఽద్యాపి రఘుశ్రేష్ఠ తపో దుష్కరమాస్థితా. 34

ఒకపుడు గౌతముడు బయటకు వెళ్ళినవేళ ఇంద్రుడు గౌతముని రూపము దాల్చి, ఆశ్రమమున ప్రవేశించి, అహల్య సతీత్వము భ్రష్టము చేసి, వెంటనే వెడలిపోనుంకించెను.

అదే సమయమున గౌతమముని అచటికి వచ్చి తన రూపముదాల్చి పోవుచున్న వానిని చూచి, అత్యంత కోపోద్రిక్తుడై ఇట్లు అడిగెను - "దురాత్మా! అధమా! నా రూపము ధరించిన నీవెవడవు? నిజము చెప్పుము! లేకున్న నిన్నిపుడే నిస్సందేహముగా భస్మము చేయుదును". అంతట ఇంద్రుడు - "మునివర్యా! నేను దేవేంద్రుడను. కామవశుడనైన నన్ను రక్షింపుము. నా బుద్ధి కామ పరవశ మగుటచే ఇట్టి హేయమైన పని చేసితిని" అని పలికెను.

ఈ మాటలకు గౌతముడు క్రోధావేశమున కన్ను లెఱ్ఱచేసి దేవేంద్రుని ఇట్లు శపించెను - "దుష్టాత్మా! యోనిలంపటా! నీ దేహమున వేయిభగములు ఏర్పడుగాక!" తదుపరి తాను ఆశ్రమము ప్రవేశించి చూడగా భయముతో వణకుచు, చేతులు జోడించి నిలచి ఉన్న అహల్యను చూచి "ఓసి దుష్టురాలా! దుశ్చరిత్రురాలా! ఈ నా ఆశ్రమమున శిలగా పడియుండుము. ఇటమీద నిరాహారవై, ఎండకు, వానకు, గాలికి ఓర్చుచు, ఏకాగ్రచిత్తమున హృదయస్థుడైన శ్రీరాముని ధ్యానించుచు. రేయింబవళ్ళు ఇట్లు ఉగ్రతపము చేయుచుండుము. ఈ నా ఆశ్రమమింక సర్వజంతుజాల విహీనమైపోవును గాక! (22-29)! ఇట్లు అనేకవేల సంవత్సరములు గతించిన పిదప దాశరథి శ్రీరాముడు అనుజసహితుడై ఇచ్చటికి రాగలడు (30). అపుడు నీవు ఆశ్రయించిన శిలను తన పాదముతో స్పృశించును. అప్పుడే నీవు పాపమునుండి ముక్తిని పొందెదవు. శ్రీరాముని భక్తితో పూజించి ప్రదక్షిణ నమస్కారాదులతో స్తుతించి, శాపము నుండి విమోచనము పొందెదవు. తదుపరి పూర్వమువలెనే నీ మనోరథమును అనుసరించి సుఖముగా నా శుశ్రూష చేయగలవు" (31-32) అని పలికెను.

ఓ రఘుశ్రేష్ఠా! తరువాత గౌతముడు పర్వత శ్రేష్ఠమైన హిమాలయమునకు వెడలిపోయెను. అప్పటినుండి నేటివరకు అహల్య తన పవిత్రమగు ఆశ్రమమునందు ఏ ఇతర ప్రాణులకు కనబడకుండ, గాలిని భుజించుచు నీ పాద రజస్పర్శమును కోరుకొనుచు అతి దుష్కరమైన తపస్సును చేయుచు నిలిచియున్నది (33-34).



శ్రీరామచంద్రుడు అహల్యను శాపవిముక్తురాలను చేయుట

పావయస్వ మునేర్భార్యామహల్యాం బ్రహ్మణః సుతామ్,
ఇత్యుక్త్వా రాఘవం హస్తే గృహీత్వా మునిపుంగవః. 35

దర్శయామాస చాహల్యాముగ్రేణ తపసా స్థితామ్,
రామః శిలాం పదా స్పృష్ట్వా తాం చాపశ్యత్తపోధనామ్. 36

ననామ రాఘవోఽహల్యాం రామోఽహమితి చాబ్రవీత్
తతో దృష్ట్వా రఘుశ్రేష్ఠం పీతకౌశేయవాససమ్. 37

చతుర్భుజం శంఖచక్రగదాపంకజధారిణమ్,
ధనుర్బాణధరం రామం లక్ష్మణేన సమన్వితమ్. 38

స్మితవక్త్రం పద్మనేత్రం శ్రీవత్సాంకితవక్షసమ్,
నీలమాణిక్యసంకాశం ద్యోతయంతం దిశో దశ. 39

దృష్ట్వా రామం రమానాథం హర్షవిస్ఫారితేక్షణా,
గౌతమస్య వచః స్మృత్వా జ్ఞాత్వా నారాయణం పరమ్. 40

సంపూజ్య విధివద్రామమర్ఘ్యాదిభిరనిందితా,
హర్షాశ్రుజలనేత్రాంతా దండవత్ప్రణిపత్య సా. 41

ఉత్థాయ చ పునర్దృష్ట్వా రామం రాజీవలోచనమ్,
పులకాంకితసర్వాంగా గిరా గద్గదయైలత. 42

అహల్యోవాచ

అహో కృతార్థాస్మి జగన్నివాస తే
పాదాబ్జసంలగ్నరజః కణానహమ్,
స్పృశామి యత్పద్మజశంకరాదిభి -
ర్విమృగ్యతే రంధితమానసైః సదా. 43

అహో విచిత్రం తవ రామ చేష్టితం
మనుష్యభావేన విమోహితం జగత్,
చలస్యజస్రం చరణాదివర్జితః
సంపూర్ణ ఆనందమయోఽతిమాయికః. 44

యత్పాదపంకజపరాగపవిత్రగాత్రా
భాగీరథీ భవవిరించిముఖాన్పునాతి,
సాక్షాత్స ఏవ మమ దృగ్విషయో యదాస్తే
కిం వర్ణ్యతే మమ పురాకృతభాగధేయమ్. 45

'రామా! నీవు ఆ బ్రహ్మపుత్రి గౌతమపత్ని అహల్యను ఉద్ధరింపుము' అని పలికి రఘునాథుని చేయిపట్టుకొని, అతనికి ఉగ్రతపో నిమగ్నయైన అహల్యను చూపెను. అంతట శ్రీరాముడు తన పాదముతో ఆ శిలను స్పృశించి, పిదప తపస్వినియగు అహల్యను గాంచెను (35-36). ఆమెనుచూచి రాముడు ''నేను రాముడను'' అని పలికి నమస్కరించెను. అపుడహల్య శ్రీరాముని పీతాంబరధారియై చతుర్భుజముల శంఖచక్ర గదాపద్మముల ధరించి మందహాసముతో కమలములవంటి కన్నులతో వక్షమున శ్రీవత్సచిహ్నముతో దశదిశల ప్రకాశింప చేయు నీలమణి దివ్యకాంతితో ధనుర్బాణముల ధరించి లక్ష్మణునితో నిలిచియున్నవానిగా చూచి హర్షవిహ్వలయై విప్ఫారిత నేత్రములతో శ్రీరాముని రమానాథుడు పరమాత్మ యగు నారాయణునిగా తెలిసికొని గౌతమముని వచనములు స్మృతికి తెచ్చుకొని అతనిని విధిపూర్వకముగా అర్ఘ్య పాద్యములతో పూజించి కన్నుల హర్షాశ్రువులు నిండగా, నిష్పాపియై, అహల్య దండప్రణామములు చేసి నిలుచుండి రాజీవలోచను డైన రామునిచూచి, సర్వాంగములు పులకితమగుచుండగా గద్గదస్వరముతో ఇట్లు స్తుతింపసాగెను (37-42).

అహల్య ఇట్లనెను - ''జగన్నివాసా! మీ చరణకమల రజఃకణము స్పృశించి నేను కృతార్థురాలనైతిని. ఆహా! నా అదృష్టమేమనవచ్చును! బ్రహ్మ, ఈశ్వరుడు మొదలగు లోకపాలకులే శుద్ధమైన మనసుతో ఈ పాదరజమును వెదకుచుందురు (43).

రామా! నీ లీలలు కడు విచిత్రమైనవి. నీవు మానుషవేషముతో జగత్తును మోహింపచేయుచున్నావు. నిశ్చయముగా నీవు సర్వవ్యాపివి. నిరాకారుడవు, కరచరణాది అంగములు లేకున్నను మానవరూపము దాల్చి సదా సంచరించుచున్నావు. పూర్ణ ఆనందమయుడవగు నీవు మాయాతీతుడవు. మహా మాయావివి (44).

నీ పాదపంకజ పరాగముచే పవిత్రదేహము గల గంగానది శివుడు, బ్రహ్మ మొదలగు దేవతలనందరిని పవిత్రము చేయుచున్నది. అట్టి నీ పాదరజము నేడు సాక్షాత్తు నా కన్నులకు గోచరమగుచున్నది. నా పూర్వపుణ్యమును ఏమని వర్ణింపవచ్చును (45)?

మర్త్యావతారే మనుజాకృతిం హరిం
రామాభిధేయం రమణీయదేహినమ్,
ధనుర్ధరం పద్మవిశాలలోచనం
భజామి నిత్యం న పరాన్భజిష్యే. 46

మర్త్యలోకమున మానవాకృతితో జనించి, మనోహరమైన అలౌకిక దేహమును దాల్చి, ధనుర్బాణములను ధరించి, పద్మముల వలె విశాలమైన కన్నులు గల రాముడను పేరుగల శ్రీహరిని అనుదినమును భజింతును. ఇతరుల నెవ్వరిని భజింపను (46). ఎవని చరణకమల రజము వేదముల ద్వారా వెదుక దగినదో, ఎవని నామరసామృతము శంకరభగవానుడు కూడా ఆస్వాదించునో అట్టి శ్రీరామచంద్రుని అహర్నిశము నా హృదయమున ధ్యానించెదను. ఎవని అవతార చరిత్రమును బ్రహ్మలోకమునందు శంకర పద్మభవాదులు, నారదాది మునులు సంతత ఆనందాశ్రుధారలు ఉరఃసీమను తడుపుచుండగా సరస్వతీదేవియు గానము చేయుదురో అట్టి పరమాత్ముని నేను శరణు వేడుచున్నాను (48). నా ఎదురుగా నున్న ఈ రాముడు పరమాత్మ తప్ప మరియొకడు కాదు. ఇతడు పురాణపురుషుడు, అద్వితీయుడు, స్వయం ప్రకాశకుడు, అనంతుడు (దేశ కాల వస్తువులకు అపరిచ్ఛిన్నుడు) సర్వమునకు మూలకారణమైనవాడు. అట్టి భగవానుడు జగన్మోహనకరమైన మాయామానుషవిగ్రహమును కేవలము భక్తులను అనుగ్రహించుటకే ధరించినాడు. దీనివలన భగవంతుని అవ్యాజకరుణయే ద్యోతకమగును ( గీత - 4/7-8 చూడుడు) (49).

యత్పాదపంకజరజః శ్రుతిభిర్విమృగ్యం,
యన్నాభిపంకజభవః కమలాసనశ్చ,
యన్నామసారరసికో భగవాన్పురారి-
స్తం రామచంద్రమనిశం హృది భావయామి. 47

యస్యావతారచరితాని విరించిలోకే
గాయంతి నారదముఖా భవపద్మజాద్యాః,
ఆనందజాశ్రుపరిషిక్తకుచాగ్రసీమా
వాగీశ్వరీ చ తమహం శరణం ప్రపద్యే. 48

సోఽయం పరాత్మా పురుషః పురాణ
ఏకః స్వయంజ్యోతిరనంత ఆద్యః,
మాయాతనుం లోకవిమోహనీయాం
ధత్తే పరానుగ్రహ ఏష రామః. 49

తానొక్కడై యుండి సృష్టి స్థితి లయములు గావించుటకై, తన మాయాగుణముల నాశ్రయించి బ్రహ్మవిష్ణు మహేశ్వర నామములతో విభిన్నరూపములు దాల్చువాడు. అట్టి స్వతంత్ర పరిపూర్ణాత్మ స్వరూపము నీవే! (50).

అయం హి విశ్వోద్భవసంయమానా-
మేకః స్వమాయాగుణబింబితో యః,
విరించివిష్ణ్వీశ్వరనామ భేదాన్
ధత్తే స్వతంత్రః పరిపూర్ణ ఆత్మా. 50

"ఓ రామా! నీ యొక్క చరణకమలములను లక్ష్మీదేవి తన హృదయముపై నిలుపుకొని అత్యంత ప్రీతితో లాలించును. నీ చరణకమలములు పూర్వము బలి చక్రవర్తి నణచు సందర్భమున ఒక్క అడుగుగా మూడు లోకములను కొలిచినవి; ( ఆక్రమించినవి). అభిమాన వర్జితులైన మునులు నీ చరణకమలములనే నిరంతరము ధ్యానింతురు. అట్టి చరణ కమలములకు నేను ప్రణమిల్లుచున్నాను (51).

నమోఽస్తు తే రామ తవాంఘ్రిపంకజం
శ్రియా ధృతం వక్షసి లాలితం ప్రియాత్,
ఆక్రాంతమేకేన జగత్రయం పురా
ధ్యేయం మునీంద్రైరభిమానవర్జితైః. 51

జగతామాదిభూతస్త్వం జగత్త్వం జగదాశ్రయః,
సర్వభూతేష్వసంయుక్త ఏకో భాతి భవాన్పరః. 52

కార్యాకారణ కర్తృత్వ ఫలసాధనభేదతః
ఏకో విభాసి రామ త్వం మాయయా బహురూపయా. 54

ఓంకారవాచ్యస్త్వం రామ వాచామవిషయః పుమాన్,
వాచ్యవాచకభేదేన భవానేవ జగన్మయః. 53

"ప్రభూ! ఈ జగత్తునకు పూర్వము ఉన్నవాడవు, జగత్తునకు ఆదికారణుడవు. సర్వజగత్తు నీ రూపమే! నిన్ను ఆశ్రయించియే జగత్తు పరిభ్రమించుచున్నది. సర్వప్రాణులు వేరువేరుగా కనబడుచున్నప్పటికి అన్నిటిలో నీవే ఉన్నావు. కాని వానిలో నీవు లిప్తుడవు కావు. నీవే నానా రూపములలో ప్రకాశించుచున్నావు. అయినను నీవు అన్నిటికంటె పరముడవు, శ్రేష్ఠుడవు (52).

"ఓ రామా! నీవు ఓంకారశబ్దవాచ్యుడవు. వాక్కునకు అందని పరమపురుషుడవు. వాచ్య వాచక (శబ్ద అర్థ) భేదములచే నీవే సకల ప్రపంచ స్వరూపుడవైయున్నావు" (53).

"నీవే కార్యము. అనగా ప్రపంచము. నీవు కారణము అనగా మూలప్రకృతివి. నీవే కర్తవు అనగా నీ సంకల్పము చేతనే సృష్టి జరుగుచున్నది. దీనిని పొందదగిన ఫలము నీవే! సాధనము (ఉపకరణము) నీవే! నీవు ఒక్కడవే అయినను నీ మాయద్వారా అనేక రూపములుగా (ఒక నటుడు వివిధ వేషములలో వేరువేరుగా కనబడునట్లు) గోచరించుచున్నావు (54).

త్వన్మాయామోహితధియస్త్వాం న జానంతి తత్త్వతః,
మానుషం త్వాభిమన్యంతే మాయినం పరమేశ్వరమ్. 55

ఆకాశవత్త్వం సర్వత్ర బహిరంతర్గతోఽమలః,
అసంగో హ్యచలో నిత్యః శుద్ధో బుద్ధః సదవ్యయః. 56

యోషిన్మూఢాహమజ్ఞా తే తత్త్వం జానే కథం విభో,
తస్మాత్తే శతశో రామ నమస్కుర్యామనన్యధీః. 57

దేవ మే యత్ర కుత్రాపి స్థితాయా అపి సర్వదా,
త్వత్పాదకమలే సక్తా భక్తిరేవ సదాస్తు మే. 58

నమస్తే పురుషాధ్యక్ష నమస్తే భక్తవత్సల,
నమస్తేఽస్తు హృషీకేశ నారాయణ నమోఽస్తు తే. 59

నీ మాయచే మోహితమైనబుద్ధి కలవారు నీ వాస్తవిక తత్త్వము తెలియక మాయామనుష్యరూపుడవైన నిన్ను, పరమేశ్వరుడవైనను సామాన్యమానవునిగా భావింతురు (55). నీవు ఆకాశమువలె వెలుపల లోపల అంతటను వ్యాపించియున్నావు. అయినను నీవు నిరంజనుడవు, నిర్లిప్తుడవు, అచలుడవు, నిత్యుడవు, శుద్ధుడవు, జ్ఞానస్వరూపుడవు, సత్స్వరూపుడవు, అవ్యయుడవు (అవినాశివి) (56). హే! విభో! నేను వివేకశూన్యురాలను. పరమేశ్వర విషయక జ్ఞానము ఎరుగనిదానను, స్త్రీని. నీ తత్త్వము ఎటుల తెలియగలను? అందువలన అనన్యభక్తితో పలువారలు నీకు నమస్కరించెదను (57). దేవా! నేను ఎచట ఉన్నను సర్వకాల సర్వావస్థలయందు నీ పాద కమలములయందే దృఢమైన భక్తి యుండుగాక! (58) పురుషోత్తమా! భక్తవత్సలా! హృషీకేశా! నారాయణా! నీకు పదేపదే నమస్కరించుచున్నాను (59).

భవభయహరమేకం భానుకోటిప్రకాశం
కరధృతశరచాపం కాలమేఘావభాసమ్,
కనకరుచిరవస్త్రం రత్నవత్కుండలాఢ్యం
కమలవిశదనేత్రం సానుజం రామమీడే. 60

"రామా! సంసార భయమును తొలగించుటకు నీవొక్కడవే సమర్థుడవు. అసంఖ్యాకసూర్యుల కాంతి కలవాడవు. కరముల శరచాపముల ధరించినవాడవు. నీలమేఘశ్యాముడవు. సువర్ణనిభ పీతాంబరధారివి. రత్నఖచిత కుండలములు ధరించినవాడవు. పూర్ణవికాసముకల పద్మములవంటి నేత్రములు కలవాడవు. రామా! అనుజానితో కూడిన నిన్ను స్తుతించుచున్నాను" (60).

స్తుత్వైవం పురుషం సాక్షాత్ రాఘవం పురతః స్థితమ్,
పరిక్రమ్య ప్రణమ్యాశు సానుజ్ఞాతా యయౌ పతిమ్. 61

ఈ విధముగా సమ్ముఖమున నిలిచియున్న సాక్షాత్తు పరమపురుషుడైన శ్రీరఘునాథుని స్తుతించి అతనికి ప్రదక్షిణ నమస్కారములు చేసి, అతని అనుజ్ఞగొని, అహల్య వెంటనే తన పతి యొద్దకు వెడలిపోయెను (61).

అహల్యయా కృతం స్తోత్రం యః పఠేద్భక్తిసంయుతః,
స ముచ్యతేఽఖిలైః పాపైః పరం బ్రహ్మాధిగచ్ఛతి. 62

అహల్యచే గావించబడిన ఈ స్తోత్రమును భక్తిపూర్వకముగా పఠించువారు సమస్త పాపములనుండి ముక్తులై పరబ్రహ్మ పదమును పొందుదురు (62).

పుత్రాద్యర్థే పఠేద్భక్త్యా రామం హృది నిధాయ చ,
సంవత్సరేణ లభతే వంధ్యా అపి సుపుత్రకమ్. 63

సర్వాన్కామానవాప్నోతి రామచంద్రప్రసాదతః. 64

వంధ్యురాలగు స్త్రీ అయినను శ్రీరామచంద్రుని హృదయమున నిలుపుకొని, పుత్రేచ్ఛతో దీనిని భక్తిపూర్వకముగా పఠించినచో ఆమెకు ఒక్క సంవత్సర కాలములోనే శ్రేష్ఠుడగు పుత్రుడు జన్మించగలడు. శ్రీరామచంద్రుని కృపచే ఆమె సమస్త కోరికలు సఫలము లగును (63-64).

బ్రహ్మఘ్నో గురుతల్పగోఽపి పురుషః
స్తేయీ సురాపోఽపి వా
మాతృభ్రాతృవిహింసకోఽపి సతతం
భోగైకబద్ధాతురః,
నిత్యం స్తోత్రమిదం జపన్ రఘుపతిం
భక్త్యా హృదిస్థం స్మరన్
ధ్యాయన్ముక్తిముపైతి కిం పునరసౌ
స్వాచారయుక్తో నరః. 65

బ్రహ్మహత్యాపాతకుడు, గురుతల్పగామి, చోరుడు, త్రాగుబోతు, తల్లిదండ్రులను, సోదరులను హింసించువాడు, నిరంతర భోగాసక్తుడు - ఇట్లు అనేక పాపములను ఇతఃపూర్వము చేసినవాడైనను, భక్తి పూర్వకముగా హృదయమునందు రఘుపతిని స్మరించుచు, ధ్యానించుచు ఈ స్తోత్రమును పఠించిన ముక్తిని పొందును. ఇట్టి పాపులకే ముక్తి లభించుచున్నపుడు, స్వధర్మ పరాయణులైనవారు ఈ స్తోత్ర పారాయణము చేసినచో వేరుగా చెప్పవలెనా? (65)"

ఇతి శ్రీమదధ్యాత్మరామాయణాంతర్గత ఉమామహేశ్వరసంవాదములో
బాలకాండ - పంచమ సర్గము ॥ 5 ॥

-----*****-----

ఓం

# షష్ఠ సర్గము

## ధనుర్భంగము - వివాహము

**శ్రీ మహాదేవ ఉవాచ**

విశ్వామిత్రోఽథ తం ప్రాహ
రాఘవం సహలక్ష్మణమ్,
గచ్ఛామో వత్స మిథిలాం
జనకేనాభిపాలితామ్. 1

దృష్ట్వా క్రతువరం పశ్చాదయోధ్యాం గంతుమర్హసి,
ఇత్యుక్త్వా ప్రయయౌ గంగాముత్తర్తుం సహరాఘవః,
తస్మింకాలే నావికేన నిషిద్ధో రఘునందనః. 2

**నావిక ఉవాచ**

క్షాలయామి తవ పాదపంకజం
నాథ దారుదృషదోః కిమంతరమ్,
మానుషీకరణచూర్ణమస్తి తే
పాదయోరితి కథా ప్రథీయసీ. 3

పాదాంబుజం తే విమలం హి కృత్వా
పశ్చాత్పరం తీరమహం నయామి,
నోచేత్తరీ సద్యువతీ మలేన
స్యాచ్చేద్విభో విద్ధి కుటుంబహానిః. 4

ఇత్యుక్త్వా క్షాలితౌ పాదౌ పరం తీరం తతో గతాః,
కౌశికో రఘునాథేన సహితో మిథిలాం యయౌ. 5

విదేహస్య పురం ప్రాతర్ఋషివాటం సమావిశత్,
ప్రాప్తం కౌశికమాకర్ణ్య జనకోఽతిముదాన్వితః. 6

పూజాద్రవ్యాణిసంగృహ్యాసోపాధ్యాయః సమాయయౌ,
దండవత్ప్రణిపత్యాథ పూజయామాస కౌశికమ్. 7

పప్రచ్ఛ రాఘవౌ దృష్ట్వా సర్వలక్షణసంయుతౌ,
ద్యోతయంతౌ దిశః సర్వాశ్చంద్రసూర్యావివాపరౌ. 8

కస్యైతౌ నరశార్దూలౌ పుత్రౌ దేవసుతోపమౌ,
మనఃప్రీతికరౌ మేఽద్య నరనారాయణావివ. 9

శ్రీ మహాదేవుడు చెప్పుచున్నాడు - అనంతరము విశ్వామిత్రుడు లక్ష్మణసమేతుడైన రాఘవునితో ''నాయనా! ఇపుడు మనము జనకమహారాజు పాలించు మిథిలానగరమునకు వెళ్లెదము (1). అచట యజ్ఞోత్సవమును చూచి నీవు అయోధ్యానగరమునకు మరలి పోవచ్చును'' అని పలికెను పిదప రామునితో కలసి గంగను దాటుటకై తీరము చేరెను. అక్కడ నావికుడు రఘునందనుని నావ ఎక్కవలదని నిషేధించెను (2)

నావికుడిట్లనెను - ''స్వామీ! మీ పాదములయందు (వస్తువులను) మనుష్యులనుగా మార్చు మార్గము (మందు) ఉన్నదని ప్రసిద్ధమైనది. (మీరు ఇంతకు ముందే రాతిని నాతిగా మార్చివేసిరి కదా!) శిలకును చెక్కకును భేదమేమి! కావున మిమ్ము నావను ఎక్కించుకొనుటకు ముందు మీ పాదములను కడిగెదను (3). ఈ విధముగా మీ చరణకమలములు కడిగిన పిదప, మిమ్ము గంగకు ఆవలివంక చేర్చెదను. అటుల కాకున్న ప్రభూ! నీ చరణకమల రజస్పర్శనే నా నౌకయు ఒక యువతిగా మారినచో నా బ్రతుకుతెరువు దుర్భరమగును'' (4). ఇట్లు పలికి నావికుడు శ్రీరాముని పాదపద్మములను కడిగి అనంతరమే గంగ ఆవలి ఒడ్డుకు చేర్చెను. అటనుండి విశ్వామిత్రుడు రామలక్ష్మణ సమేతుడై మిథిల చేరెను (5).

ఉదయముననే వారు విదేహనగరమును చేరి ఋష్యాశ్రమముల నిలిచిరి. ఆ సమయముననే విశ్వామిత్రుని ఆగమనవార్త విని, జనకుడు అత్యంతహర్షముతో పూజాసామగ్రిని గ్రహించి తన కులగురువగు శతానందునితో వచ్చి సాష్టాంగదండప్రణామము చేసి కౌశికుని పూజించెను (6-7). అపర సూర్యచంద్రులవలె తమ కాంతితో సకల దిశలు ప్రకాశింపచేయుచున్న రఘువంశదీపకులను, సర్వ లక్షణ సంపన్నులను చూచి, విశ్వామిత్రుని ఇట్లు ప్రశ్నించెను - (8)

''దేవకుమారుల వలె నున్న యీ ఇద్దరు నరశ్రేష్ఠులు ఎవరి కుమారులు? వీరిరువురు నరనారాయణులవలె నా మదికి తోచుచు ప్రీతి కొలుపుచున్నారు (9).''

ప్రత్యువాచ మునిః ప్రీతో హర్షయన్ జనకం తదా,
పుత్రౌ దశరథస్యైతౌ భ్రాతరౌ రామలక్ష్మణౌ. 10

మఖసంరక్షణార్థాయ మయానీతౌ పితుః పురాత్,
ఆగచ్ఛన్ రాఘవో మార్గే తాటకాం విశ్వఘాతినీమ్. 11

శరేణైకేన హతవాన్నోదితో మేఽతివిక్రమః,
తతో మమాశ్రమం గత్వా మమ యజ్ఞవిహింసకాన్. 12

సుబాహుప్రముఖాన్హత్వా మారీచం సాగరేఽక్షిపత్,
తతో గంగాతటే పుణ్యే గౌతమస్యాశ్రమం శుభమ్. 13

గత్వా తత్ర శిలారూపా గౌతమస్య వధూః స్థితా,
పాదపంకజసంస్పర్శాత్కృతా మానుషరూపిణీ. 14

దృష్ట్వాఽహల్యాం నమస్కృత్య తయా సమ్యక్సుపూజితః,
ఇదానీం ద్రష్టుకామోఽస్తే గృహే మాహేశ్వరం ధనుః. 15

పూజితం రాజభిః సర్వైర్దృష్టమిత్యనుశుశ్రువే,
అతో దర్శయ రాజేంద్ర శైవం చాపమనుత్తమమ్,
దృష్ట్వాయోధ్యాం జిగమిషుః పితరం ద్రష్టుమిచ్ఛతి. 16

ఇత్యుక్తో మునినా రాజా పూజార్హావితి పూజయా,
పూజయామాస ధర్మజ్ఞో విధిదృష్టేన కర్మణా. 17

తతః సంప్రేషయామాస మంత్రిణం బుద్ధిమత్తరమ్,
శీఘ్రమానయ విశ్వేశచాపం రామాయ దర్శయ. 18

తతో గతే మంత్రివరే రాజా కౌశికమబ్రవీత్
యది రామో ధనుర్ధృత్వా కోట్యామారోపయేద్గుణమ్. 19

తదా మయాత్మజా సీతా దీయతే రాఘవాయ హి,
తథేతి కౌశికోఽప్యాహ రామం సంవీక్ష్య సస్మితమ్. 20

అపుడు విశ్వామిత్రుడు ప్రీతిపూర్వకముగా జనక మహారాజునకు ఆనందము కలిగించుచు ఇట్లు పలికెను - "వీరిరువురు సోదరులు. రామలక్ష్మణులు. దశరథుని కుమారులు (10). నేను వీరిని నా యజ్ఞసంరక్షణార్థము అయోధ్యనుండి తీసికొనివచ్చితిని. మార్గమున వచ్చునపుడు నా ప్రేరణతో మహాపరాక్రమశాలియగు ఈ రాఘవుడు ఒకే ఒక్క బాణముతో విశ్వఘాతిని యగు తాటకను వధించెను. పిమ్మట నా ఆశ్రమమునకు వచ్చి, నా యజ్ఞమును విధ్వంసము చేయు సుబాహుడు మొదలైన రాక్షసులను పరిమార్చెను. మారీచుని సముద్రమున పడగొట్టెను. అనంతరము గంగాతటమున నున్న గౌతమమహర్షి పవిత్రాశ్రమమును చేరి అచ్చట శిలారూపముననున్న గౌతమపత్నికి తన చరణకమల స్పర్శచే మానవరూపమును కలుగచేసెను (11-14). అహల్యను చూచి, రాముడామెకు నమస్కరించి ఆమె సమర్పించిన పూజలను స్వీకరించి, ఈ సమయమున మీ యింట పూజింపబడుచున్న శివధనువును చూడవచ్చి యున్నాడు. (15) భూమియందుగల రాజులెల్లరు చూచిరని, ఎవరును ఎక్కుపెట్టలేకపోయిరనియు వినినాడు. కావున ఓ రాజేంద్రా! మహాదేవుని ఉత్తమధనువును ఈతనికి చూపుడు. ఇతడు దానిని చూచి, శీఘ్రముగ తన తల్లిదండ్రులను చూచుటకు అయోధ్యకు వెడలగోరు చున్నాడు" (16).

విశ్వామిత్రుడిట్లు పలుకగా ధర్మజ్ఞుడగు జనక మహారాజు రామలక్ష్మణులను పూజార్హులుగా తెలిసికొని వారిని విధివిధానముగా పూజించెను (17) అటుపిమ్మట సత్వరము శ్రీవిశ్వేశ్వరుని మహాధనువును తెప్పించి రామునికి చూపుమని ధీమంతుడగు తన మంత్రిని ఆజ్ఞాపించెను (18).

మంత్రి వెడలగానే రాజు విశ్వామిత్రునితో "రాముడు ఆ ధనువును ఎత్తి దానికి నారి సంధింపగలిగినచో నిశ్చయముగ, నేనాతనికే నా కుమార్తె సీతను ఇచ్చి వివాహము చేయుదును" అని పలికెను. అంత విశ్వామిత్రుడు చిరునగవుతో రాముని వంక చూచుచు "అటులనే యగుగాక! మీరా శ్రేష్ఠమగు ధనువును అమితపరాక్రమవంతుడగు రామునకు చూపుడు" అని పలుకుచుండగనే మహా

శీఘ్రం దర్శయ చాపాగ్ర్యం రామాయామితతేజసే,
ఏవం బ్రువతి మౌనీశ ఆగతాశ్చాపవాహకాః. 21

చాపం గృహీత్వా బలినః పంచసాహస్రసంఖ్యకాః,
ఘంటాశతసమాయుక్తం మణివజ్రాదిభూషితమ్. 22

దర్శయామాస రామాయ మంత్రీ మంత్రయతాం వరః,
దృష్ట్వా రామః ప్రహృష్టాత్మా బద్ధ్వా పరికరం దృఢమ్. 23

గృహీత్వా వామహస్తేన లీలయా తోలయన్ ధనుః,
ఆరోపయామాస గుణం పశ్యత్స్వఖిలరాజసు. 24

ఈషదాకర్షయామాస పాణినా దక్షిణేన సః,
బభంజాఖిలహృత్సారో దిశః శబ్దేన పూరయన్. 25

దిశశ్చ విదిశశ్చైవ స్వర్గం మర్త్యం రసాతలమ్,
తదద్భుతమభూత్తత్ర దేవానాం దివి పశ్యతామ్. 26

ఆచ్ఛాదయంతః కుసుమైర్దేవాః స్తుతిభిరీడిరే,
దేవదుందుభయో నేదుర్ననృతుశ్చాప్సరోగణాః. 27

ద్విధా భగ్నం ధనుర్దృష్ట్వా రాజాలింగ్య రఘూద్వహమ్,
విస్మయం లేభిరే సీతా మాతరోఽంతఃపురాజిరే. 28

సీతా స్వర్ణమయీం మాలాం గృహీత్వా దక్షిణే కరే,
స్మితవక్త్రా స్వర్ణవర్ణా సర్వాభరణభూషితా. 29

ముక్తాహారైః కర్ణపత్రైః క్వణచ్చరణనూపురా,
దుకూలపరిసంవీతా వస్త్రాంతర్వ్యంజితస్తనీ. 30

రామస్యోపరి నిక్షిప్య స్మయమానా ముదం యయౌ,
తతో ముముదిరే సర్వే రాజదారాః స్వలంకృతమ్. 31

గవాక్షజాలరంధ్రేభ్యో దృష్ట్వా లోకవిమోహనమ్,
తతోఽబ్రవీన్మునిం రాజా సర్వశాస్త్రవిశారదః. 32

భో కౌశిక మునిశ్రేష్ఠ పత్రం ప్రేషయ సత్వరమ్,
రాజా దశరథః శీఘ్రమాగచ్ఛతు సపుత్రకః. 33

వివాహార్థం కుమారాణాం సదారః సహమంత్రిభిః,
తథేతి ప్రేషయామాస దూతాంస్త్వరితవిక్రమాన్. 34

బలశాలురైన ఐదువేలమంది ధనుర్వాహకులు, వందలాది చిరుగంటలతో, మణులతో వజ్రములతో భూషితమైన ధనుస్సును తీసికొనివచ్చిరి (19-22). మంత్రివరుడు రామునకా ధనువును చూపించెను. ప్రసన్నహృదయుడై రాముడు దానిని చూచుటతోనే నడుము బిగించి దానిని అవలీలగా ఎడమచేత ఎత్తి పట్టుకొని రాజులెల్లరు చూచుచుండగ దానికి నారి సంధించెను (23-24).

అఖిల ప్రాణుల బలమును హరించు శక్తిగల రాముడు తన కుడిచేత అల్లిత్రాటిని కొంచెము లాగెను. ధనుస్సు విరుగగా పుట్టిన ధ్వనితో దిక్కులు పిక్కటిల్లెను (25). స్వర్గ మర్త్య పాతాళ లోకములు అన్నిదిశలు వహారు మ్రోగెను. ఆకాశమునుండి దేవతలు చూచుచుండగా ఈ అద్భుతము జరిగెను (26). దేవతలు రామునిపై పుష్పవృష్టి కురిపించిరి. దేవదుందుభులు మ్రోగించిరి. రాముని స్తుతించిరి. అప్సరసలు నాట్యమాడిరి (27).

ధనుస్సు రెండు ఖండములగుట చూచి జనకుడు రఘునందనుని కౌగలించుకొనెను. అంతఃపురములో సీతాదేవి తల్లులు ధనుర్భంగవృత్తాంతమును విని ఆనందమును, ఆశ్చర్యమును పొందిరి (28).

తదనంతరము సర్వాలంకార విభూషితయై బంగారువన్నెగల సీత కుడిచేత సువర్ణమయ మాల ధరించి, చిరునగవు లొలికించుచు, అచటకు వచ్చెను. ఆమె ముత్యాల హారములు కర్ణపుష్పములు గిలుకుటందెలు మొదలగు ఆభరణములు ధరించియున్నది. పట్టువస్త్రమును ధరించినది. కాలియందియల సవ్వడితో వచ్చి చిరునగవుతో శ్రీరాముని మెడలో మిక్కిలి సంతోషముతో మాలను వేసెను. అట్లు అలంకరింపబడిన భువనైకమోహనుడైన శ్రీరాముని, రాణులందరు గవాక్షజాల రంధ్రములనుండి చూచుచు ఆనందభరితులైరి. పిమ్మట సర్వశాస్త్రకోవిదుడైన రాజా విశ్వామిత్రునితో ఇట్లు పలికెను (29-32)-

''మునివరేణ్యా! మీరు వెంటనే దశరథ మహారాజునకు పత్రమంపుడు. కుమారుల వివాహ మహోత్సవమునకు శీఘ్రముగా పుత్రులతో, రాణులతో, మంత్రులతో రావలయునని తెల్పుడు''. విశ్వామిత్రుడు వెంటనే 'అట్లే' యని శీఘ్రగాములగు దూతలను పంపించెను (33-34).



సీతాదేవి శ్రీరాముని మెడలో స్వయంవరమాల వేయుట

తే గత్వా రాజశార్దూలం రామశ్రేయో న్యవేదయన్,
శ్రుత్వా రామకృతం రాజా హర్షేణ మహతాప్లుతః. 35

మిథిలాగమనార్థాయ త్వరయామాస మంత్రిణః,
గచ్ఛంతు మిథిలాం సర్వే గజాశ్వరథపత్తయః. 36

రథమానయ మే శీఘ్రం గచ్ఛామ్యద్యైవ మా చిరమ్,
వసిష్ఠస్త్వగ్రతో యాతు సదారః సహితోఽగ్నిభిః. 37

రామమాతౄః సమాదాయ మునిర్మే భగవాన్ గురుః,
ఏవం ప్రస్థాప్య సకలం రాజర్షిర్విపులం రథమ్. 38

మహత్యా సేనయా సార్ధమారుహ్య త్వరితో యయౌ,
ఆగతం రాఘవం శ్రుత్వా రాజా హర్షసమాకులః. 39

ప్రత్యుజ్జగామ జనకః శతానందపురోధసా,
యథోక్తపూజయా పూజ్యం పూజయామాస సత్కృతమ్.
40

రామస్తు లక్ష్మణేనాశు వవందే చరణౌ పితుః,
తతో హృష్టో దశరథో రామం వచనమబ్రవీత్. 41

దిష్ట్యా పశ్యామి తే రామ ముఖం ఫుల్లాంబుజోపమమ్,
మునేరనుగ్రహాత్సర్వం సంపన్నం మమ శోభనమ్. 42

ఇత్యుక్త్వాఘ్రాయ మూర్ధానమాలింగ్య చ పునః పునః,
హర్షేణ మహతావిష్టో బ్రహ్మానందం గతో యథా. 43

తతో జనకరాజేన మందిరే సన్నివేశితః,
శోభనే సర్వభోగాఢ్యే సదారః ససుతః సుఖీ. 44

తతః శుభే దినే లగ్నే సుముహూర్తే రఘూత్తమమ్,
ఆనయామాస ధర్మజ్ఞో రామం సభ్రాతృకం తదా. 45

రత్నస్తంభసువిస్తారే సువితానే సుతోరణే,
మండపే సర్వశోభాఢ్యే ముక్తాపుష్పఫలాన్వితే. 46

దూతలు పోయి రాజశ్రేష్ఠుడగు దశరథునకు రాముని కీర్తి ఉత్కర్షమును, వివాహ మంగళ శ్రేయో సమాచారమును తెలియచేసిరి. శ్రీరాముని అద్భుత కృత్యమును గురించి విని దశరథుడు పరమానంద భరితుడయ్యెను (35). పిమ్మట అతడు మిథిలా ప్రయాణమునకు తొందర పెట్టుచు మంత్రులతో ఇట్లు పలికెను - ''ఏనుగులు, గుఱ్ఱములు, రథములు, పదాతి దళములతో కూడి అందరు మిథిలకు బయలుదేరుదురు గాక ( 36). నా రథము శీఘ్రముగా తీసికొని రండు ఆలస్యము వలదు. నేను నేడే బయలు దేరుదును. మా కులగురువగు వశిష్ఠుడు అగ్నులతో, భార్యయగు అరుంధతిని వెంటనిడుకొని, రాముని తల్లులను తోడ్కొని, అందరికంటె ముందు సాగవలెను''. ఈ విధముగా అందరను ప్రయాణింపజేసి రాజర్షియగు దశరథుడు విశాలమగు రథము నధిరోహించి సమస్త బలగముతో మిథిలకు వెడలెను. రఘువంశీయుడగు దశరథమహారాజు ఆగమనవార్త విని, జనకమహారాజు మిక్కిలి సంతోషముతో తన పురోహితుడైన శతానందుని వెంటగొని వారికి ఎదురుగా వెడలెను. పూజార్హుడగు దశరథుని యథోచితముగా సత్కరించి పూజించెను (37-40). తరువాత లక్ష్మణుని వెంటనిడుకొని రాముడు తండ్రి పాదములకు నమస్కరించెను. అంతట దశరథమహారాజు ప్రసన్నుడై రామునితో (41) ''రామా! వికసించిన పద్మమువంటి నీ ముఖమును నేడు చూడగలుగుచున్నాను. అదృష్టవంతుడను. మునీశ్వరుని అనుగ్రహముతో అన్నివిధములుగా నాకు శ్రేయస్సే కలిగినది'' (42), అని పలికి అతడు కుమారుని పలుమారులు హృదయమునకు హత్తుకొని అతని మస్తకము నాఘ్రాణించి అత్యంత హర్షముతో బ్రహ్మానందమున మునిగి పోయెను. తదనంతరము జనక మహారాజు అతనిని రాణుల తోడను, రాజకుమారుల తోడను, సమస్త భోగ్యవస్తు పూర్ణమైన అత్యంత సుందర మందిరమున సుఖమగు విడిదిని ఏర్పాటు గావించెను. ఆ తరువాత తగిన శుభదినమున శుభముహూర్తమున శుభలగ్న సమయమున ధర్మజ్ఞుడగు జనకుడు సోదరసమేతుడగు శ్రీరాముని పిలిపించెను (45). విశాలమగు రత్న ఖచిత స్తంభములతో, మనోహరములగు తోరణములతో, సుందరతర వితానముతో ముత్యముల పుష్పముల ఫలముల సముదాయముతో సువర్ణ

వేదవిద్భిః సుసంబాధే బ్రాహ్మణైః స్వర్ణభూషితైః,
సువాసినీభిః పరితో నిష్కకంఠీభి రావృతే. 47

భేరీదుందుభినిర్ఘోషైర్గీతనృత్యైః సమాకులే,
దివ్యరత్నాంచితే స్వర్ణపీఠే రామం న్యవేశయత్. 48

వసిష్ఠం కౌశికం చైవ శతానందః పురోహితః,
యథాక్రమం పూజయిత్వా రామస్యోభయపార్శ్వయోః.
49

స్థాపయిత్వా స తత్రాగ్నిం జ్వాలయిత్వా యథావిధి,
సీతామానీయ శోభాఢ్యాం నానారత్నవిభూషితామ్. 50

సభార్యో జనకః ప్రాయాద్రామం రాజీవలోచనమ్,
పాదౌ ప్రక్షాళ్య విధివత్తదపో మూర్ధ్న్యధారయత్. 51

యా ధృతా మూర్ధ్ని శర్వేణ బ్రహ్మణా మునిభిః సదా,
తతః సీతాం కరే ధృత్వా సాక్షతోదకపూర్వకమ్. 52

రామాయ ప్రదదౌ ప్రీత్యా పాణిగ్రహవిధానతః,
సీతా కమలపత్రాక్షీ స్వర్ణముక్తాదిభూషితా. 53

దీయతే మే సుతా తుభ్యం ప్రీతో భవ రఘూత్తమ,
ఇతి ప్రీతేన మనసా సీతాం రామకరేఽర్పయన్. 54

ముమోద జనకో లక్ష్మీం క్షీరాబ్ధిరివ విష్ణవే,
ఊర్మిలాం చౌరసీం కన్యాం లక్ష్మణాయ దదౌ ముదా. 55

తథైవ శ్రుతకీర్తిం చ మాండవీం భ్రాతృకన్యకే,
భరతాయ దదావేకాం శత్రుఘ్నాయాపరాం దదౌ. 56

చత్వారో దారసంపన్నా భ్రాతరః శుభలక్షణాః,
విరేజుః ప్రభయా సర్వే లోకపాలా ఇవాపరే. 57

తతోఽబ్రవీద్వసిష్ఠాయ విశ్వామిత్రాయ మైథిలః,
జనకః స్వసుతోదంతం నారదేనాభిభాషితమ్. 58

యజ్ఞభూమివిశుద్ధ్యర్థం కర్షతో లాంగలేన మే,
సీతాముఖాత్సముత్పన్నా కన్యకా శుభలక్షణా. 59

భూషణాలంకృతులగు వేదవేత్తలగుబ్రాహ్మణులతో సుందర కంఠాభరణములు ధరించిన ముత్తైదువులతో పరివేష్టించబడిన మంటపమునందు శ్రీరాముని దివ్యరత్న ఖచిత సింహాసనమున ఆసీనుని గావించెను. ఆ సమయమున దుందుభులు, భేరులు మారుమ్రోగెను. నృత్యగానాదుల, మంగళధ్వనులచే కోలాహలము నిండెను (46 -48).

పురోహితుడగు శతానందుడు, వశిష్ఠ విశ్వామిత్రులను క్రమముగా పూజించి వారిని రాముని కిరువంకల కూర్చుండచేసెను. విధిపూర్వకముగా అగ్నిని ప్రజ్వలింప చేసెను. అపుడు నానారత్నాభరణ విభూషితయై శోభాయమానమై వెలుగు సీతను తోడ్కొని మహారాణితో సహా, జనకరాజేంద్రుడు కమలనయనుడగు రాముని వద్దకు వచ్చెను. విధ్యుక్తముగా అతని చరణకమలములు కడిగి శివబ్రహ్మలు మునులు సైతము తమ శిరముల దాల్చిన ఆ పాదోదకమును, తన శిరమున జల్లుకొనెను (49-51).

పిమ్మట జనకుడు అక్షతోదకముతో సీతను పాణిగ్రహణవిధానమున ప్రీతిపూర్వకముగా శ్రీరామచంద్రుని కరకమలముల యందు సమర్పించెను. అతడు ''రఘుకుల తిలకా! నేను స్వర్ణముక్తాది భూషితయగు నా పుత్రిని, కమలలోచని యగు సీతను నీకు అర్పించుచున్నాను. నీకు మంగళమగుగాక!'' అని చెప్పెను. ఈ విధముగా సీతను ప్రసన్న చిత్తముతో శ్రీరాముని హస్తములందుంచి, క్షీర సముద్రుడు తన కుమార్తె లక్ష్మిని విష్ణుభగవానునకు సమర్పించిననాడు పొందినట్టి ఆనందమును, జనక మహారాజు పొందెను. తరువాత తన పుత్రిక ఊర్మిళను లక్ష్మణునికిచ్చి వివాహము గావించెను. అట్లే తన సోదరుని కుమార్తెలగు మాండవి శ్రుతకీర్తులను వరుసగా భరత, శత్రుఘ్నులకు సమర్పించెను (52 - 56). ఈ ప్రకారముగా శుభలక్షణ సంపన్నులగు నలుగురు సోదరులు తమ పత్నులతో గూడి అపర లోకపాలురవలె కాంతితో సుశోభితులైరి (57).

అనంతరము మిథిలాపతి జనకమహారాజు తన పుత్రిక యగు జానకి విషయమున నారదమహర్షి తెలిపిన వృత్తాంతమంతయు వశిష్ఠ విశ్వామిత్రులకు వినిపించెను (58) - '' ఒకసారి నేను యజ్ఞభూమిని శుద్ధి చేయుటకు నాగలితో దున్నుచుండగా, నాగేటిచాలున శుభలక్షణ సంపన్నురాలు శరచ్చంద్ర సమాన ముఖకాంతిగల కన్యక వెలువడినది. అపుడు

తామద్రాక్షమహం ప్రీత్యా పుత్రికాభావభావితామ్,
అర్పితా ప్రియభార్యాయై శరచ్చంద్రనిభాననా. 60

ఏకదా నారదోఽభ్యాగాద్వివిక్తే-మయి సంస్థితే,
రణయన్మహతీం వీణాం గాయన్నారాయణం విభుమ్. 61

పూజితః సుఖమాసీనో మాముడాచ సుఖాన్వితః,
శ్రుణుష్వ వచనం గుహ్యం తవాభ్యుదయకారణమ్. 62

పరమాత్మా హృషీకేశో భక్తానుగ్రహకామ్యయా,
దేవకార్యార్థసిద్ధ్యర్థం రావణస్య వధాయ చ. 63

జాతో రామ ఇతి ఖ్యాతో మాయామానుషవేషధృక్,
ఆస్తే దాశరథిర్భూత్వా చతుర్ధా పరమేశ్వరః. 64

యోగమాయాపి సీతేతి జాతా వై తవ వేశ్మని,
అతస్త్వం రాఘవాయైవ దేహి సీతాం ప్రయత్నతః. 65

నాన్యేభ్యః పూర్వభార్యైషా రామస్య పరమాత్మనః,
ఇత్యుక్త్వా ప్రయయౌ దేవగతిం దేవమునిస్తదా. 66

తదారభ్య మయా సీతా విష్ణోర్లక్ష్మీర్విభావ్యతే,
కథం మయా రాఘవాయ దీయతే జానకీ శుభా. 67

ఇతి చింతాసమావిష్టః కార్యమేకమచింతయమ్,
మత్పితామహగేహే తు న్యాసభూతమిదం ధనుః. 68

ఈశ్వరేణ పురా క్షిప్తం పురదాహాదనంతరమ్,
ధనురేతత్పణం కార్యమితి చింత్య కృతం తథా. 69

సీతాపాణిగ్రహార్థాయ సర్వేషాం మానశాశనమ్,
త్వత్ప్రసాదాన్మునిశ్రేష్ఠ రామో రాజీవలోచనః. 70

ఆగతోఽత్ర ధనుర్ద్రష్టుం ఫలితో మే మనోరథః,
అద్య మే సఫలం జన్మ రామ త్వాం సహ సీతయా. 71

ఏకాసనస్థం పశ్యామి భ్రాజమానం రవిం యథా,
త్వత్పాదాంబుధరో బ్రహ్మా సృష్టిచక్రప్రవర్తకః. 72

నేనామెను ఆదరముతో పుత్రికా భావముతో చూచితిని. తదుపరి ఆమెను నా ప్రియభార్యకు అప్పగించితిని (59-60).

ఒకనాడు నేను ఏకాంతమున నుండగా అచటకు నారదుడు తన మహతీవీణను మ్రోయించుచు శ్రీమన్నారాయణుని గానము చేయుచు వచ్చెను. అతడు నాచే పూజాసత్కారములను పొందినవాడై సుఖాసీనుడై, ప్రసన్న వదనముతో, నాతో ఇట్లనెను – "రాజా! నీకు శ్రేయస్సు కలుగజేయు ఈ రహస్యవచనములను ఆలించుము (61- 62):

పరమాత్మయగు హృషీకేశుడు భక్తులపై దయ కలిగి, దేవకార్యార్థియై రావణాదుల వధించుటకై రాముడను పేర మాయా మానుషవిగ్రహుడై అవతరించి ప్రసిద్ధుడైనాడు. ఆ పరమేశ్వరుడు తన నాలుగు అంశములతో దశరథునకు పుత్రత్వము నంది, అయోధ్యయందు వసించుచున్నాడు (63-64). ఇట యోగమాయ సీతపేర నీయింట వెలసినది. కావున ప్రయత్నపూర్వకముగా సీతను రామునకే యిచ్చి పరిణయము గావింపుము. వేరెవ్వరికినీ ఈయవలదు. ఏలయన ఈమె మొదటినుండియు పరమాత్ముడైన రామునికే భార్య". ఈ మాటలు పలికి దేవర్షియగు నారదుడు ఆకాశమార్గమున వెడలిపోయెను (65- 66).

నాటినుండి నేను సీతను మహావిష్ణువు భార్యయగు లక్ష్మియే అని భావించుచున్నాను. శుభలక్షణయైన సీతను రాఘవునకు ఎటుల సమర్పించగలనా యని యోచించుచుంటిని. దానికై నేనొక యుక్తి ఆలోచించితిని. పూర్వము శ్రీమహాదేవుడు త్రిపురాసురులను సంహరించిన అనంతరము, ఈ ధనువును మా తాతగారి యింట న్యాసముగా ఉంచెను. సీతను పరిణయమాడుటకు అందరి గర్వమును హరింపగల ఈ ధనువును పణముగా నిర్ణయించి, అట్లే గావించితిని. ఓ మునివర్యా! మీ దయవలన కమలనయనుడగు రాముడు ధనువును చూడవచ్చెను. నా మనోరథము నెరవేరినది".

(రామునితో అతడిట్లనెను) "రామా! నేడు నా జన్మ ధన్యమైనది. సూర్యునివలె ప్రకాశించుచు, సీతతో ఒకే ఆసనముపై కూర్చొనియున్న మిమ్ము దర్శించుచున్నాను. ప్రభూ! మీ పాదతీర్థమును శిరమున దాల్చియే బ్రహ్మ సృష్టి చక్రమును త్రిప్పుచున్నాడు (67-72). మీ పాదతీర్థము

బలిస్త్వత్పాదసలిలం ధృత్వాఽభూద్దివిజాధిపః,
త్వత్పాదపాంసుసంస్పర్శాదహల్యా భర్తృశాపతః. 73

సద్య ఏవ వినిర్ముక్తా కోఽన్యస్త్వత్తోఽధిరక్షితా. 74

యత్పాదపంకజపరాగసురాగయోగి-
వృందైర్జితం భవభయం జితకాలచక్రైః,
యన్నామకీర్తనపరా జితదుఃఖశోకా
దేవాస్తమేవ శరణం సతతం ప్రపద్యే. 75

ఇతి స్తుత్వా నృపః ప్రాదాద్రాఘవాయ మహాత్మనే,
దీనారాణాం కోటిశతం రథానామయుతం తదా. 76

అశ్వానాం నియుతం ప్రాదాద్గజానాం షట్శతం తథా,
పత్తీనాం లక్షమేకం తు దాసీనాం త్రిశతం దదౌ. 77

దివ్యాంబరాణి హారాంశ్చ ముక్తారత్నమయోజ్జ్వలాన్,
సీతాయై జనకః ప్రాదాత్ప్రీత్యా దుహితృవత్సలః. 78

వసిష్ఠాదీన్సుసంపూజ్య భరతం లక్ష్మణం తథా,
పూజయిత్వా యథాన్యాయం తథా దశరథం నృపమ్. 79

ప్రస్థాపయామాస నృపో రాజానం రఘుసత్తమమ్,
సీతామాలింగ్య రుదతీం మాతరః సాశ్రులోచనాః. 80

శ్వశ్రూశుశ్రూషణపరా నిత్యం రామమనువ్రతా,
పాతివ్రత్యముపాలంబ్య తిష్ఠ వత్సే యథాసుఖమ్. 81

ప్రయాణకాలే రఘునందనస్య
భేరీమృదంగానకతూర్యఘోషః,
స్వర్వాసిభేరీఘనతూర్యశబ్దైః
సంమూర్ఛితో భూతభయంకరోఽభూత్. 82

దాల్చిన బలిచక్రవర్తికి ఇంద్రపదవి ప్రాప్తించినది. మీ చరణ రజ స్పర్శచే నేడు అహల్య పతి శాపమునుండి విముక్తురాలైనది. మీకన్న మాకు రక్షకులు ఎవరు? (73-74). తమ చరణ కమల పరాగ మందనురాగము కలవారై, కాలచక్రమును జయించిన యోగిజనులు సంసారభీతిని జయించిరి. తమ నామ సంకీర్తనమునందు ప్రవర్తిల్లియే, దేవతలు దుఃఖ శోకములు జయించుచున్నారు. అట్టి మిమ్ము నేను నిరంతరము శరణు బొందుచున్నాను'' (75).

మహాత్ముడగు రాఘవుని యీ విధముగా స్తుతించి జనక మహారాజు అతనికి కానుకగా నూరుకోట్ల సువర్ణ ముద్రలను, పదివేల రథములను, పదిలక్షల గుఱ్ఱములను, ఆరు నూర్ల ఏనుగులను, ఒక లక్ష పదాతిదళమును, మున్నూరుగురు దాసీజనములను ఇచ్చెను (76-77).

పుత్రికా వాత్సల్యమున సీతకు తండ్రి జనకరాజేంద్రుడు ప్రేమతో అనేక దివ్య వస్త్రములు, ముత్యములు రత్నములు పొదిగిన ఉజ్జ్వలములైన హారములను ఇచ్చెను (78).

తదనంతరము అతడు వశిష్ఠాదులను పూజించెను. ఆ తరువాత భరత లక్ష్మణ శత్రుఘ్నులను, దశరథుని యథోచితముగా సత్కరించి ఆ రఘుకులశ్రేష్ఠుడగు దశరథుని వీడుకొలిపెను. అంతట సజలనేత్రులైన ఆ తల్లులు సీతను కౌగలించుకొని ఇట్లనిరి (79-80) - ''బిడ్డా! నీవు అత్తమామలను సేవించుచు, సదా రాముని అనుగమించు చుండుము. పతివ్రతాధర్మము నవలంబించి సుఖముగా నుండుము'' (81).

ఆ తరువాత రఘునందనుడు తిరిగి ప్రయాణించు సందర్భమున ఇట భేరీ మృదంగములు, ఆనకములు, తూర్యములు మొదలగు వాద్యముల ధ్వనులు, అట ఆకాశమునందు దేవతలు మ్రోగించు భేరీ ఘన తూర్య ధ్వనులు మిళితములై ప్రాణిలోకమునకు భయము కలిగించెను (82).

ఇది శ్రీమదధ్యాత్మరామాయణాంతర్గత ఉమామహేశ్వరసంవాదములో
బాలకాండ - షష్ఠ సర్గము ॥ 6 ॥

----****----

ఓమ్

# సప్తమ సర్గము

## పరశురామ సమాగమము

శ్రీమహాదేవ ఉవాచ

అథ గచ్ఛతి శ్రీరామే మైథిలాద్యోజనత్రయమ్,
నిమిత్తాన్యతిఘోరాణి దదర్శ నృపసత్తమః. 1

నత్వా వసిష్ఠం పప్రచ్ఛ కిమిదం మునిపుంగవ,
నిమిత్తానీహ దృశ్యంతే విషమాణి సమంతతః. 2

వసిష్ఠస్తమథ ప్రాహ భయమాగామి సూచ్యతే,
పునరప్యభయం తేఽద్య శీఘ్రమేవ భవిష్యతి. 3

మృగాః ప్రదక్షిణం యాంతి పశ్య త్వాం శుభసూచకాః,
ఇత్యేవం వదతస్తస్య వవౌ ఘోరతరోఽనిలః. 4

ముష్ణంశ్చక్షూంషి సర్వేషాం పాంసువృష్టిభిరర్దయన్,
తతో వ్రజన్దదర్శాగ్రే తేజోరాశిముపస్థితమ్. 5

కోటిసూర్యప్రతీకాశం విద్యుత్పుంజసమప్రభమ్,
తేజోరాశిం దదర్శాథ జామదగ్న్యం ప్రతాపవాన్. 6

నీలమేఘనిభం ప్రాంశుం జటామండలమండితమ్,
ధనుః పరశుపాణిం చ సాక్షాత్కాలమివాంతకమ్. 7

కార్తవీర్యాంతకం రామం దృప్తక్షత్రియమర్దనమ్,
ప్రాప్తం దశరథస్యాగ్రే కాలమృత్యుమివాపరమ్. 8

తం దృష్ట్వా భయసంత్రస్తో రాజా దశరథస్తదా,
అర్ఘ్యాదిపూజాం విస్మృత్య త్రాహి త్రాహీతి చాబ్రవీత్. 9

దండవత్ప్రణిపత్యాహ పుత్రప్రాణం ప్రయచ్ఛ మే,
ఇతి బ్రువంతం రాజానమనాదృత్య రఘూత్తమమ్. 10

శ్రీమహాదేవుడు ఇట్లనెను – ''శ్రీరామచంద్రుడు మిథిలాపురమునుండి మూడు యోజనముల దూరము వెడలిన పిమ్మట నృపశ్రేష్ఠుడైన దశరథునకు మిక్కిలి ఘోరమైన అపశకునములు కానవచ్చెను (1). అంత నాతడు వశిష్ఠునకు ప్రణామము చేసి ''మునిపుంగవా! నాల్గువంకల భయంకరమగు అపశకునములు కానవచ్చు చున్నవి. కారణమేమి?'' అని అడిగెను (2).

వశిష్ఠుడిట్లనెను – ''ఈ అపశకునములచేత రానున్న భయము సూచింపబడుచున్నది. కాని శీఘ్రముగనే భయము తొలగిపోవుననికూడ తెలియుచున్నది. ఏలయనగా మీ కుడి వైపు శుభసూచకముగా జింకలు పోవుచున్నవి. ఇట్లు వశిష్ఠుడు తెలుపుచున్నంతనే ప్రచండవాయువు అందరిని బాధించుచు వీవసాగినది. దాని వెంట ధూళి వృష్టి ఎగయగా అందరి కనులు మూతబడినవి. ధూళి తీవ్రత తగ్గిన తరువాత తమముందు ఒక తేజఃపుంజము వచ్చుచు గోచరించెను (3–5).

కోటి సూర్యులతో సమానమగు తేజస్సు గలవాడు విద్యుత్పుంజము వలె కాంతి గల ప్రతాపవంతుడు, తేజోరాశి నీలమేఘమువలె ప్రకాశించువాడు, ఉన్నత శరీరము కలవాడు, జటాజూటధారి, చేత ధనువు, పరశువు ధరించి ప్రాణులను నాశమొనరించు కాలునివలె నున్నవాడు, కార్తవీర్యార్జున సంహారి, గర్వాంధులగు క్షత్రియుల సంహరించినవాడు, జమదగ్ని కుమారుడైన పరశురాముని అపరయమునివలె దశరథునిముందు నిలిచినవానిని అందరును చూచిరి (6–8).

దశరథమహారాజు అతనిని చూడగనే భయకంపితుడై అర్ఘ్యాదులతో అతనిని పూజించుట మరచి 'త్రాహి' 'త్రాహి' యని మొఱపెట్టసాగెను (9). పరశురామునికి సాష్టాంగదండప్రణామము లాచరించి 'నా పుత్రుని ప్రాణమును రక్షించుడు' అని ప్రార్థించెను. ఈ విధముగా ప్రార్థించుచున్న రఘూత్తముడైన రాజును అవంతయు లెక్కచేయక (10), క్రోధావేశముతో వణకుచు, కఠినమగు

ఉవాచ నిష్ఠురం వాక్యం క్రోధాత్ప్రచలితేంద్రియః,
త్వం రామ ఇతి నామ్నా మే చరసి క్షత్రియాధమ. 11

ద్వంద్వయుద్ధం ప్రయచ్ఛాశు యది
త్వం క్షత్రియోఽసి వై
పురాణం జర్జరం చాపం భంక్త్వా
త్వం కత్థసే ముధా. 12

అస్మింస్తు వైష్ణవే చాప ఆరోపయసి చేద్గుణమ్,
తదా యుద్ధం త్వయా సార్ధం కరోమి రఘువంశజ. 13

నో చేత్సర్వాన్హనిష్యామి క్షత్రియాంతకరో హ్యహమ్,
ఇతి బ్రువతి వై తస్మింశ్చచాల వసుధా భృశమ్. 14

అంధకారో బభూవాథ సర్వేషామపి చక్షుషామ్,
రామో దాశరథిర్వీరో వీక్ష్య తం భార్గవం రుషా. 15

ధనురాచ్ఛిద్య తద్ధస్తాదారోప్య గుణమంజసా,
తూణీరాద్బాణమాదాయ సంధాయాకృష్య వీర్యవాన్.
16

ఉవాచ భార్గవం రామం శృణు బ్రహ్మన్వచో మమ,
లక్ష్యం దర్శయ బాణస్య హ్యమోఘో మమ సాయకః. 17

లోకాన్పాదయుగం వాపి వద శీఘ్రం మమాజ్ఞయా,
అయం లోకః పరో వాథ త్వయా గంతుం న శక్యతే. 18

ఏవం త్వం హి ప్రకర్తవ్యం వద శీఘ్రం మమాజ్ఞయా,
ఏవం వదతి శ్రీరామే భార్గవో వికృతాననః. 19

సంస్మరన్పూర్వవృత్తాంతమిదం వచనమబ్రవీత్,
రామ రామ మహాబాహో జానే త్వాం పరమేశ్వరమ్. 20

పురాణపురుషం విష్ణుం జగత్సర్గలయోద్భవమ్,
బాల్యేఽహం తపసా విష్ణుమారాధయితుమంజసా. 21

చక్రతీర్థం శుభం గత్వా తపసా విష్ణుమన్వహమ్,
అతోషయం మహాత్మానం నారాయణమనన్యధీః. 22

తతః ప్రసన్నో దేవేశః శంఖచక్రగదాధరః,
ఉవాచ మాం రఘుశ్రేష్ఠ ప్రసన్నముఖపంకజః. 23

వాక్యములతో శ్రీరాముని ఉద్దేశించి యిట్లనెను - ''క్షత్రియాధమా! నీవు రాముడవని నా పేరు పెట్టుకొని చరించుచున్నావు. నిజముగ నీవు క్షత్రియుడవైతివేని నాతో ద్వంద్వయుద్ధము చేయుము. ఒక పాత, చీకు వింటిని విఱిచి, వ్యర్థముగా నిన్ను నీవే పొగడుకొనుచున్నావు. రఘు వంశీయుడా! ఏదీ! నీవీ వైష్ణవధనువునకు నారి సంధింప గలిగినచో నేను నీతో యుద్ధము చేయుదును (13). లేకున్న నేనిప్పుడే అందరను చంపివైచెదను. నేను క్షత్రియాంతకు డను''. ఇట్లు పరశురాముడు పలుకుచుండగ భూమి గడగడ వణకెను (14). అందరి కనులకు చీకట్లు క్రమ్మి, కింకర్తవ్యతా విమూఢులైరి. అంత దశరథనందనుడు, వీరవరుడు అగు రాముడు పరశురామునివైపు రోషపూర్వక ముగా చూచుచు, అతని చేతినుండి ధనువును లాగికొని అనాయాసముగా దానికి నారి జోడించి, తూణీరమునుండి బాణమును తీసి సంధించి లాగి భృగునందనుడైన పరశురామునితో ఇట్లనెను - ''బ్రాహ్మణుడా![1] నా మాట వినుము. నా బాణము అమోఘమైనది. దీనికి వెంటనే లక్ష్యము చూపుము (15-17). తపస్సు ఫలముగా ఆర్జించిన పుణ్యలోకగతుల నిరోధించవలెనా? నీ పాదయుగము గతి నిరోధించి ఈ భూమియందు నీ సంచారమును అశక్యము చేయవలెనా? ఏదియో ఒకటి శీఘ్రముగా తెలుపుము. ఇది నా ఆజ్ఞ! ఇంక ఇప్పుడు నేనేమి చేయవలెను?'' ఇట్లు శ్రీరాముడు పలుకుచుండగా భార్గవరాముని ముఖము నిస్తేజ మాయెను (18-19). అతడు పూర్వవృత్తాంతమును స్మరించుకొని ఇట్లు పలికెను - ''రామా! మహాబాహూ! నిన్ను పురాణపురుషునిగా జగత్తునకు సృష్టి, స్థితి లయములకు మూలకారణముగా పరమేశ్వరుడవైన విష్ణునిగా తెలిసికొంటిని. బాల్యమున నేను తపస్సు ద్వారా విష్ణువును ఆరాధించుటకు యాదృచ్ఛికముగా పవిత్రమగు చక్రతీర్థమునను చేరి (గండకీనది), ప్రతిదినమును ఏకాగ్రచిత్తముతో తపస్సు చేసి నారాయణుని ప్రసన్నునిగా చేసికొంటిని (22-23). రఘుపుంగవా! అపుడు శంఖచక్ర గదాధారి, దేవదేవుడగు విష్ణువు ప్రసన్న వదనుడై ఇట్లనెను (23).

శ్రీభగవానువాచ

ఉత్తిష్ఠ తపసో బ్రహ్మన్ ఫలితం తే తపో మహత్,
మచ్చిదంశేన యుక్తస్త్వం జహి హైహయపుంగవమ్. 24

కార్తవీర్యం పితృహణం యదర్థం తపసః శ్రమః,
తతస్త్రిఃసప్తకృత్వస్త్వం హత్వా క్షత్రియమండలమ్. 25

కృత్స్నాం భూమిం కశ్యపాయ దత్త్వా శాంతిముపావహ,
త్రేతాముఖే దాశరథిర్భూత్వా రామోఽహమవ్యయః.26

ఉత్పత్స్యే పరయా శక్త్యా తదా ద్రక్ష్యసి మాం తతః,
మత్తేజః పునరాదాస్యే త్వయి దత్తం మయా పురా. 27

తదా తపశ్చరన్‌లోకే తిష్ఠ త్వం బ్రహ్మణో దినమ్,
ఇత్యుక్త్వాంతర్దధే దేవస్తథా సర్వం కృతం మయా. 28

స ఏవ విష్ణుస్త్వం రామ జాతోఽసి బ్రహ్మణార్థితః,
మయి స్థితం తు త్వత్తేజస్త్వయైవ పునరాహృతమ్. 29

అద్య మే సఫలం జన్మ ప్రతీతోఽసి మమ ప్రభో,
బ్రహ్మాదిభిరలభ్యస్త్వం ప్రకృతేః పారగో మతః. 30

త్వయి జన్మాదిషడ్భావా న సంత్యజ్ఞానసంభవాః,
నిర్వికారోఽసి పూర్ణస్త్వం గమనాదివివర్జితః. 31

యథా జలే ఫేనజాలం ధూమో వహ్నౌ తథా త్వయి,
త్వదాధారా త్వద్విషయా మాయా కార్యం సృజత్యహో
32

యావన్మాయావృతా లోకాస్తావత్త్వాం న విజానతే,
అవిచారిత సిద్ధైషావిద్యా విద్యావిరోధినీ. 33

అవిద్యాకృతదేహాదిసంఘాతే ప్రతిబింబితా.
చిచ్ఛక్తిర్జీవలోకేఽస్మిన్ జీవ ఇత్యభిధీయతే. 34

(భగవానుడు చెప్పుచున్నాడు) ''బ్రాహ్మణోత్తమా! తపము చాలించి లెమ్ము. గొప్పదియగు నీ తపస్సు ఫలించినది. నీవిపుడు నా చిదంశశక్తి సంపన్నుడవైతివి. ఈ కష్టతరమగు తపమునకు ఫలముగా నీవు సాధింపనెంచినకార్యమును, అనగా నీ తండ్రిని వధించిన హైహయవీరుడగు కార్తవీర్యార్జునుని వధింపుము. అటుమీదట ఇరువదియొక్కమారులు సమస్త క్షత్రియులను సంహరించి, సమస్త భూమండలము కశ్యపునకు దానమిచ్చి, శాంతిని పొందుము. అవ్యయుడనగు నేను త్రేతాయుగమున నా పరమశక్తి (సీత)తో దశరథుని పుత్రుడనై అవతరించెదను. అపుడు నన్ను నీవు చూడగలవు. నీకిచ్చిన యీ తేజమును తిరిగి అపుడు గైకొందును (24-27). పిదప నీవు తపముచేయుచు కల్పాంతమువరకు ఈ లోకములో నుండుము''.

ఇట్లు పలికి విష్ణుభగవానుడు అంతర్ధానమాయెను. నేను అతడు తెలిపిన విధముగనే ఆచరించితిని (28).

''రామా! నీవే మహావిష్ణువు! బ్రహ్మదేవుని ప్రార్థనముచే ఈ పుడమియందు అవతరించితివి. నాలో నున్న తేజము నీదే! దానిని మరల నీవే గ్రహించితివి (29). ప్రభూ! నా జన్మ సఫలమైనది. నేను నిన్ను గుర్తించితిని. నీవు బ్రహ్మాదుల కన్నను అందరానివాడవు. ప్రకృతి కన్నను పరముడవు (30). నీ యందు అజ్ఞానజనితములగు షడ్వికారములు లేవు. నిర్వికారుడవు, పూర్ణుడవు, సర్వవ్యాపి యగుటచే గమనాదులు లేవు (31).

జలమునందు నురగవలె, అగ్నియందు ధూమమువలె మాయ నిన్ను ఆశ్రయించి నిన్నే విషయముగా గ్రహించి నానావిధములుగా విచిత్ర కార్యములు రచించుచుండును (32). [1] మానవుడు మాయచే ఆవృతుడైనంతవరకు నిన్నెరుగలేడు. జ్ఞానము కలుగనంతవరకు వాడు విద్యా (జ్ఞాన) విరోధియగు ఈ అవిద్యను విచారణ చేయునంతవరకు మాత్రమే నిలచి యుండును (33). అవిద్యాజన్య దేహాది సంఘాతములందు ప్రతిబింబితములైన చిచ్ఛక్తియే ఈ జీవలోకమున 'జీవుడని' పిలువబడుచున్నది (34).

[1] (పరశురాముని చేతిలోనుండి వైష్ణవధనువు శ్రీరాముని చేతిలోనికి రాగానే, అతని విష్ణుతేజము రఘురాముని చేరినది. పరశురాముడిక విష్ణ్వంశకు దూరమై, బ్రాహ్మణత్వము మాత్రమే కలిగినవాడయ్యెను)

యావద్దేహమనః ప్రాణబుద్ధ్యాదిష్వభిమానవాన్,
తావత్కర్తృత్వభోక్తృత్వసుఖదుఃఖాదిభాగ్భవేత్. 35

ఆత్మనః సంసృతిర్నాస్తి బుద్ధేర్జ్ఞానం న జాత్వితి,
అవివేకాద్ద్వయం యుంక్త్వా సంసారీతి ప్రవర్తతే. 36

జడస్య చిత్సమాయోగాచ్చిత్త్వం భూయాచ్చితేస్తథా,
జడసంగాజ్జడత్వం హి జలాగ్న్యోర్మేలనం యథా. 37

యావత్త్వత్పాదభక్తానాం సంగసౌఖ్యం న విందతి,
తావత్సంసారదుఃఖౌఘాన్న నివర్తేన్నరః సదా. 38

తత్సంగలబ్ధయా భక్త్యా యదా త్వాం సముపాసతే,
తదా మాయా శనైర్యాతి తానవం ప్రతిపద్యతే. 39

తతస్త్వజ్జ్ఞానసంపన్నః సద్గురుస్తేన లభ్యతే,
వాక్యజ్ఞానం గురోర్లబ్ధ్వా త్వత్ప్రసాదాద్విముచ్యతే. 40

తస్మాత్త్వద్భక్తిహీనానాం కల్పకోటిశతైరపి,
న ముక్తిశంకా విజ్ఞాన శంకా నైవ సుఖం తథా. 41

అతస్త్వత్పాదయుగలే భక్తిర్మే జన్మజన్మని,
స్యాత్త్వద్భక్తిమతాం సంగోఽవిద్యా యాభ్యాం వినశ్యతి. 42

లోకే త్వద్భక్తినిరతాస్త్వద్ధర్మామృతవర్షిణః,
పునంతి లోకమఖిలం కిం పునః స్వకులోద్భవాన్. 43

నమోఽస్తు జగతాం నాథ నమస్తే భక్తిభావన,
నమః కారుణికానంత రామచంద్ర నమోఽస్తు తే. 44

ఈ జీవుడు ఎంతవరకు దేహము, మనస్సు, ప్రాణము, బుద్ధి మున్నగు వానియందు అభిమానము కలిగియుండునో అంతవరకు కర్తృత్వ, భోక్తృత్వములను, సుఖదుఃఖాదులను అనుభవించుచుండును (35). వాస్తవమున ఆత్మయందు జనన మరణాది వికారములు ఏ పరిస్థితి యందును లేవు. బుద్ధి ప్రకృతి కార్యము కావున అందు జ్ఞానము లేదు. అవివేక వశమున ఈ రెంటిని కలిపి జీవుడు నేను 'కర్తను' 'భోక్తను' అని తలచి కర్మయందు ప్రవృత్తుడగుచున్నాడు (36). అగ్నిజలముల సంపర్కము ఎట్లు జలమునకు ఉష్ణము, అగ్నికి శాంతత్వము కలిగించుచున్నదో అట్లే జడమునకు (బుద్ధికి) చేతనముతోడ (ఆత్మ) సంయోగము కలిగినపుడు అందు చేతనత్వము, చేతనమగు ఆత్మకు జడమగు బుద్ధితో సంయోగము కలిగినపుడు అందు (కర్తృత్వభోక్తృత్వాది) జడత్వము ప్రకటితమగును (37).

''రామా! మానవుడు మీ పదపంకజ భక్తుల సాంగత్య సుఖము నిరంతరము అనుభవింపనంతవరకు, యీ సంసారసంబంధమగు దుఃఖసమూహమును దాటలేడు (38). భక్తజనుల సాంగత్యము ప్రాప్తించిన భక్తిద్వారా మిమ్ము ఉపాసించునపుడు మాయ మెలమెల్లగా తొలగిపోవును (39). తదుపరి ఆ సాధకునకు మీ జ్ఞానసంపన్నుడైన సద్గురుడు లభించును. ఆ సద్గురుని వలన ''తత్త్వమసి'' ఆది మహావాక్య ప్రబోధమంది మీ దయచేత ముక్తిని పొందుచున్నాడు (40). కావున నీయందు భక్తిలేని పురుషులకు నూరుకోట్ల కల్పము లైనను ముక్తిగాని బ్రహ్మజ్ఞానము గాని కలుగనేరదు. అందుచేత వారికి వాస్తవిక సుఖము లభించదు (41). ఆ కారణమున నేను కోరుకొనునది ఏమనగా, జన్మజన్మాంతరముల యందును మీ చరణయుగమునందు నాకు భక్తి కలుగుగాక! నాకు మీ భక్తులతోడి సాంగత్యము ప్రాప్తించుగాక! ఏలయన ఈ రెండు సాధనముల వలన అవిద్య నశించును. లోకములో మీ భక్తి నిరతులై మీ లీలల గానామృతము వర్షించు భక్తులు సమస్త లోకములను పవిత్రము చేయుదురని చెప్పుచుండగా తమ వంశములోని వారిని ఉద్ధరింతురని చెప్పవలెనా? (42-43). జగన్నాథా! నీకు నమస్కారము. భక్తభావనా! నమస్కారము. కరుణామయా! అనంతా! నమస్కారము! రామచంద్రా! మాటిమాటికిని నేను నీకు నమస్కరించుచున్నాను (44). దేవా! నేను పుణ్యలోక ప్రాప్తి నాశించి చేసిన

దేవ యద్యత్కృతం పుణ్యం మయా లోకజిగీషయా,
తత్సర్వం తవ బాణాయ భూయాద్రామ నమోఽస్తుతే. 45

తతః ప్రసన్నో భగవాన్ శ్రీరామః కరుణామయః,
ప్రసన్నోఽస్మి తవ బ్రహ్మన్యత్తే మనసి వర్తతే. 46

దాస్యే తదఖిలం కామం మా కురుష్వాత్ర సంశయమ్,
తతః ప్రీతేన మనసా భార్గవో రామమబ్రవీత్. 47

యది మేఽనుగ్రహో రామ తవాస్తి మధుసూదన,
త్వద్భక్తసంగస్త్వత్పాదే దృఢా భక్తిః సదాస్తు మే. 48

స్తోత్రమేతత్పఠేద్యస్తు భక్తిహీనోఽపి సర్వదా,
త్వద్భక్తిస్తస్య విజ్ఞానం భూయాదంతే స్మృతిస్తవ. 49

తథేతి రాఘవేణోక్తః పరిక్రమ్య ప్రణమ్య తమ్,
పూజితస్తదనుజ్ఞాతో మహేంద్రాచలమన్వగాత్. 50

రాజా దశరథో హృష్టో రామం మృతమివాగతమ్,
ఆలింగ్యాలింగ్య హర్షేణ నేత్రాభ్యాం జలముత్సృజత్. 51

తతః ప్రీతేన మనసా స్వస్థచిత్తః పురం యయౌ,
రామలక్ష్మణశత్రుఘ్నభరతా దేవసమ్మితాః,
స్వాం స్వాం భార్యాముపాదాయ రేమిరే స్వస్వమందిరే. 52

మాతాపితృభ్యాం సంహృష్టో రామః సీతాసమన్వితః,
రేమే వైకుంఠభవనే శ్రియా సహ యథా హరిః. 53

యుధాజిన్నామ కైకేయీ భ్రాతా భరతమాతులః,
భరతం నేతుమాగచ్ఛత్స్వరాజ్యం ప్రీతిసంయుతః. 54

ప్రేషయామాస భరతం రాజా స్నేహసమన్వితః,
శత్రుఘ్నం చాపి సంపూజ్య యుధాజితమరిందమః. 55

పుణ్యమంతయు నీ బాణమునకు లక్ష్యమగుగాక! రామా! నీకు నమస్కారము (45)''– అని పరశురాముడు విరమించెను.

అంత కరుణామయుడైన రాముడు ప్రసన్నుడై ఇట్లనెను – ''బ్రాహ్మణోత్తమా! నేను ప్రసన్నుడనైతిని. నీ హృదయమున ఏ కోర్కెలు గలవో వానినన్నిటిని ప్రసాదించెదను. సందేహము నొందకుము''. ఇది విని ప్రసన్నచిత్తుడై పరశురాముడిట్లనెను (46-47) – ''మధుసూదనా! రామా! నా యందు నీకు దయ కలిగినచో నాకు సదా మీ భక్తులతోడి సాంగత్యము, మీ చరణకమలముల యందు నాకు దృఢమైన భక్తి ఉండుగాక! (48)

ఎవరైన భక్తిరహితముగానైనను ఈ స్తోత్రమును పఠించిన, విన్న, నిత్యపారాయణ ప్రభావముచే నీయందు భక్తి కలుగును. దాని ప్రభావమున నిర్గుణ సాకార తత్త్వ స్వరూప జ్ఞానము, తద్ద్వారా దాని ప్రభావము అంత్యకాల స్మృతి లభించును (49).

అనంతరము రాఘవుడు 'తథాస్తు' అని పలుకగా పరశురాముడు అతనికి ప్రదక్షిణము చేసి నమస్కరించెను. అతని చేత పూజితుడై, అజ్ఞగైకొని మహేంద్రగిరికి వెడలి పోయెను (50). దశరథమహారాజు రాముని మృత్యుముఖము నుండి బయల్పడినవానిగా భావించి, చాలా సంతోషముతో పలుమారులు కౌగలించుకొనెను. అతని నేత్రములు ఆనందాశ్రువులు వర్షించెను (51).

తదనంతరము వారెల్లరు సంతోషముతో అయోధ్యా పురము చేరిరి. అచ్చట రామలక్ష్మణ భరత శత్రుఘ్నులు తమ తమ పత్నులతో దేవసదృశులై తమతమ మందిరములలో ఆనందముగా ఉండసాగిరి (52).

సీతాసమేతుడై శ్రీరాముడు తల్లిదండ్రులతో సహా, వైకుంఠమున విష్ణుభగవానుడు లక్ష్మితో కూడియున్న రీతి ఆనందముగా నుండెను (53). ఆ సమయముననే కైకేయీ సోదరుడు, భరతుని మేనమామ యుధాజిత్తు భరతుని ప్రీతితో తమ గృహమునకు తీసికొనిపోవుటకు వచ్చెను (54). శత్రుదమనుడగు దశరథమహారాజు యుధాజిత్తును సత్కరించి ప్రేమపూర్వకముగా భరత శత్రుఘ్నులను అతని వెంట పంపెను (55).

కౌసల్యా శుశుభే దేవీ రామేణ సహ సీతయా,
దేవమాతేవ పౌలోమ్యా శచ్యా శక్రేణ శోభనా. 56

సీతారాములతో గూడి కౌసల్యాదేవి శచీపురందరులతో గూడిన అదితివలె శోభిల్లెను (56).

సాకేతే లోకనాథప్రథితగుణగణో
లోకసంగీతకీర్తిః
శ్రీరామః సీతయాస్తేఽఖిలజననికరా-
నందసందోహమూర్తిః,
నిత్యశ్రీర్నిర్వికారో నిరవధివిభవో
నిత్యమాయానిరాసో
మాయాకార్యానుసారీ మనుజ ఇవ సదా
భాతి దేవోఽఖిలేశః. 57

బ్రహ్మాది సకలలోక నాయకులందు ప్రసిద్ధి గైకొన్న గుణ గణములు గైకొన్నవాడు, సమస్త లోకములలో గానము చేయబడు కీర్తి కలవాడు, సకల మానవకోటికి మూర్తీభవించిన ఆనందరాశి రాముడు, సీతతో అయోధ్యయందు విరాజితుడై యుండెను. నిత్యశ్రీసమన్వితుడు, సర్వదా మాయాతీతుడు, అఖిలేశ్వరుడు, భగవానుడు సదా మాయాకార్యములు అనుసరించుచు, మనుజునివలె ప్రతీతుడయ్యెను (57).

ఇది శ్రీమదధ్యాత్మరామాయణాంతర్గత ఉమామహేశ్వరసంవాదములో బాలకాండ - సప్తమ సర్గము ॥ 7 ॥

----****----

సమాప్తమిదం బాలకాండమ్

----****----

॥ శ్రీహరిః ॥

ఓం శ్రీపరమాత్మనే నమః

# అధ్యాత్మ రామాయణము

## అయోధ్యాకాండము

## ప్రథమ సర్గము

### శ్రీరామచంద్ర భగవానుని కడకు నారదుడు వచ్చుట

శ్రీమహాదేవ ఉవాచ

ఏకదా సుఖమాసీనం రామం స్వాంతఃపురాజిరే,
సర్వాభరణసంపన్నం రత్నసింహాసనే స్థితమ్. 1

నీలోత్పలదలశ్యామం కౌస్తుభాముక్తకంధరమ్,
సీతయా రత్నదండేన చామరేణాథ వీజితమ్. 2

వినోదయన్తం తాంబూలచర్వణాదిభిరాదరాత్,
నారదోఽవతరద్ద్రష్టుమమ్బరాద్యత్ర రాఘవః. 3

శుద్ధస్ఫటికసంకాశః శరచ్చంద్ర ఇవామలః,
అతర్కితముపాయాతో నారదో దివ్యదర్శనః. 4

తం దృష్ట్వా సహసోత్థాయ రామః ప్రీత్యా కృతాంజలిః,
ననామ శిరసా భూమౌ సీతయా సహ భక్తిమాన్. 5

ఉవాచ నారదం రామః ప్రీత్యా పరమయా యుతః,
సంసారిణాం మునిశ్రేష్ఠ దుర్లభం తవ దర్శనమ్.
అస్మాకం విషయాసక్తచేతసాం నితరాం మునే. 6

అవాప్తం మే పూర్వజన్మకృతపుణ్యమహోదయైః,
సంసారిణాపి హి మునే లభ్యతే సత్సమాగమః. 7

అతస్త్వద్దర్శనాదేవ కృతార్థోఽస్మి మునీశ్వర,
కింకార్యం తే మయా కార్యం బ్రూహి తత్కరవాణి భోః. 8

శ్రీమహాదేవుడిట్లనెను – ''పార్వతీ! ఒకనాడు సర్వాలంకార విభూషితుడై శ్రీరామచంద్రుడు తన అంతఃపురాంగణమున నొక రత్నసింహాసనముపై సుఖముగ కూర్చుండి యుండెను (1). ఆ సమయమున నీలోత్పల దళశ్యాముడై, కౌస్తుభమణి మండితుడైన శ్రీరామ చంద్రునకు సీతాదేవి రత్నదండయుతమైన చామరముతో వీచుచుండెను (2). అతడాదర పూర్వకముగా తాంబూల చర్వణాదులతో సీతను ఆనందింపచేయుచుండెను. ఆ సమయమున అతనిని దర్శించుటకు దేవర్షి ఆకసము నుండి అవతరించెను (3).

శుద్ధస్ఫటికమణివలె, శరచ్చంద్రునివలె నిర్మలమైన వాడు, దివ్యమూర్తియు దివ్యదృష్టి గల నారదమహర్షి ఆకస్మికముగా వచ్చుట చూచి; శ్రీరాముడు తటాలున లేచి నిలబడి, సీతాసమేతుడై భక్తిపూర్వకముగా చేతులు జోడించి సాష్టాంగ ప్రణామమాచరించెను (4–5).

శ్రీరాముడు పరమప్రీతిపూర్వకముగా నారదునితో ఇట్లనెను – ''ఓ మునిశ్రేష్ఠా! మావంటి విషయాసక్తులైన సంసారులైన మానవులకు మీ దర్శనము చాలా దుర్లభము. నేడు మా పూర్వజన్మ పుణ్యఫలితముగా మీ దర్శనము లభించినది. ఏలయన పుణ్యోదయము చేతనే సాంసారిక జనులకు సత్సాంగత్యము లభించును (6–7).

''ఓ మునీశ్వరా! నేడు మీ దర్శనముచే కృతార్థుడనైతిని. ఇపుడు మీకై నేనేమి కార్యము చేయవలెనో ఆజ్ఞాపించుడు. దానిని ఇప్పుడే పాలించగలవాడను'' (8).

అథ తం నారదోఽపాహ రాఘవం భక్తవత్సలమ్.
కిం మోహయసి మాం రామ వాక్యైర్లోకానుసారిభిః. 9

సంసారీత్యహమితి ప్రోక్తం సత్యమేతత్త్వయా విభో.
జగతామాదిభూతా యా సా మాయా గృహిణీ తవ. 10

త్వత్సన్నికర్షాజ్జాయన్తే తస్యాం బ్రహ్మాదయః ప్రజాః.
త్వదాశ్రయా సదా భాతి మాయా యా త్రిగుణాత్మికా. 11

సూతేఽజస్రం శుక్లకృష్ణలోహితాః సర్వదా ప్రజాః.
లోకత్రయమహాగేహే గృహస్థస్త్వముదాహృతః. 12

త్వం విష్ణుర్జానకీ లక్ష్మీః శివస్త్వం జానకీ శివా.
బ్రహ్మా త్వం జానకీ వాణీ సూర్యస్త్వం జానకీ ప్రభా. 13

భవాన్ శశాంకః సీతా తు రోహిణీ శుభలక్షణా.
శక్రస్త్వమేవ పౌలోమీ సీతా స్వాహాఽనలో భవాన్.14

యమస్త్వం కాలరూపశ్చ సీతా సంయమినీ ప్రభో.
నిర్ఋతిస్త్వం జగన్నాథ తామసీ జానకీ శుభా. 15

రామ త్వమేవ వరుణో భార్గవీ జానకీ శుభా.
వాయుస్త్వం రామ సీతా తు సదాగతిరితీరితా. 16

కుబేరస్త్వం రామ సీతా సర్వసంపత్ప్రకీర్తితా.
రుద్రాణీ జానకీ ప్రోక్తా రుద్రస్త్వం లోకనాశకృత్. 17

లోకే స్త్రీవాచకం యావత్తత్సర్వం జానకీ శుభా.
పున్నామవాచకం యావత్తత్సర్వం త్వం హి రాఘవ. 18

తస్మాల్లోకత్రయే దేవ యువాభ్యాం నాస్తి కించన. 19

త్వదాభాసోదితాజ్ఞానమవ్యాకృతమితీర్యతే,
తస్మాన్మహాంస్తతః సూత్రం లింగం సర్వాత్మకం తతః. 20

అహంకారశ్చ బుద్ధిశ్చ పంచప్రాణేంద్రియాణి చ.
లింగమిత్యుచ్యతే ప్రాజ్ఞైర్జన్మమృత్యుసుఖాదిమత్. 21

అంతట నారదుడు భక్తవత్సలుడైన శ్రీరామునితో ''రామా! నీవు సామాన్యునివలె పలికి, నన్నేల మోహింప చేయ చూచుచున్నావు? (9) ప్రభూ! నేను సంసారిని అని చెప్పుకొంటివి. యుక్తమే! ఏలయన సమస్త లోకమునకు ఆదికారణమైన మాయ మీ గృహిణి కదా! (10) ప్రభూ! మీ సన్నిధి మాత్రముననే మాయనుండి బ్రహ్మ మొదలుగా గల ప్రజలందరు ఉత్పన్నమగుచున్నారు. సత్త్వ రజ స్తమోమయమైన ఆ మాయ మిమ్ము ఆశ్రయించియే సదా భాసించు చున్నది. మరియు స్వగుణానురూపముగా శుక్లలోహిత కృష్ణ (దేవ మనుష్య తిర్యక్) ఆది ప్రాణులను ఉత్పత్తి చేయుచున్నది. త్రిలోకరూప మహాగృహమున మాయా రూపిణి యను గృహిణితో మీరే గృహస్థులుగా నున్నారు (11-12). నీవే విష్ణు భగవానుడవు. జానకి లక్ష్మీదేవి. నీవు శివుడవు, ఆమె పార్వతి. నీవే బ్రహ్మవు, జానకియే సరస్వతి. నీవు సూర్యుడవు. జానకి ప్రభ. నీవు చంద్రుడవు, శుభలక్షణ లక్షిత సీత రోహిణి. నీవు ఇంద్రుడవు, జానకి ఇంద్రాణి. నీవు అగ్నివి, సీతయే స్వాహాదేవి (13-14). ప్రభూ! నీవు కాలరూపుడవైన యముడవు. సీతాదేవియే సంయమిని. జగన్నాథా! నీవు నిర్ఋతి. మంగళస్వరూపిణి యగు జానకి తామసి (15). రామా! నీవు వరుణుడవు. శుభలక్షణ సీత భార్గవి. నీవు వాయుదేవుడవు, సీతయే సదాగతి (16). రామా! నీవు కుబేరుడవు. సీతయే సకల సంపత్తి. నీవు లోకసంహారకుడవగు రుద్రుడవు. సీత రుద్రాణి (17).

రాఘవా! నిస్సందేహముగా లోకములో నున్న పురుషవాచక అంకితములన్నియు నీవే! స్త్రీ వాచక లక్షితములు జానకీదేవియే! అందువలననే, దేవా! మీ ఇరువుర కన్న భిన్నమైనది మూడు లోకములలోను లేదు (18-19). మీ ఆభాసము వలననే ఆవిర్భూతమైన అజ్ఞానము అవ్యాకృత మనబడుచున్నది. దానినుండి మహత్తత్త్వము, మహత్తత్త్వము నుండి సూత్రాత్మ (హిరణ్యగర్భుడు), సూత్రాత్మ నుండి సర్వాత్మక లింగ దేహము ఉత్పన్నమగుచున్నది (20). అహంకారము, బుద్ధి, పంచప్రాణములు, దశేంద్రియములు అనువాని కూటమినే ప్రాజ్ఞులు జన్మమృత్యు సుఖ దుఃఖాది ధర్మములు గల లింగదేహమని చెప్పెదరు (21) లింగ

స ఏవ జీవసంజ్ఞశ్చ లోకే భాతి జగన్మయః,
అవాచ్యానాద్యవిద్యైవ కారణోపాధిరుచ్యతే. 22

స్థూలం సూక్ష్మం కారణాఖ్య
ముపాధిత్రితయం చితేః,
ఏతైర్విశిష్టో జీవః
స్యాద్వియుక్తః పరమేశ్వరః. 23

జాగ్రత్స్వప్నసుషుప్త్యాఖ్యా సంసృతిర్యా ప్రవర్తతే,
తస్యా విలక్షణః సాక్షీ చిన్మాత్రస్త్వం రఘూత్తమ. 24

త్వత్త ఏవ జగజ్జాతం త్వయి సర్వం ప్రతిష్ఠితమ్,
త్వయ్యేవ లీయతే కృత్స్నం తస్మాత్త్వం సర్వకారణమ్. 25

రజ్జావహిమివాత్మానం జీవం జ్ఞాత్వా భయం భవేత్,
పరాత్మాహమితి జ్ఞాత్వా భయదుఃఖైర్విముచ్యతే. 26

చిన్మాత్రజ్యోతిషా సర్వాః సర్వదేహేషు బుద్ధయః,
త్వయా యస్మాత్ప్రకాశ్యన్తే సర్వస్యాత్మా తతో భవాన్. 27

అజ్ఞానాన్న్యస్యతే సర్వం త్వయి రజ్జౌ భుజంగవత్
త్వజ్జ్ఞానాల్లీయతే సర్వం తస్మాజ్జ్ఞానం సదాభ్యసేత్. 28

త్వత్పాదభక్తియుక్తానాం
విజ్ఞానం భవతి క్రమాత్,
తస్మాత్త్వద్భక్తియుక్తా
యే ముక్తిభాజస్త ఏవ హి. 29

అహం త్వద్భక్తభక్తానాం తద్భక్తానాం చ కింకరః,
అతో మామనుగృహ్ణీష్వ మోహయస్వ న మాం ప్రభో. 30

త్వన్నాభికమలోత్పన్నో బ్రహ్మా మే జనకః ప్రభో,
అతస్తవాహం పౌత్రోఽస్మి భక్తం మాం పాహి రాఘవ. 31

దేహాభిమానియగు చేతనాభాసమే జగత్తునందు తన్మయుడుగా నుండు జీవునిగా విఖ్యాతిపొందినాడు. అనిర్వచనీయము, అనాదియగు అవిద్యయే ఈ జీవునకు కారణోపాధి యని చెప్పబడినది. (22) శుద్ధ చేతనమునకు స్థూల, సూక్ష్మ, కారణములను మూడు ఉపాధు లున్నవి. ఆ ఉపాధులు కలిగియుండుట చేతనే జీవుడనబడుచున్నాడు. అవి లేనిచో అతడు పరమేశ్వరు డనబడుచున్నాడు (23). రఘుకులతిలకా! జాగ్రత్, స్వప్న సుషుప్తి నామములు గల మూడు విధములగు సృష్టి కలదు. నీవు ఆ మూడిటి కన్న విలక్షణుడవు. సకలసృష్టికి చేతనమాత్ర సాక్షివి (24). ఈ సమస్త జగత్తు నీ వల్లనే ఉత్పన్నమైనది. నీ యందే స్థితి పొందియున్నది. నీయందే లీనమగుచున్నది. కావున సర్వమునకు నీవే కారణము (25). రజ్జువునందు సర్పభ్రాంతివలె తనను జీవునిగా ఎంచుకొనుటచే మానవునకు భయము కలుగుచున్నది. అతడే నేను పరమాత్మను అని తెలియగలిగినపుడు సంపూర్ణముగా భయమునుండి దుఃఖముల నుండి విడివడుచున్నాడు (26). చిన్మయజ్యోతి స్వరూపుడవగు నీవే అందరి శరీరములందుండి వారి బుద్ధులను ప్రకాశింపచేయుచున్నావు. ఈ కారణమున నీవే అందరకును (సర్వమునకు) ఆత్మవై యున్నావు (27). రజ్జువునందు సర్పభ్రాంతివలె అజ్ఞానము చేతనే నీయందు సమస్త జగత్తు కల్పన చేయబడుచున్నది. కాని నీ యొక్క జ్ఞానము కలుగుటతోడనే అదియంతయు నీ యందే లీనమగుచున్నది. కావున మానవుడు సదా జ్ఞానమునకై అభ్యాసము చేయవలయును (28). నీ పాదపద్మముల యందు భక్తియుతులైన వారికి మాత్రమే క్రమముగా జ్ఞానప్రాప్తి కలుగును. కావున ఎవరు భక్తియుక్తులో వారే వాస్తవముగా ముక్తికి పాత్రులు (29). ఓ ప్రభూ! నేను నీకు భక్తులకు భక్తులైన వారి దాసానుదాసుడను. కావున నీవు నన్ను మోహింపచేయ కూడక నాయందనుగ్రహము చూపుము (30). దేవా! నీ నాభికమలమునుండి ఆవిర్భవించిన బ్రహ్మ నాకు తండ్రి. కావున నేను నీకు మనుమడను. రాఘవా! నీవు భక్తుడనగు నన్ను రక్షింపుము (31).''

ఇత్యుక్త్వా బహుశో నత్వా స్వానందాశ్రుపరిప్లుతః,
ఉవాచ వచనం రామ బ్రహ్మణా నోదితోఽస్మ్యహమ్.32

రావణస్య వధార్థాయ జాతోఽసి రఘుసత్తమ,
ఇదానీం రాజ్యరక్షార్థం పితా త్వామభిషేక్ష్యతి. 33

యది రాజ్యాభిసంసక్తో రావణం న హనిష్యసి,
ప్రతిజ్ఞా తే కృతా రామ భూభారహరణాయ వై. 34

తత్సత్యం కురు రాజేంద్ర సత్యసంధస్త్వమేవ హి,
శ్రుత్వైతద్గదితం రామో నారదం ప్రాహ సస్మితమ్.35

శృణు నారద మే కించిద్విద్యతేఽవిదితం క్వచిత్
ప్రతిజ్ఞాతం చ యత్పూర్వం కరిష్యే తన్న సంశయః. 36

కింతు కాలానురోధేన తత్తత్ప్రారబ్ధసంక్షయాత్,
హరిష్యే సర్వభూభారం క్రమేణాసురమండలమ్. 37

రావణస్య వినాశార్థం శ్వో గంతా దండకావనమ్,
చతుర్దశసమాస్తత్ర హ్యుషిత్వా మునివేషధృక్. 38

సీతామిషేణ తం దుష్టం సకులం నాశయామ్యహమ్,
ఏవం రామే ప్రతిజ్ఞాతే నారదః ప్రముమోద హ.39

ప్రదక్షిణత్రయం కృత్వా దండవత్ప్రణిపత్య తమ్,
అనుజ్ఞాతశ్చ రామేణ యయౌ దేవగతిం మునిః. 40

సంవాదం పఠతి శృణోతి సంస్మరేద్వా
యో నిత్యం మునివరరామయోః స భక్త్యా,
సంప్రాప్నోత్యమరసుదుర్లభం విమోక్షం
కైవల్యం విరతిపురఃసరం క్రమేణ. 41

ఈ విధముగా పలికి పలుమారులు ప్రణామము లర్పించి నారదుడు నేత్రములయందు ఆనందాశ్రువుల నింపగా "రఘుకులోత్తమా! నన్ను బ్రహ్మ నీ యొద్దకు పంపినాడు. నీ అవతారము రావణుని వధించుట కొరకే జరిగినది. కాని నిన్ను దశరథమహారాజు రాజ్యపాలనకై అభిషిక్తుని చేయనున్నాడు (32-33). రాఘవా! నీవు రాజ్యపాలనము నందు నిరతుడవై రావణ సంహారము గావించనిచో భూభారము బాపుటకు మీరు చేసిన బాస యేమగును? (34). కాన శ్రీరామా! నీవు నీ ప్రతిజ్ఞను సత్యము కావింపుము. నీవు సత్యప్రతిజ్ఞుడవే కదా!"

నారదుని వచనములు విని రాముడు చిరునగవుతో యిట్లనెను (35)- "నారదా! వినుము! నాకు తెలియని విషయము కలదా? ఇంతకు ముందు నేను చేసిన ప్రతినను అవశ్యము నిలుపుకొందును. ఇందు ఎట్టి సంశయమును లేదు (36). కాని కాలక్రమమున ఎవరెవరి ప్రారబ్ధము క్షీణించునో ఆ యా దైత్యులను మాత్రమే సంహరించుచు, క్రమముగా ధరణీభారము తగ్గించెదను (37). రావణుని వధించుటకు రేపు దండకారణ్యమునకు వెళ్లెదను. అచట పదునాలుగేండ్లు మునివేషము దాల్చి యుండెదను (38). దుష్టుడగు రావణుని సీతాపహరణమను నెపమున సకుటుంబముగా నాశన మొనరించెదను".

రాముడిట్లు ప్రతిజ్ఞ చేయగా నారదుడెంతయో సంతోషించెను (39). అనంతరము అతడు శ్రీరామునికి ముమ్మారు ప్రదక్షిణము గావించి, దండప్రణామము లాచరించి అతని అజ్ఞగొని ఆకాశమార్గమున దేవలోకమునకు వెడలిపోయెను (40).

ఈ శ్రీరామచంద్ర నారద సంవాదమును నిత్యము భక్తితో పఠించువాడు, ఆలకించువాడు, స్మరించువాడు సంసారమునందు విరక్తిని పొంది, తత్ఫలముగా దేవతలకును అత్యంత దుర్లభమైన కైవల్య మోక్షపదమును పొందును (41).

ఇది శ్రీమదధ్యాత్మరామాయణాంతర్గత ఉమామహేశ్వర సంవాదములో
అయోధ్యాకాండ - ప్రథమ సర్గము ॥ 1 ॥

\----****----

ఓం

# ద్వితీయ సర్గము

## రాజ్యాభిషేక సన్నాహము - వసిష్ఠ రామ సంవాదము

శ్రీమహాదేవ ఉవాచ

అథ రాజా దశరథః కదాచిద్రహసి స్థితః,
వసిష్ఠం స్వకులాచార్యమాహూయేదమభాషత. 1

భగవన్ రామమఖిలాః ప్రశంసంతి ముహుర్ముహుః,
పౌరాశ్చ నిగమా వృద్ధా మంత్రిణశ్చ విశేషతః. 2

తతః సర్వగుణోపేతం రామం రాజీవలోచనమ్,
జ్యేష్ఠం రాజ్యేఽభిషేక్ష్యామి వృద్ధోఽహం మునిపుంగవ. 3

భరతో మాతులం ద్రష్టుం గతః శత్రుఘ్నసంయుతః,
అభిషేక్ష్యే శ్వ ఏవాశు భవాంస్తచ్చానుమోదతామ్. 4

సంభారాః సంక్రియంతాం చ
గచ్ఛ మంత్రయ రాఘవమ్,
ఉచ్ఛ్రీయంతాం పతాకాశ్చ
నానావర్ణాః సమంతతః. 5

తోరణాని విచిత్రాణి స్వర్ణముక్తామయాని వై.
ఆహూయ మంత్రిణం రాజా సుమంత్రం మంత్రిసత్తమమ్. 6

ఆజ్ఞాపయతి యద్యత్త్వాం మునిస్తత్తత్సమానయ,
యౌవరాజ్యేఽభిషేక్ష్యామి శ్వోభూతే రఘునందనమ్. 7

తథేతి హర్షాత్స మునిం కిం కరోమీత్యభాషత,
తమువాచ మహాతేజా వసిష్ఠో జ్ఞానినాం వరః. 8

శ్వః ప్రభాతే మధ్యకక్షే కన్యకాః స్వర్ణభూషితాః,
తిష్ఠంతు షోడశ గజః స్వర్ణరత్నాదిభూషితః. 9

చతుర్దంతః సమాయాతు ఐరావతకులోద్భవః,
నానాతీర్థోదకైః పూర్ణాః స్వర్ణకుంభాః సహస్రశః. 10

శ్రీ మహాదేవుడిట్లనెను - " ఒకనాడు ఏకాంతమున కూర్చుండియున్న దశరథమహారాజు తన కులగురువగు వశిష్ఠుని సాదరముగ పిలువనంపి ఇట్లనెను (1). "గురుదేవా! పురవాసులు, వేదపండితులు, క్రయ విక్రయముల చేయువారగు పెద్దలు, మంత్రివరులు శ్రీరాముని మిక్కిలి శ్లాఘించుచున్నారు (2). మునివరా! నేను వృద్ధుడనైతిని. కనుక సర్వగుణ సంపన్నుడు, రాజీవనేత్రుడు, నా జ్యేష్ఠపుత్రుడగు రాముని రాజ్యాభిషిక్తునిగా చేయుదును (3).

"భరతుడు శత్రుఘ్నునితో సహా మేనమామ యింటికి వెళ్ళినాడు. అతడు తిరిగి వచ్చుటకు చాలా ఆలస్యము కావచ్చును. శ్రీరాముని రాజ్యాభిషేకమునకు నా మనస్సు తహతహలాడుచున్నది. కనుక రేపటిదినముననే రాముని రాజ్యాభిషిక్తుని చేసెదను. అనుమతింపుడు!(4). మునివర్యా! అభిషేక సామగ్రిని సిద్ధపరపుడు! రామునికి వార్త తెలియచేయుడు!"

మంత్రి శ్రేష్ఠుడగు సుమంత్రుని పిలిచి ఇట్లనెను "రేపటి ఉదయమే రాముని యువరాజుగా అభిషేకించు చున్నాను. నగరము నాల్గువంకల నానావర్ణ పతాకములతో అలంకరింపబడు గాక! బంగారముతో ముత్యములు పొదగబడిన అత్యద్భుత ద్వారములు శోభిల్లును గాక! అంతియేకాక వశిష్ఠ మహర్షి ఆజ్ఞాపించినవన్నియు నెరవేర్చబడుగాక! (5-7)".

సుమంత్రుడు హర్షముతో "ఆజ్ఞ" యని పలికి మునివరుని "నేనేమి చేయవలయు"నని యడిగెను. మహాతేజస్వి, జ్ఞానులలో శ్రేష్ఠుడు అగు వశిష్ఠుడు ఇట్లు చెప్పెను (8) - "రేపు ప్రాతఃకాలమున మధ్యద్వారము కడ సువర్ణ భూషణాలంకృతులైన పదునారుగురు కన్యలు నిలువబడి యుండవలెను. సువర్ణముతో, రత్నాదులతో అలంకరింపబడి, ఐరావతకులమునందు పుట్టిన నాల్గుదంతముల ఏనుగు ఒకటి తీసికొనిరాబడు గాక! సకల తీర్థములనుండి జలభరితములైన వేనవేల సువర్ణకలశములు తెప్పింపబడుగాక! (9-10).

స్థాప్యంతాం నవవైయాఘ్రచర్మాణి త్రీణి చానయ,
శ్వేతచ్ఛత్రం రత్నదండం ముక్తామణివిరాజితమ్. 11

దివ్యమాల్యాని వస్త్రాణి దివ్యాన్యాభరణాని చ,
మునయః సత్కృతాస్తత్ర తిష్ఠంతు కుశపాణయః. 12

నర్తక్యో వారముఖ్యాశ్చ గాయకా వేణుకాస్తథా,
నానావాదిత్రకుశలా వాదయంతు నృపాంగణే. 13

హస్త్యశ్వరథపాదాతా బహిస్తిష్ఠంతు సాయుధాః,
నగరే యాని తిష్ఠంతి దేవతాయతనాని చ. 14

తేషు ప్రవర్తతాం పూజా నానాబలిభిరాదృతా,
రాజానః శీఘ్రమాయాంతు నానోపాయనపాణయః. 15

ఇత్యాదిశ్య మునిః శ్రీమాన్ సుమంత్రం నృపమంత్రిణమ్,
స్వయం జగామ భవనం రాఘవస్యాతిశోభనమ్. 16

రథమారుహ్య భగవాన్వసిష్ఠో మునిసత్తమః,
త్రీణి కక్ష్యాణ్యతిక్రమ్య రథాత్ క్షితిమవాతరత్. 17

అంతః ప్రవిశ్య భవనం స్వాచార్యత్వాదవారితః,
గురుమాగతమాజ్ఞాయ రామస్తూర్ణం కృతాంజలిః. 18

ప్రత్యుద్గమ్య నమస్కృత్య దండవద్ భక్తిసంయుతః,
స్వర్ణపాత్రేణ పానీయమానినాయాశు జానకీ. 19

రత్నాసనే సమావేశ్య పాదౌ ప్రక్షాల్య భక్తితః,
తదపః శిరసా ధృత్వా సీతయా సహ రాఘవః. 20

ధన్యోఽస్మీత్యబ్రవీద్రామస్తవ పాదాంబుధారణాత్,
శ్రీరామేణైవముక్తస్తు ప్రహసన్మునిరబ్రవీత్. 21

త్వత్పాదసలిలం ధృత్వా ధన్యోఽభూద్గిరిజాపతిః,
బ్రహ్మాపి మత్పితా తే హి పాదతీర్థహతాశుభః. 22

మూడు నూతనమైన వ్యాఘ్రచర్మములను సింహాసనముపై పరపింపుడు! ముక్తామణి సమలంకృతమై, రత్నదండయుతమైన శ్వేతఛత్రము, అనేక దివ్య మాల్యాంబరములు దివ్యాభరణములు తెప్పింపబడు గాక! అచట చక్కగా సన్మానింపబడిన మునులు దర్భహస్తులై నిలిచి ఉందురు గాక! (11-12). పలువురు నాట్యకత్తెలు, ముఖ్య వారాంగనలు గాయకులు, వేణువు మొదలైన వాద్యవాదన కోవిదులు, దశరథ మహారాజు ప్రాంగణమున నృత్యగీతాదికములు కొనసాగింతురు గాక! (13) రథ, గజ, తురగ, పదాతులతో కూడిన చతురంగ బలము ఆయుధములు ధరించి వెలుపల నిలిచియుండుగాక! నగరమందలి దేవళము లన్నిటిలో నానావిధములగు నైవేద్యములతో పూజాదికములు జరుపబడు గాక! రాజులందరు వేరు వేరు కానుకలతో వేగమే వత్తురు గాక! (14-15).

మంత్రివరుడైన సుమంత్రునకు ఈ విధముగా ఆజ్ఞనిచ్చి, వశిష్ఠమహర్షి రథారూఢుడై స్వయముగా శ్రీరాముని సుందర మందిరమునకు బయలుదేరెను. శ్రీరాముని భవనమున మూడు కక్ష్యలు దాటి రథము నుండి దిగెను (16-17).

రఘువంశీయులకు ఆచార్యుడగుటచే ఎవరును అతనిని ఆపలేదు. నిరాటంకముగా వశిష్ఠుడు లోనికేగెను. తన గురువు స్వయముగా విచ్చేసెనని తెలిసికొని శ్రీరాముడు వెంటనే చేతులు జోడించుచు ఎదురేగి, ఆహ్వానించి, భక్తిపూర్వకముగా దండప్రణామములు ఆచరించెను. జానకీదేవి స్వర్ణపాత్రమున జలము కొనిరాగా, గురువరుని రత్నసింహాసనముపై ఆసీనుని చేసి అతని పాదములను శ్రద్ధాభక్తులతో కడిగెను. పిమ్మట రాఘవుడు సీతతో సహా ఆ తీర్థమును శిరమున ధరించి ''మీ పాదతీర్థము శిరమున ధరించుటచే నేను ధన్యుడనైతిని'' అని పలికెను. శ్రీరాముడట్లు పలుకగా మందహాసముతో వశిష్ఠుడిట్లనెను (18-21).

''రామా! నీ పాదతీర్థము శిరమున దాల్చి శంకరుడు ధన్యుడయ్యెను. నా తండ్రి బ్రహ్మయు నీ పాదతీర్థము సేవించియే పాపమును తొలగించుకొనెను (22). ఈనాడు

ఇదానీం భాషసే యత్త్వం లోకానాముపదేశకృత్,
జానామి త్వాం పరాత్మానం లక్ష్మ్యా సంజాతమీశ్వరమ్. 23

దేవకార్యార్థసిద్ధ్యర్థం భక్తానాం భక్తిసిద్ధయే,
రావణస్య వధార్థాయ జాతం జానామి రాఘవ. 24

తథాపి దేవకార్యార్థం గుహ్యం నోద్ఘాటయామ్యహమ్,
యథా త్వం మాయయా సర్వం కరోషి రఘునందన. 25

తథైవానువిధాస్యేఽహం శిష్యస్త్వం గురురప్యహమ్,
గురుర్గురూణాం త్వం దేవ పితౄణాం త్వం పితామహః. 26

అంతర్యామీ జగద్యాత్రావాహకస్త్వమగోచరః,
శుద్ధసత్త్వమయం దేహం ధృత్వా స్వాధీనసంభవమ్. 27

మనుష్య ఇవ లోకేఽస్మిన్ భాసి త్వం యోగమాయయా,
పౌరోహిత్యమహం జానే విగర్హ్యం దూష్యజీవనమ్. 28

ఇక్ష్వాకూణాం కులే రామః పరమాత్మా జనిష్యతే,
ఇతి జ్ఞాతం మయా పూర్వం బ్రహ్మణా కథితం పురా. 29

తతోఽహమాశయా రామ తవ సంబంధకాంక్షయా,
అకార్షం గర్హితమపి తవాచార్యత్వసిద్ధయే. 30

తతో మనోరథో మేఽద్య ఫలితో రఘునందన,
త్వదధీనా మహామాయా సర్వలోకైకమోహినీ. 31

మాం యథా మోహయేన్నైవ తథా కురు రఘూద్వహ,
గురునిష్కృతికామస్త్వం యది దేహ్యేతదేవ మే. 32

ప్రసంగాత్సర్వమప్యుక్తం న వాచ్యం కుత్రచిన్మయా,
రాజ్ఞా దశరథేనాహం ప్రేషితోఽస్మి రఘూద్వహ. 33

త్వామామంత్రయితుం రాజ్యే శ్వోఽభిషేక్ష్యతి రాఘవ,
అద్య త్వం సీతయా సార్థముపవాసం యథావిధి. 34

కృత్వా శుచిర్భూమిశాయీ భవ రామ జితేంద్రియః,
గచ్ఛామి రాజసాన్నిధ్యం త్వం తు ప్రాతర్గమిష్యసి. 35

కేవలము గురువుతో ఎట్లు వ్యవహరింపవలెనో లోకమునకు ఉపదేశించుటకే నీవీ రీతి సంభాషించుచున్నావు. నీవు లక్ష్మీదేవితో భువిలో అవతరించిన విష్ణుడవని నేను బాగుగా ఎరుగుదును (23). రాఘవా! దేవతల కార్యము నెరవేర్చుటకు, భక్తుల భక్తిని ఫలింపజేయుటకు, రావణుని సంహరించుటకు నీవు అవతరించితివని నేనెరుగుదును. (24). అయినను దేవకార్యము సిద్ధించుట కొఱకే నేను ఈ రహస్యము నెప్పుడు బహిర్గతము చేయను. రఘునందనా! మాయను ఆశ్రయించి నీవు అన్ని కార్యములు చేయుచున్నావు. దానికి అనుగుణముగా నేనును "నీవు శిష్యుడవు, నేను గురుడను" అను ఈ సంబంధమునకు అనుకూలముగా వ్యవహరించెదను. కాని, దేవా! నీవు గురువులకు గురుడవు. పితృగణములకు పితామహుడవు. నీవు అంతర్యామివి. సూత్రధారుడు తోలుబొమ్మలను ఆడించునట్లు నీవే ఈ జగత్తును ఆడించుచున్నావు. మనస్సునకు వాక్కునకు ఇంద్రియములకును అందనివాడవు. నిజేచ్ఛతో శుద్ధ సత్త్వమయమగు దేహము ధరించి, యోగమాయతో కూడి, ఈ లోకమున మానవునివలె భాసించుచున్నావు. పురోహిత వృత్తి గర్హనీయమనియు, అతని జీవిక దూషితమనియు నేనెరుగుదును. అయినను బ్రహ్మదేవుడు ఇతఃపూర్వము "ఇక్ష్వాకు కులమందు పరమాత్మ రామునిగా అవతరించునని నాకు తెలిపియుండెను. అందువలన రామా! నీతో గురుశిష్య సంబంధము కలుగు కోరికతో ఈ ఆచార్యత్వము స్వీకరించితిని (27– 30). రఘునందనా! నేటికి నా కోర్కె నెరవేరినది. నీవు గురు ఋణ విముక్తుడవు కాగోరెదవేని నీ యధీనమందుండు సర్వలోక విమోహిని యగు మహామాయ నన్ను మోహింపజేయకుండునట్లు గావింపుము (31–32).

"రఘునాయకా! ప్రసంగవశముననే ఈ విషయములు తెల్పితిని. ఈ రహస్యములను మరల నేనెచటను పలుకబోను. రాఘవా! దశరథమహారాజు రేపు నీకు రాజ్యాభిషేకము చేయబోవుచున్నారను వార్త నీకెరింగించుటకై నేను పంపబడితిని. నేడు నీవు సీతా సమేతుడవై, విధ్యుక్తముగా ఉపవసించి, శుచివై, ఇంద్రియ నిగ్రహపూర్వకముగా నేలపై నిదురించుము. నేనిక రాజసన్నిధికి వెడలుచున్నాను. రేపటి ఉదయమున నీవు వెడలగలవు[1] (33–35)."

[1] వెడలునది రాజసముఖమునకు తదుపరి వనవాసమునకు అని శ్లేష.

ఇత్యుక్త్వా రథమారుహ్య యయౌ రాజగురుర్ద్రుతమ్,
రామోఽపి లక్ష్మణం దృష్ట్వా ప్రహసన్నిదమబ్రవీత్. 36

సౌమిత్రే యౌవరాజ్యే మే శ్వోఽభిషేకో భవిష్యతి,
నిమిత్తమాత్రమేవాహం కర్తా భోక్తా త్వమేవ హి. 37

మమ త్వం హి బహిఃప్రాణో నాత్ర కార్యా విచారణా,
తతో వసిష్ఠేన యథా భాషితం తత్తథాకరోత్. 38

వసిష్ఠోఽపి నృపం గత్వా
కృతం సర్వం న్యవేదయత్,
వసిష్ఠస్య పురో రాజ్ఞా -
ప్యుక్తం రామాభిషేచనమ్. 39

యదా తదైవ నగరే శ్రుత్వా కశ్చిత్పుమాన్ జగౌ,
కౌసల్యాయై రామమాత్రే సుమిత్రాయై తథైవ చ. 40

శ్రుత్వా తే హర్షసంపూర్ణే దదతుర్హారముత్తమమ్,
తస్మైతతః ప్రీతమనాః కౌసల్యా పుత్రవత్సలా. 41

లక్ష్మీం పర్యచరద్దేవీం రామస్యార్థ ప్రసిద్ధయే,
సత్యవాదీ దశరథః కరోత్యేవ ప్రతిశ్రుతమ్. 42

కైకేయీవశగః కింతు కాముకః కిం కరిష్యతి,
ఇతి వ్యాకులచిత్తా సా దుర్గాం దేవీమపూజయత్. 43

ఏతస్మిన్నంతరే దేవా
దేవీం వాణీమచోదయన్,
గచ్ఛ దేవి భువో లోక-
మయోధ్యాయాం ప్రయత్నతః. 44

రామాభిషేకవిఘ్నార్థం యతస్వ బ్రహ్మవాక్యతః,
మంథరాం ప్రవిశస్వాదౌ కైకేయీం చ తతః పరమ్. 45

తతో విఘ్నే సముత్పన్నే పునరేహి దివం శుభే,
తథేత్యుక్త్వా తథా చక్రే ప్రవివేశాథ మంథరామ్. 46

ఈ విధముగా పలికి రాజ పురోహితుడగు వశిష్ఠుడు, రథము నధిరోహించి శీఘ్రముగా వెడలిపోయెను. అంతట శ్రీరామచంద్రుడు లక్ష్మణుని చూచి చిరునగవుతో యిట్లనెను ''సుమిత్రానందనా! రేపు నాకు యువరాజ పట్టాభిషేకము జరుగనున్నది. నేనా పదవియందు కేవలము నిమిత్తమాత్రుడనుగా యుందును. అందు కర్తవు, భోక్తవు రెండును నీవే! ఏలయన నాకు బహిః ప్రాణమవు నీవే! ఇందు విశేషముగా ఆలోచింప బనిలేదు''. ఇట్లు చెప్పిన తరువాత వశిష్ఠుడు చెప్పిన రీతిని శ్రీరాముడు ఆచరించెను (37-38).

ఆట వశిష్ఠుడుకూడ దశరథుని కడకేగి, తాను చేసిన దంతయు తెలియజెప్పెను. దశరథుడు రామాభిషేకము గురించి వశిష్ఠునితో మాటలాడు సమయమున ఎవరో ఒక పురుషుడు ఆ మాట లాలించి నగరమంతట వెల్లడి చేసెను. రాముని తల్లియగు కౌసల్య సుమిత్రాదేవికి కూడ ఈ విషయము ఎరింగించెను (39 -40).

వారిరువురు ఈ వార్త వినుటతోడనే అత్యంత హర్షము పొంది అత్యుత్తమమైన హారమును, శుభవార్త తెలిపిన వానికిచ్చిరి. అనంతరము పుత్రవత్సలయగు కౌసల్య రామచంద్రుని అభీష్టసిద్ధికై లక్ష్మీదేవిని పూజించెను. ''దశరథ మహారాజ సత్యవాదియని, ప్రతిజ్ఞను పాలించువాడని ప్రసిద్ధి యున్నది (41-42). కాని అతడు కైకకు వశవర్తియై యున్నాడు. కాముకుడువీమిచేయునో ఏమో'' ఈ విధముగా వ్యాకులచిత్తయై ఆమె దుర్గాదేవిని పూజించెను (43).

ఆదే సమయమున దేవతలు (ఈ విధముగా) సరస్వతీదేవిని ప్రేరేపించిరి - ''దేవీ! నీవిప్పుడే భూలోకమున అయోధ్యాపురి కేగుము. ఇది ఆవశ్యకము. ఆట బ్రహ్మదేవుని ఆజ్ఞగా రామచంద్రుని రాజ్యాభిషేకమునకు విఘ్నము కలిగించుటకు ప్రయత్నించుము. ముందుగా మంథరలో, తదుపరి కైకలో ప్రవేశింపుము (44-45). కల్యాణీ! ఈ విధముగా విఘ్నము ఏర్పడిన తరువాత నీవు తిరిగి రమ్ము''. ఈ మాటలకు సరస్వతి 'అట్లే' అని ముందుగా మంథరలో ప్రవేశించెను (46).

సాపి కుబ్జా త్రివక్రా తు ప్రాసాదాగ్రమథారుహత్,
నగరం పరితో దృష్ట్వా సర్వతః సమలంకృతమ్. 47

నానాతోరణసంబాధం
పతాకాభిరలంకృతమ్,
సర్వోత్సవసమాయుక్తం
విస్మితా పునరాగమత్. 48

ధాత్రీం పప్రచ్ఛ మాతః కిం నగరం సమలంకృతమ్,
నానోత్సవసమాయుక్తాం కౌసల్యా దాతిహర్షితా. 49

దదాతి విప్రముఖ్యేభ్యో వస్త్రాణి వివిధాని చ,
తామువాచ తదా ధాత్రీ రామచంద్రాభిషేచనమ్. 50

శ్వో భవిష్యతి తేనాద్య సర్వతోఽలంకృతం పురమ్,
తచ్ఛ్రుత్వా త్వరితం గత్వా కైకేయీం వాక్యమబ్రవీత్. 51

పర్యంకస్థాం విశాలాక్షీమేకాంతే పర్యవస్థితామ్,
కిం శేషే దుర్భగే మూఢే మహద్భయముపస్థితమ్. 52

న జానీషేఽతిసౌందర్యమానినీ మత్తగామినీ. 53

రామస్యానుగ్రహాద్రాజ్ఞః శ్వోఽభిషేకో భవిష్యతి,
తచ్ఛ్రుత్వా సహసోత్థాయ కైకేయీ ప్రియవాదినీ. 54

తస్యై దివ్యం దదౌ స్వర్ణనూపురం రత్నభూషితమ్,
హర్షస్థానే కిమితి మే కథ్యతే భయమాగతమ్. 55

భరతాదధికో రామః ప్రియకృన్మే ప్రియంవదః,
కౌసల్యాం మాం సమం పశ్యన్ సదా శుశ్రూషతే హి మామ్.
56

రామాద్భయం కిమాపన్నం తవ మూఢే వదస్వ మే,
తచ్ఛ్రుత్వా విషసాదాథ కుబ్జా కారణవైరిణీ. 57

గూనిదైన మంథర సౌధము పైభాగమునకేగి నగరము ఎల్లవంకల దివ్యముగా అలంకరింపబడుట చూచెను (47). అందందు నానావిధములైన తోరణములు వ్యాపించియున్నవి. చిత్రవిచిత్రములగు పతాకములు శోభిల్లుచున్నవి. అంతటా ఉత్సవ వాతావరణము నిండియున్నది. అది చూచి ఆమె చాల ఆశ్చర్యపడి క్రిందకు దిగివచ్చి (48) అటనున్న ఒక దాదిని "అమ్మా! నేడు నగరమంతయు ఏల అలంకరింపబడినది? మహారాణి కౌసల్య కూడ వివిధోత్సవములు చేయుచు బ్రాహ్మణోత్తములకు వివిధ వస్త్రాభరణములను ఎందుకు దానము చేయుచున్నది?" అని అడిగెను. అప్పుడా దాది "రేపు శ్రీరామునకు రాజ్యాభిషేకము జరుగును. ఆ కారణమున నగరము అలంకరింపబడినది" అని బదులు చెప్పెను. ఆ మాట వినుటతోడనే మంథర కైకేయి కడకేగెను (49-51). ఆ సమయమున విశాలాక్షియగు కైక ఏకాంతముగా శయ్యపై యుండెను. ఆమెతో మంథర ఇట్లనెను - "దురదృష్టవంతురాలా! మూఢురాలా! నీకు నిద్దుర ఎట్లు పట్టుచున్నది? నీకు పెద్ద ఆపద వచ్చిపడినది (52). మత్తగామినీ! నీకు సౌందర్యవతినన్న గర్వమెక్కువ. అందులకే నీకేమియు తెలియరాకున్నది (53).

చూడు! మహారాజు దయవలన రేపు రామునకు రాజ్యాభిషేకము జరుగనున్నది. నీకీ విషయము తెలియదా?" ఈ మాట విని ప్రియవాదినియగు కైకేయి తటాలున లేచి నిలబడి (54) మంథరకు దివ్యమైన, సుందరమైన రత్నఖచితమైన నూపురము బహూకరించుచు నిట్లనెను "ఓసీ! ఇది మిక్కిలి శుభవార్తకదా! ఆపద వచ్చిపడెనంటివేమి! రాముడు నాకు భరతుని కన్న అత్యంతము ప్రియము చేకూర్చువాడు. మధురభాషి, నన్నును కౌసల్యను సమానముగా చూచుచు సదా నన్ను సేవించువాడు (56) మూర్ఖురాలా! నీకు రాముని వలన భయమేమి కలిగినది? తెలుపుము!"

ఈ మాటలు విని సరస్వతీ ప్రేరణ వలని వైర కారణమున మంథర దుఃఖముతో ఇట్లనెను - (57)

శ్రుణు మద్వచనం దేవి యథార్థం తే మహద్భయమ్,
త్వాం తోషయన్ సదా రాజా ప్రియవాక్యాని భాషతే. 58

కాముకోఽతథ్యవాదీ చ త్వాం వాచా పరితోషయన్,
కార్యం కరోతి తస్యా వై రామమాతుః సుపుష్కలమ్. 59

మనస్యేతన్నిధాయైవ ప్రేషయామాస తే సుతమ్,
భరతం మాతులకులే ప్రేషయామాస సానుజమ్. 60

సుమిత్రాయాః సమీచీనం భవిష్యతి న సంశయః,
లక్ష్మణో రామమన్వేతి రాజ్యం సోఽనుభవిష్యతి. 61

భరతో రాఘవస్యాగ్రే కింకరో వా భవిష్యతి,
వివాస్యతే వా నగరాత్ప్రాణైర్వా హాస్యతేఽచిరాత్. 62

త్వం తు దాసీవ కౌసల్యాం నిత్యం పరిచరిష్యసి,
తతోఽపి మరణం శ్రేయో యత్సపత్న్యాః పరాభవః. 63

అతః శీఘ్రం యతస్వాద్య భరతస్యాభిషేచనే,
రామస్య వనవాసార్థం వర్షాణి నవ పంచ చ. 64

తతో రూఢోఽభయే పుత్రస్తవ రాజ్ఞి భవిష్యతి,
ఉపాయం తే ప్రవక్ష్యామి పూర్వమేవ సునిశ్చితమ్. 65

పురా దేవాసురే యుద్ధే రాజా దశరథః స్వయమ్,
ఇంద్రేణ యాచితో ధన్వీ సహాయార్థం మహారథః. 66

జగామ సేనయా సార్ధం త్వయా సహ శుభాననే,
యుద్ధం ప్రకుర్వతస్తస్య రాక్షసైః సహ ధన్వినః. 67

తదాక్షకీలో న్యపత చ్ఛిన్నస్తస్య న వేద సః,
త్వం తు హస్తం సమావేశ్య కీలరంధ్రేఽతిధైర్యతః. 68

"దేవీ! నా మాట వినుము. వాస్తవముగా పెద్ద ఆపద వచ్చి పడినది. రాజు నిన్ను సంతోషపెట్టుటకు ఎల్లపుడు ఇచ్చకపు మాటలు పలుకుచుండును (58). అతడు కాముకుడు, మిథ్యావాది. నిన్ను కేవలము మాటలతో లాలించి, రాముని తల్లికే సర్వకార్యములు అనుకూలపరచుచున్నాడు. మనసున ఈ మాటలు నిలుపుకొనియే భరతుని శత్రుఘ్నునితో పాటు మేనమామ యింటికి పంపినాడు. ఇందువలన సుమిత్రకు మేలే జరుగును. ఏలననగా లక్ష్మణుడు రాముని అనుయాయి. కావున రాజ్యభోగము అతడు అనుభవించ గలడు. కాని భరతుడు మాత్రము రామునికి సేవకుడుగా ఉండవలసి వచ్చును. లేదా అతనికి ప్రాణహాని కలుగును. నీవు మాత్రము కౌసల్యకు దాసివై సదా సేవలు చేయవలసి యుండును. ఇట్లు సవతిచేత అవమానపడుటకన్న మరణమే మిన్న (59 - 63).

కావున నీవు శీఘ్రముగా భరతునకు రాజ్యాభిషేకము, రామునకు పదునాలుగేండ్ల వనవాసము ప్రాప్తించుటకై ప్రయత్నింపవలెను (64). ఓ దేవీ! అట్లయినచో నీ పుత్రుడు భరతుడు నిష్కంటకముగా రాజ్యపదము నధిష్ఠించును. ఇందులకు నేను ముందుగనే ఒక ఉపాయ మాలోచించితిని. తెలిపెదను వినుము (65). పూర్వము దేవాసుర సంగ్రామము జరుగు సమయమున స్వయముగా ఇంద్రుడు మహారథి ధనుర్ధారియగు దశరథుని సాయము అర్థించెను (66).

"సుముఖీ! ఆ సమయమున అతడు సేనా సహితుడై నిన్ను తన వెంటగొని అటకు వెడలెను. ధనుర్ధరుడగు మహారాజు రాక్షసులతో యుద్ధము చేయువేళ, ఇరుసులోని చీల విరిగిపడిపోయెను. అంతట నీవు అత్యంత ధైర్యముతో చీల ఉండు రంధ్రమున నీ వ్రేలినే చీలగా ఉంచితివి (67-68).

స్థితవత్యసితాపాంగి పతిప్రాణపరీప్సయా,
తతో హత్వాసురాన్సర్వాన్ దదర్శ త్వామరిందమః. 69

ఆశ్చర్యం పరమం లేభే త్వామాలింగ్య ముదాన్వితః,
వృణీష్వ యత్తే మనసి వాంఛితం వరదోఽస్మ్యహమ్. 70

వరద్వయం వృణీష్వ త్వమేవం రాజాఽవదత్స్వయమ్,
త్వయోక్తో వరదో రాజన్యది దత్తం వరద్వయమ్. 71

త్వయ్యేవ తిష్ఠతు చిరం న్యాసభూతం మమానఘ,
యదా మేఽవసరో భూయాత్తదా దేహి వరద్వయమ్.72

తథేత్యుక్త్వా స్వయం రాజా మందిరం వ్రజ సువ్రతే,
త్వత్తః శ్రుతం మయా పూర్వమిదానీం స్మృతిమాగతమ్.73

అతః శీఘ్రం ప్రవిశ్యాద్య క్రోధాగారం రుషాన్వితా,
విముచ్య సర్వాభరణం సర్వతో వినికీర్య చ,
భూమావేవ శయానా త్వం తూష్ణీమాతిష్ఠ భామిని. 74

యావత్సత్యం ప్రతిజ్ఞాయ రాజాభీష్టం కరోతి తే,
శ్రుత్వా త్రివక్రయోక్తం తత్తదా కేకయనందినీ. 75

తథ్యమేవాఖిలం మేనే దుఃసంగాహితవిభ్రమా,
తామాహ కైకయీ దుష్టా కుతస్తే బుద్ధిరీదృశీ. 76

ఏవం త్వాం బుద్ధిసంపన్నాం న జానే వక్రసుందరి,
భరతో యది రాజా మే భవిష్యతి సుతః ప్రియః. 77

గ్రామాన్ శతం ప్రదాస్యామి మమ త్వం ప్రాణవల్లభా,
ఇత్యుక్త్వా కోపభవనం ప్రవిశ్య సహసా రుషా.78

విముచ్య సర్వాభరణం పరికీర్య సమంతతః,
భూమౌ శయానా మలినా మలినాంబరధారిణీ. 79

సునయనా! పతి ప్రాణరక్షణకై నీవు చాల సమయమువరకు అట్లే యుంటివి. సమస్త దైత్యగణ సంహారము ముగిసిన తరువాత, శత్రుదమనుడగు దశరథమహారాజు నిన్ను చూచెను (69). నీ ధైర్యమునకు మిక్కిలి యానందించి అతి ప్రసన్నుడై కౌగలించుకొని నేను నీకు వరమీయదలచితిని. నీకేమి కావలయునో కోరుకొనుము (70). నీవిపుడు రెండు వరములు కోరుకొనుము' అని స్వయముగా పలికెను. రాజు పలికిన మాటలు విని 'రాజా! మీరు ప్రసన్నులై రెండు వరముల నీయదలచితిరేని (71), ఇపుడు వీటిని మీ యొద్దనే యుండనిండు. నాకావశ్యక మైనపుడు ఇచ్చెదరు గాక!' అని బదులు చెప్పితివి (72).

అంతట రాజు 'అట్లే! మరి శిబిరమునకు పోదమని' నీతో పలికెను. ఈ వృత్తాంతమంతయు పూర్వము నీ వలన వింటిని. నేడు నాకది జ్ఞప్తికి వచ్చినది. భామినీ! నీవు వెంటనే రోషముతో కోపగృహము ప్రవేశించుము. సొమ్ములన్నియు తీసివైచి అటునిటు పారవేయుము. సత్యప్రమాణము చేసి రాజు వరప్రదానము చేయువరకు నీవు నేలపైననే పడియుండుము''. మంథర మాటలు విని దుస్సాంగత్య ప్రభావమున బుద్ధి భ్రమించిన కైకేయి అహితమును హితముగా భావించినది. ఇట్లు దూషితబుద్ధియై ''నీకింత తెలివి ఎక్కడనుండి వచ్చినదే! నీకింత తెలివి యున్నదని నాకు తెలియదు. నా ప్రియపుత్రుడు రాజైనచో నీకు నూరు గ్రామములను యిచ్చెదను. నీవు నాకు ప్రాణ సమానురాలవు'' అని పలికి కైకేయి రోషముతో కోపగృహము ప్రవేశించెను (73-78).

తన ఆభరణములన్నియు తీసి అటునిటు పారవైచెను. మాసిన వస్త్రము ధరించి నేలపై పరుండి దాసితో ''ఓసీ కుబ్జా! వినుము! రాముడు అడవులకు వెడలు నంతవరకు ప్రాణములు పోయినను నేనిట్లే పడియుందును'' అని చెప్పెను. అంత కుబ్జ ''కల్యాణీ! నీవు నిస్పందేహముగా

ప్రోవాచ శృణు మే కుబ్జే యావద్రామో వనం వ్రజేత్,
ప్రాణాంస్త్యక్ష్యేఽథ వా వత్రే శయిష్యే తావదేవ హి. 80

నిశ్చయం కురు కల్యాణి కల్యాణం తే భవిష్యతి,
ఇత్యుక్త్వా ప్రయయౌ కుబ్జా గృహం సాపి తథాకరోత్. 81

ధీరోఽత్యంతదయాన్వితోఽపి సుగుణా -
చారాన్వితో వాథవా
నీతిజ్ఞో విధివాదదేశికపరో విద్యావివేకోఽథవా,
దుష్టానామతిపాపభావితధియాం సంగం సదా చేద్భజేత్
తద్బుద్ధ్యా పరిభావితో వ్రజతితత్సామ్యం క్రమేణ స్ఫుటమ్. 82

అతః సంగః పరిత్యాజ్యో దుష్టానాం సర్వదైవ హి,
దుస్సంగీ చ్యవతే స్వార్థాద్యథేయం రాజకన్యకా. 83

అట్లే చేయుము. దీనివలన నీకు అవశ్యముగా మేలు కలుగగలదు'' అని కైకేయికి నచ్చచెప్పి తన యింటికి వెడలిపోయెను. కైకేయి ఆమె చెప్పినట్లే చేసెను (79 - 81).

ఒకడు ఎంత ధైర్యవంతుడు, దయాళువు, సద్గుణశీలి, సదాచారవంతుడు, నీతిజ్ఞుడు, కర్తవ్యనిష్ఠుడు, గురుభక్తి పరాయణుడు, విద్యావివేక సంపన్నుడు అయినను నిరంతరాయముగా అత్యంత పాపబుద్ధిగల దుష్టులతో సాంగత్యము చేసినచో క్రమముగా వారి బుద్ధిచే ప్రభావితుడై, వారితో సమానుడై పోవును. ఇది సత్యము (82). కావున దుష్టుల సాంగత్యము సర్వదా విడిచిపెట్ట వలెను. ఏలయన దుష్టసాంగత్యముచేత పురుషుడు ఈ రాజకన్యక (కైకేయి) వలె పురుషార్థమునుండి భ్రష్టుడై పోవును (83).

ఇది శ్రీమదధ్యాత్మరామాయణాంతర్గత ఉమామహేశ్వర సంవాదములో
అయోధ్యాకాండ - ద్వితీయ సర్గము ॥ 2 ॥

----****----

ఓమ్

# తృతీయ సర్గము

## దశరథుడు కైకకు వరములిచ్చుట

శ్రీమహాదేవ ఉవాచ

తతో దశరథో రాజా రామాభ్యుదయకారణాత్,
ఆదిశ్య మంత్రిప్రకృతీః సానందో గృహమావిశత్. 1

తత్రాదృష్ట్వా ప్రియాం రాజా కిమేతదితి విహ్వలః,
యా పురా మందిరం తస్యాః ప్రవిష్టే మయి శోభనా. 2

హసంతీ మాముపాయాతి సా కిం నైవాద్య దృశ్యతే,
ఇత్యాత్మన్యేవ సంచింత్య మనసాతివిదూయతా. 3

పప్రచ్ఛ దాసీనికరం కుతో వః స్వామినీ శుభా,
నాయాతి మాం యథాపూర్వం మత్ప్రియా ప్రియదర్శనా.
4

తా ఊచుః క్రోధభవనం ప్రవిష్టా నైవ విద్మహే,
కారణం తత్ర దేవ త్వం గత్వా నిశ్చేతుమర్హసి. 5

ఇత్యుక్తో భయసంత్రస్తో రాజా తస్యాః సమీపగః,
ఉపవిశ్య శనైర్దేహం స్పృశన్వై పాణినాబ్రవీత్. 6

కిం శేషే వసుధాపృష్ఠే పర్యంకాదీన్ విహాయ చ,
మాం త్వం ఖేదయసే భీరు యతో మాం నావభాషసే. 7

అలంకారం పరిత్యజ్య భూమౌ మలినవాససా,
కిమర్థం బ్రూహి సకలం విధాస్యే తవ వాంఛితమ్. 8

కో వా తవాహితం కర్తా నారీ వా పురుషోఽపి వా,
స మే దండ్యశ్చ వధ్యశ్చ భవిష్యతి న సంశయః. 9

బ్రూహి దేవి యథా ప్రీతిస్తదవశ్యం మమాగ్రతః,
తదిదానీం సాధయిష్యే సుదుర్లభమపి క్షణాత్. 10

జానాసి త్వం మమ స్వాంతం ప్రియం మాం స్వవశే స్థితమ్,
తథాపి మాం ఖేదయసే వృథా తవ పరిశ్రమః. 11

శ్రీమహాదేవుడిట్లనెను – ''అనంతరము దశరథ మహారాజు రామచంద్రుని అభ్యుదయమునకై ప్రజావర్గమునకు, మంత్రులకు మంగళకరములగు కార్యములు చేయుటకు అనుజ్ఞనిచ్చి, సానందముగా రాణివాసము ప్రవేశించెను. (1) అచట తన ప్రియురాలగు కైకేయిని గానక అత్యంత వికలుడై మనసులో ఇట్లు తలపోసెను – ''ఏమి కారణమో! నేను అంతఃపురమున ప్రవేశించగనే సర్వదా నగవుతో ఎదురువచ్చు ఆ సుముఖి నేడు కానరాదేమి?'' – అతడు దాసీజనమును ఇట్లు ప్రశ్నించెను – ''శుభలక్షణయైన మీ యజమానురాలు నేడు ఎక్కడున్నది? మునుపటివలె ప్రియదర్శనురాలగు నామె నా ఎదుటకు ఏల రాకున్నది? ''(2 - 4).

అంత దాసీజనులు ఇట్లనిరి – ''దేవా! కారణమేమో తెలియదు. ఆమె నేడు కోపగృహమును ప్రవేశించినది. మీరే స్వయముగా అచటికేగి విషయమేమో తెలిసి కొనుడు'' (5).

దాసీజనులు ఇట్లు పలుకగా రాజు భయభీతుడై లోనికేగి ఆమె వద్ద కూర్చుండి, ఆమెపై మెల్లగా చేయివైచి, ఇట్లు పలికెను. (6) ''భీరురాలా! శయ్యవదలి నేడిట్లు నేలపై పడియుంటివేల? నీవు నాతో మాటాడవేల? (7) సమస్తాభరణములు వీడి, మలిన వస్త్రములు ధరించి నీవిటు నేలపై పడి యుండుటేల? నీ కోరిక ఏమియో తెలుపుము. నెరవేర్చెదను (8). నీకు అనిష్టము కలిగించిన వాడెవ్వడు? ఆ వ్యక్తి స్త్రీ అయినను, పురుషుడైనను అవశ్యము దండనార్హులే! అంతియే కాదు. వధించుటకు కూడ వెనుకాడను (9). దేవీ! నీకేది యిష్టమో తెలుపుము. అది ఎంత దుష్కరమైనను నెరవేర్చెదను (10). నీవు నా మనస్సు తెలిసినదానవే కదా! నేను నీకు అత్యంత ప్రియుడను. నీ వశవర్తిని. అయినను నాకేల ఖేదము కలిగించెదవు? అట్టియెడ నీకిట్టి ప్రయాస వృథా! (11)

బ్రూహి కం ధనినం కుర్యాం దరిద్రం తే ప్రియంకరమ్,
ధనినం క్షణమాత్రేణ నిర్ధనం చ తవాహితమ్. 12

చెప్పుము - నీకు ప్రియము కూర్చిన ఏ దరిద్రుని ధనికునిగా చేయమందువు? నీకు అప్రియమొనరించిన ఏ ధనికుని క్షణములో దరిద్రునిగా చేయమందువు? (12).

బ్రూహి కం వా వధిష్యామి వధార్హో వా విమోక్ష్యతే,
కిమత్ర బహునోక్తేన ప్రాణాన్ దాస్యామి తే ప్రియే. 13

మమ ప్రాణాత్ప్రియతరో రామో రాజీవలోచనః,
తస్యోపరి శపే బ్రూహి త్వద్ధితం తత్కరోమ్యహమ్. 14

అవధ్యుని వధింపమందువా? వధింపతగినవానిని విడువమందువా? ఈ విషయమున ఇంతకంటె ఎక్కువగా నేనేమి చెప్పగలను? నేను నీకు నా ప్రాణములనైనను అర్పింపగలను. రాజీవలోచనుడు రాముడు నాకు ప్రాణములకన్న మిన్న. నేను వానిపై ఒట్టుపెట్టి చెప్పుచున్నాను. నీకేది ప్రియమో అట్లే చేయుదును (14)".

ఇతి బ్రువాణం రాజానం శపంతం రాఘవోపరి,
శనైర్విమృజ్య నేత్రే సా రాజానం ప్రత్యభాషత. 15

యది సత్యప్రతిజ్ఞోఽసి శపథం కురుషే యది,
యాచ్ఞాం మే సఫలాం కర్తుం శీఘ్రమేవ త్వమర్హసి. 16

పూర్వం దేవాసురే యుద్ధే మయా త్వం పరిరక్షితః,
తదా వరద్వయం దత్తం త్వయా మే తుష్టచేతసా. 17

తద్ద్వయం న్యాసభూతం మే స్థాపితం త్వయి సువ్రత,
తత్రైకేన వరేణాశు భరతం మే ప్రియం సుతమ్. 18

ఏభిః సంభృతసంభారైర్యౌవరాజ్యేఽభిషేచయ,
అపరేణ వరేణాశు రామో గచ్ఛతు దండకాన్. 19

మునివేషధరః శ్రీమాన్ జటావల్కలభూషణః,
చతుర్దశ సమాస్తత్ర కందమూలఫలాశనః. 20

పునరాయాతు తస్యాంతే వనే వా తిష్ఠతు స్వయమ్,
ప్రభాతే గచ్ఛతు వనం రామో రాజీవలోచనః. 21

యది కించిద్విలంబేత ప్రాణాంస్త్యక్ష్యే తవాగ్రతః,
భవ సత్యప్రతిజ్ఞస్త్వమేతదేవ మమ ప్రియమ్. 22

దశరథమహారాజు రామునిపై ఇట్లు ఒట్టుపెట్టుకొని పలికినమీదట కైకేయి మెల్లమెల్లగా కన్నీరు తుడుచుకొని రాజుతో ఇట్లనెను (15) - "రాజా! మీరు సత్యప్రతిజ్ఞ కలవారు. శపథమును చేయుచున్నారు. కావున నేనేమి కోరిన దానిని శీఘ్రముగా సఫలము చేయవలెను (16). పూర్వము దేవాసుర సంగ్రామ సమయమున నేను మిమ్ము రక్షించితిని. ఆ సమయమున ప్రసన్నచిత్తులై మీరు నాకు రెండు వరముల నిచ్చెదనంటిరి (17). సత్యవ్రతా! నాడు నేనా రెండు వరములు మీవద్ద న్యాసముగా నుంచితిని. ఇపుడు ఆ వరములలో నొకటి వెంటనే నా పుత్రుడైన భరతుని ఈనాడు సమకూర్చిన సామగ్రితో యువరాజుగా అభిషేకింపవలయును. రెండవ వరముగా వెంటనే రాముడు దండకారణ్యమునకు వెడలుగాక! (18-19). అచట శ్రీరాముడు జటావల్కలములు ధరించి, కందమూల ఫలములు భుజించుచు, మునివేషధారియై పదునాల్గేడులు వనవాసము చేయవలయును. అనంతరము అతడు ఇచ్ఛ కలిగెనేని అయోధ్యకు మరలి రావచ్చును. లేదా వనమునందే యుండవచ్చును. కాని రాజీవలోచనుడా రాముడు రేపటి ఉదయమే తప్పక వనములకు కదలి పోవలెను (21). ఇందించుక విలంబమైనను నీ కన్నెదుట నేను ప్రాణములు విడిచెదను. మీరు మీ ప్రతిజ్ఞను సత్యము గావింపుడు. నా యిష్టమిదియే!" (22).

శ్రుత్వైతద్దారుణం వాక్యం కైకేయ్యా రోమహర్షణమ్,
నిపపాత మహీపాలో వజ్రాహత ఇవాచలః. 23

శనైరున్మీల్య నయనే విమృజ్య పరయా ధియా,
దుఃస్వప్నో వా మయా దృష్టో హ్యథవా చిత్తవిభ్రమః.
24

ఈ విధముగా కైకేయి ఒడలు గగుర్పొడచునట్లు కఠినముగా పలుకగా దశరథమహారాజు వజ్రాహతమైన పర్వతమువలె నేలపై పడెను. పిమ్మట అతి భయముతో మెల్లగా కనులు తెరిచి, కన్నీరు తుడుచుకొనుచు మనసులో "నేను ఏదైన దుస్స్వప్నమును గాంచితినా? లేక నాకు చిత్తవిభ్రమము కలిగినదా?" అని తలపోసెను (24).

ఇత్యాలోక్య పురః పత్నీం వ్యాఘ్రీమివ పురః స్థితామ్,
కిమిదం భాషసే భద్రే మమ ప్రాణహరం వచః.25

రామః కమపరాధం తే కృతవాన్కమలేక్షణః,
మమాగ్రే రాఘవగుణాన్వర్ణయస్యనిశం శుభాన్. 26

కౌసల్యాం మాం సమం పశ్యన్ శుశ్రూషాం కురుతే సదా,
ఇతి బ్రువంతీ త్వం పూర్వమిదానీం భాషసేఽన్యథా. 27

రాజ్యం గృహాణ పుత్రాయ రామస్తిష్ఠతు మందిరే,
అనుగృహ్ణీష్వ మాం వామే రామాన్నాస్తి భయం తవ. 28

ఆ సమయమున తనముందు ఆడుపులివలె కూర్చొనియున్న కైకేయిని చూచి "భద్రా! నా ప్రాణములు హరించునట్టి యిట్టి మాటలేల పలుకుచుంటివి? (25) పుండరీకాక్షుడగు రాముడు నీయెడల యేమి అపరాధము గావించెను? నీవహర్నిశము నా ముందు రాముని శుభ లక్షణములు వర్ణించుచుండెడిదానవు కదా! (26) రాముడు నిన్ను, తన తల్లి కౌసల్యను సమముగా భావించి సర్వదా నీకు సేవలు చేయువాడని చెప్పుచుండెడిదానవు కదా! మరి యీ వేళ ఏల భిన్నముగా పలుకుచున్నావు? (27) నీవు నీ పుత్రునకై రాజ్యమును తీసికొనుము. కాని రాముని మాత్రము యింటిలో నుండనిమ్ము. వామాంగీ! నీవు నాపై దయ చూపుము. రాముని వలన నీకెట్టి భయమును లేదు" అని పల్కెను (28). ఇట్లు పలికి దశరథమహారాజు అశ్రుపూర్ణ నయనములతో కైకేయి పాదములపై పడెను. కైకేయి కనులెఱ్ఱజేసి (29) – "రాజేంద్రా! భ్రాంతుడవైతివా ఏమి? ఏల మాట తప్పెదవు? ప్రతిజ్ఞాభంగము కావించుకొంటివేని నరకము పొందుదువు (30). రేపు తెల్లవారుట తోడనే మృగచర్మమును, నారచీరలు ధరించి రాముడు వనమునకు బయలుదేరని యెడల నీ ఎదుటనే నేను ఉరివైచుకొనియో, విషము త్రావియో, మరణింతును (31). నీవు లోకము లందెల్ల సభలలో నేను సత్యప్రతిజ్ఞుడనని జనుల ఎదుట ఆత్మస్తుతి చేసికొనుచు, జనులను వంచించుచున్నావు. ఇపుడు రామునిపై ఒట్టుపెట్టి ఆడిన మాటను కూడ ఉల్లంఘించుచున్నావు. దీని ఫలితము నరకమే సుమా!" (32)

ఇత్యుక్త్వాశ్రుపరీతాక్షః పాదయోర్నిపపాత హ,
కైకేయీ ప్రత్యువాచేదం సాపి రక్తాంతలోచనా. 29

రాజేంద్ర కిం త్వం భ్రాంతోఽసి యుక్తం తద్భాషసేఽన్యథా,
మిథ్యా కరోషి చేత్స్వీయం భాషితం నరకో భవేత్. 30

వనం న గచ్ఛేద్యది రామచంద్రః
ప్రభాతకాలేఽజినచీరయుక్తః,
ఉద్బంధనం వా విషభక్షణం వా
కృత్వా మరిష్యే పురతస్తవాహమ్. 31

సత్యప్రతిజ్ఞోఽహమితీహ లోకే
విడంబసే సర్వసభాంతరేషు,
రామోపరి త్వం శపథం చ కృత్వా
మిథ్యాప్రతిజ్ఞో నరకం ప్రయాహి. 32

ఇత్యుక్తః ప్రియయా దీనో మగ్నో దుఃఖార్ణవే నృపః,
మూర్ఛితః పతితో భూమౌ విసంజ్ఞో మృతకో యథా.
33

తన ప్రియురాలు ఆడిన ఈ కఠోర వచనములువిని దశరథమహారాజు దుఃఖసముద్రమున మునిగెను. కడు వ్యాకులత చెందెను. మరణించినవానివలె మూర్ఛిల్లి స్పృహ నెరుగక భూమిపై పడెను (33).

ఏవం రాత్రిర్గతా తస్య దుఃఖాత్సంవత్సరోపమా,
అరుణోదయకాలే తు బందినో గాయకా జగుః. 34

నివారయిత్వా తాన్ సర్వాన్ కైకేయీ రోషమాస్థితా,
తతః ప్రభాతసమయే మధ్యకక్షముపస్థితాః. 35

బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యా ఋషయః కన్యకాస్తథా,
ఛత్రం చ చామరం దివ్యం గజో వాజీ తథైవ చ. 36

అన్యాశ్చ వారముఖ్యా యాః పౌరజానపదాస్తథా,
వసిష్ఠేన యథాజ్ఞప్తం తత్సర్వం తత్ర సంస్థితమ్. 37

స్త్రియో బాలాశ్చ వృద్ధాశ్చ రాత్రౌ నిద్రాం న లేభిరే,
కదా ద్రక్ష్యామహే రామం పీతకౌశేయవాససమ్. 38

సర్వాభరణసంపన్నం కిరీటకటకోజ్జ్వలమ్,
కౌస్తుభాభరణం శ్యామం కందర్పశతసుందరమ్. 39

అభిషిక్తం సమాయాతం గజారూఢం స్మితాననమ్,
శ్వేతచ్ఛత్రధరం తత్ర లక్ష్మణం లక్షణాన్వితమ్. 40

రామం కదా వా ద్రక్ష్యామః ప్రభాతం వా కదా భవేత్,
ఇత్యుత్సుకధియః సర్వే బభూవుః పురవాసినః. 41

ఈ విధముగా అత్యంత దుఃఖము కారణముగా అతనికి ఆ రాత్రి ఒక సంవత్సరము వలె గడిచెను. అరుణోదయము కాగానే వందిమాగధ జనులు, గాయకులు, రాజ కీర్తనము మొదలిడిరి (34). కాని కైకేయి వారిని వారించి, క్రోధపూరితయై కూర్చుండెను. అనంతరము ప్రభాతసమయమున బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య ప్రముఖుల సమూహము, ఋషిగణము, కన్యకాబృందము, దివ్యములగు ఛత్ర చామర గజ తురగాది లాంఛనములు, అభిషేక యుక్తములగు సంబారములు మధ్యద్వారముచెంత సిద్ధము గావించబడెను (35-36). అంతేగాక వశిష్ఠుని ఆజ్ఞానుసారము వారాంగనలు, పురప్రముఖులు, జానపదులు అటకు చేరిరి (37). నాటిరాత్రి స్త్రీబాలవృద్ధులు ఎవరును నిద్రించలేదు. వారందరు ఎపుడు పీతాంబరధారి రామచంద్రుని (రాజ్యాభిషిక్తునిగా) చూచెదమా యని కుతుకముతో నుండిరి (38). రాజ్యాభిషేకానంతరము ''సర్వాభరణ సంపన్నుడై, కాంతులీను మకుటము, భుజకీర్తులు ధరించి, కౌస్తుభాభరణము ధరించి కోటి మన్మథాకారుడై గజారూఢుడై, లక్ష్మణుడు శ్వేతఛత్రము ధరించగా మందస్మిత వదనారవిందుడై, కృపామృతము వెదజల్లుచు వచ్చెడి శ్యామసుందర మోహనరాముని ఎపుడు చూచెదమా?'' యనుచు ''అట్టి మంగళకరమగు ప్రభాతవేళ ఎపుడగునా'' యని పురవాసులు అందరు కుతూహలముతో ఎదురు చూచుచుండిరి (39 - 41).

నేదానీముత్థితో రాజా కిమర్థం చేతి చింతయన్,
సుమంత్రః శనైః ప్రాయాద్యత్ర రాజావతిష్ఠతే. 42

వర్ధయన్ జయశబ్దేన ప్రణమన్ శిరసా నృపమ్,
అతిఖిన్నం నృపం దృష్ట్వా కైకేయీం సమపృచ్ఛత. 43

దేవి కైకేయి వర్ధస్వ కిం రాజా దృశ్యతేఽన్యథా,
తమాహ కైకయీ రాజా రాత్రౌ నిద్రాం న లబ్ధవాన్. 44

రామ రామేతి రామేతి రామమేవానుచింతయన్,
ప్రజాగరేణ వై రాజా హ్యస్వస్థ ఇవ లక్ష్యతే,
రామమానయ శీఘ్రం త్వం రాజా ద్రష్టుమిహేచ్ఛతి. 45

ఆ సమయముననే సుమంత్రుడు ''మహారాజా ఇంతవరకు నిదుర లేవకుండుటేమి?'' యని ఆలోచించి మెలమెల్లగా రాజున్న తావు చేరెను (42). ''మహారాజాకు జయమగు గాక! '' అని పలుకుచు ప్రణమిల్లి రాజా అత్యంత ఖిన్నుడై యుండుటచూచి కైకేయితో ''దేవీ! కైకేయీ! జయము జయము! నేడు మహారాజా దుఃఖితుడై కానవచ్చు చున్నాడు. కారణమేమి'' అని అడిగెను. కైకేయి ''రాత్రి అంతయు మహారాజునకు నిద్దురలేదు 'రామా! రామా!' యనుచు చింతించుచునే యున్నారు. నిద్రలేనందున అస్వస్థులుగా కనబడుచున్నారు. వెంటనే రాముని ఇటకు పిలువబంపుడు. ప్రభువు అతనిని చూడగోరుచున్నారు. (43-45)'' అని

అశ్రుత్వా రాజవచనం కథం గచ్ఛామి భామిని,
తచ్ఛ్రుత్వా మంత్రిణో వాక్యం రాజా మంత్రిణమబ్రవీత్. 46

సుమంత్ర రామం ద్రక్ష్యామి శీఘ్రమానయ సుందరమ్,
ఇత్యుక్తస్త్వరితం గత్వా సుమంత్రో రామమందిరమ్. 47

అవారితః ప్రవిష్టోఽయం త్వరితం రామమబ్రవీత్,
శీఘ్రమాగచ్ఛ భద్రం తే రామ రాజీవలోచన. 48

పితుర్గేహం మయా సార్ధం రాజా త్వాం ద్రష్టుమిచ్ఛతి,
ఇత్యుక్తో రథమారుహ్య సంభ్రమాత్త్వరితో యయౌ. 49

రామః సారథినా సార్ధం లక్ష్మణేన సమన్వితః,
మధ్యకక్షే వసిష్ఠాదీన్ పశ్యన్నేవ త్వరాన్వితః. 50

పితుః సమీపం సంగమ్య ననామ చరణౌ పితుః,
రామమాలింగితుం రాజా సముత్థాయ ససంభ్రమః. 51

బాహూ ప్రసార్య రామేతి దుఃఖాన్మధ్యే పపాత హ,
హాహేతి రామస్తం శీఘ్రమాలింగ్యాంకే న్యవేశయత్. 52

రాజానం మూర్ఛితం దృష్ట్వా చుక్రుశుః సర్వయోషితః,
కిమర్థం రోదనమితి వసిష్ఠోఽపి సమావిశత్. 53

రామః పప్రచ్ఛ కిమిదం రాజ్ఞో దుఃఖస్య కారణమ్,
ఏవం పృచ్ఛతి రామే సా కైకేయీ రామమబ్రవీత్. 54

త్వమేవ కారణం హ్యత్ర రాజ్ఞో దుఃఖోపశాంతయే,
కించిత్కార్యం త్వయా రామ కర్తవ్యం నృపతేర్హితమ్. 55

కురు సత్యప్రతిజ్ఞస్త్వం రాజానం సత్యవాదినమ్,
రాజ్ఞా వరద్వయం దత్తం మమ సంతుష్టచేతసా. 56

త్వదధీనం తు తత్సర్వం వక్తుం త్వాం లజ్జతే నృపః,
సత్యపాశేన సంబద్ధం పితరం త్రాతుమర్హసి. 57

చెప్పెను. సుమంత్రుడు ''దేవీ! మహారాజు ఆనతి లేకుండ నేను ఎట్లు పోగలవాడను'' అని ప్రశ్నించగా దశరథమహారాజు (46) – ''సుమంత్రా! నా ప్రియపుత్రుడగు రాముని చూడగోరుచున్నాను. శీఘ్రమే రాముని ఇటకు తోడ్కొనిరమ్ము'' అని పలికెను. రాజాజ్ఞను విని సుమంత్రుడు వెంటనే శ్రీరామమందిరమునకు వెళ్లెను (47). ఎవరిచేతను నివారింపబడక అతడు లోనికేగి శ్రీరామునితో ''రాజీవలోచనా! రామా! నీకు జయమగు గాక! నీవు శీఘ్రముగా నా వెంట రమ్ము. మహారాజు నిన్ను చూడగోరుచున్నాడు'' అని చెప్పెను. ఆ మాట విన్నంతనే శ్రీరాముడు సంభ్రమముతో రథము నెక్కి బయలుదేరెను (48-49). సారథిని లక్ష్మణుని వెంటనిడుకొని మధ్యద్వారము కడనున్న వశిష్ఠాది గురుజనులను తండ్రిని దర్శించు తొందరలో నున్నందున కనులతో శిష్టాచార విధానమున సేవించుచునే, తండ్రినిచేరి నమస్కరించెను. అపుడు దశరథుడు రాముని కౌగలించుకొనుటకై సంభ్రమముతో లేచి చేతులు చాచెను. కాని దుఃఖోద్వేగమున 'హా రామా! రామా!' యనుచు నడుమనే భూమిపై కుప్పకూలెను. శ్రీరాముడు 'అయ్యో! ఏమైనది' అనుచు, వెంటనే తండ్రిని హృదయమునకు హత్తుకొని ఒడిలో చేర్చుకొనెను (50-52).

మహారాజు మూర్ఛితుడగుట చూచి రాణివాసమున నున్న స్త్రీలు ఏడువసాగిరి. 'ఈ రోదనములేమి' యనుచు వశిష్ఠుడును అచటికి వచ్చెను (53). శ్రీరాముడు కైకేయిని ''మహారాజు దుఃఖమునకు కారణమేమి'' యని ప్రశ్నించెను. ఇట్లు అడిగిన రామునితో కైకేయి ఈ విధముగా చెప్పెను. (54) ''రామా! మహారాజు దుఃఖోపశమన ఉపాయము నీ చేతనే యున్నది. ఆయన హితమునకై నీవొక కార్యము చేయవలెను. (55) నీవు సత్యప్రతిజ్ఞ కలవాడవు. మహారాజును కూడ సత్యవాదిని చేయుము. ఆయన నాయందు ప్రీతి కలిగి రెండు వరము లిచ్చి యున్నారు. (56) ఆ వరముల పరిపాలన నీయందు ఆధారపడియున్నది. మహారాజు ఆ విషయము నీతో చెప్పుటకు సంకోచపడుచున్నారు. కాని సత్యపాశబద్ధుడైన తండ్రిని అవశ్యముగా నీవు రక్షించవలెను (57).

పుత్రశబ్దేన చైతద్ధి నరకాత్త్రాయతే పితా,
రామస్తయోదితం శ్రుత్వా శూలేనాభిహతో యథా. 58

వ్యథితః కైకయీం ప్రాహ కిం మామేవం ప్రభాషసే,
పిత్రర్థే జీవితం దాస్యే పిబేయం విషముల్బణమ్. 59

సీతాం త్యక్ష్యేఽథ కౌసల్యాం రాజ్యం చాపి త్యజామ్యహమ్,

అనాజ్ఞప్తోఽపి కురుతే పితుః కార్యం స ఉత్తమః.60

ఉక్తః కరోతి యః పుత్రః స మధ్యమ ఉదాహృతః,
ఉక్తోఽపి కురుతే నైవ స పుత్రో మల ఉచ్యతే. 61

అతః కరోమి తత్సర్వం యన్మామాహ పితా మమ,
సత్యం సత్యం కరోమ్యేవ రామో ద్విర్నాభిభాషతే. 62

ఇతి రామప్రతిజ్ఞాం సా శ్రుత్వా వక్తుం ప్రచక్రమే,
రామ త్వదభిషేకార్థం సంభారాః సంభృతాశ్చ యే. 63

తైరేవ భరతోఽవశ్యమభిషేచ్యః ప్రియో మమ,
అపరేణ వరేణాశు చీరవాసా జటాధరః, 64

వనం ప్రయాహి శీఘ్రం త్వమద్యైవ పితురాజ్ఞయా,
చతుర్దశ సమాస్తత్ర వస మున్యన్నభోజనః. 65

ఏతదేవ పితుస్తేఽద్య కార్యం త్వం కర్తుమర్హసి,
రాజా తు లజ్జతే వక్తుం త్వామేవం రఘునందన. 66

శ్రీరామ ఉవాచ

భరతస్యైవ రాజ్యం స్యాదహం గచ్ఛామి దండకాన్,
కింతు రాజా న వక్తీహ మాం న జానేఽత్ర కారణమ్.67

కారణమేమన పుత్ర శబ్దమునకు నరకమునుండి తండ్రిని రక్షించువాడనియే కదా అర్థము'' కైకేయి మాట విని రాముడు శూలముచే కొట్టబడిన వాని వలె వ్యథితుడై 'అమ్మా! నేడు నాతో ఇట్టి మాటలేల పలుకు చుంటివి? తండ్రిగారి కొరకై నేను ప్రాణములనైనను ఈయగలను. భయంకరమగు విషమునైనను పానము చేయగలను (58–59). నేను నాభార్యయగు సీతను, తల్లి కౌసల్యను రాజ్యమును కూడా విడిచెదను. తండ్రి ఆదేశించుటకు ముందుగనే ఆతని అభీష్టమును నెరవేర్చు పుత్రుడు ఉత్తముడు (60). తండ్రి ఆదేశించిన పిదప పాటించెడువాడు మధ్యముడు. తండ్రి ఆదేశించినను చేయనివాడు అధముడు (మలముతో సమానము) (61). కావున తండ్రి నాకు ఏమి ఆదేశించినను తప్పక నెరవేర్చెదను. ఇది సర్వవిధముల సత్యము. రాముడు రెండుమాటలెన్నడును పలుకడు'' (62) అని పలికెను.

శ్రీరాముని యీ ప్రతిజ్ఞను ఆలించి, కైక చెప్ప నారంభించెను – ''రామా! నీ పట్టాభిషేకమునకై ఏ సామగ్రి తేబడెనో దానితో నా ప్రియపుత్రుడైన భరతునకు తప్పనిసరిగా పట్టాభిషేకము జరుపబడవలెను (63). రెండవ వరమును అనుసరించి తండ్రి ఆదేశముగా నీవు వెంటనే నేడే జటావల్కలధారివై అడవికేగవలెను. అచట మునిజనులకు యోగ్యమగు కందమూలఫలాదులతో పదునాలుగేండ్లు నివసింపుము (64–65). రఘునందనా! ఇదియే నీ తండ్రికి నీవు సాధించవలసిన కార్యము. కాని మహారాజు ఈ మాటలు నీతో చెప్పుటకు సంకోచించు చున్నాడు'' (66).

రాముడిట్లు బదులు చెప్పెను – ''తల్లీ! భరతునిదే ఈ రాజ్యమగుగాక! నేనిపుడే దండకారణ్యమునకు పోవుచున్నాను. కాని ఈ మాటలు మహారాజు నాతో స్వయముగా ఏల చెప్పకున్నారు? దీనికి కారణము తెలియ నైతిని'' (67).

శ్రుత్వైతద్రామవచనం దృష్ట్వా రామం పురః స్థితమ్,
ప్రాహ రాజా దశరథో దుఃఖితో దుఃఖితం వచః. 68

స్త్రీజితం భ్రాంతహృదయమున్మార్గపరివర్తినమ్,
నిగృహ్య మాం గృహాణేదం రాజ్యం పాపం న తద్భవేత్. 69

ఏవం చేదనృతం నైవ
మాం స్పృశేద్రఘునందన,
ఇత్యుక్త్వా దుఃఖసంతప్తో
విలలాప నృపస్తదా. 70

హా రామ హా జగన్నాథ హా మమ ప్రాణవల్లభ,
మాం విసృజ్య కథం ఘోరం విపినం గంతుమర్హసి. 71

ఇతి రామం సమాలింగ్య ముక్తకంఠో రురోద హ,
విమృజ్య నయనే రామః పితుః సజలపాణినా. 72

ఆశ్వాసయామాస నృపం శనైః స నయకోవిదః,
కిమత్ర దుఃఖేన విభో రాజ్యం శాసతు మేఽనుజః. 73

అహం ప్రతిజ్ఞాం నిస్తీర్య పునర్యాస్యామి తే పురమ్,
రాజ్యాత్కోటిగుణం సౌఖ్యం మమ రాజన్ వనే సతః. 74

త్వత్సత్యపాలనం దేవకార్యం చాపి భవిష్యతి,
కైకేయ్యాశ్చ ప్రియో రాజన్ వనవాసో మహాగుణః. 75

ఇదానీం గంతుమిచ్ఛామి వ్యేతు మాతుశ్చ హృజ్జ్వరః,
సంభారాశ్చోపహ్రియంతామభిషేకార్థమాహృతాః. 76

మాతరం చ సమాశ్వాస్య అనునీయ చ జానకీమ్,
ఆగత్య పాదౌ వందిత్వా తవ యాస్యే సుఖం వనమ్. 77

ఇత్యుక్త్వా తు పరిక్రమ్య మాతరం ద్రష్టుమాయయౌ,
కౌసల్యాపి హరేః పూజాం కురుతే రామకారణాత్. 78

హోమం చ కారయామాస బ్రాహ్మణేభ్యో దదౌ ధనమ్,
ధ్యాయతే విష్ణుమేకాగ్రమనసా మౌనమాస్థితా. 79

మహారాజగు తనంతటివాని దుర్దశను చూచి దుఃఖించుచు నిలుచున్న రాముని చూచి దుఃఖాతురుడై దశరథుడు ఇట్లు పలికెను (68)– ''రామా! స్త్రీ పరవశుడను. భ్రాంతచిత్తుడను. వక్రమార్గగామిని. పాపాత్ముడను. నన్నెదిరించి ఈరాజ్యమును కైవశము చేసికొనుము. దానివే నీకెట్టి పాపము అంటదు (69). రఘునందనా! ఇట్లు చేసిన నాకు అసత్యదోషమును అంటదు'' ఇట్లనుచు దశరథుడు విలపించసాగెను (70). ''హారామా! హా జగన్నాథా! హా ప్రాణ ప్రియా! నన్ను వదలి నీవు ఘోరాటవులకు ఎటుల వెళ్ళెదవు? (71)'' ఇట్లు పలికి దశరథుడు శ్రీరాముని కౌగలించుకొని ఎలుగెత్తి ఏడువసాగెను. అంతట శ్రీరాముడు చేత జలము గొని తండ్రి కన్నీటిని తుడిచెను. నీతిశాస్త్రవిశారదుడగు రాముడు మెల్లగా తండ్రిని ఓదార్చుచు – ''తండ్రీ! ఇందు దుఃఖించవలసిన విషయమేమున్నది? నా తమ్ముడు భరతుడు రాజ్యపాలనము గావించును. నేనును ప్రతిజ్ఞ పాలించి మరల అయోధ్యకు మరలి వత్తును. అదియును గాక వనము నందు కూడ నాకు రాజ్యమునందు కంటె కోటిరెట్లు సుఖముండును. దీనివలన నీ సత్యవాక్పాలనము, దేవకార్యము జరుగును. తల్లియగు కైకేయికిని హితము కలుగును. కావున తండ్రీ! నా వనవాసముననే ఎక్కువ ప్రయోజనమున్నది (72–75). ఇంక నేను వేగమే వనములకు వెడలగోరుచున్నాను. తల్లియగు కైకేయి హృదయక్షోభము శాంతించుగాక! అభిషేకమునకై కూర్చబడిన సామగ్రిని వేరుగా నుంచుడు (76). మా తల్లి కౌసల్యకు ధైర్యము చెప్పి ప్రియపత్ని జానకిని సమాధానపరచి, నేనిపుడే వచ్చెదను. మీకు పాదాభివందన మాచరించి సుఖముగా వనములకు పోయి రాగలవాడను (77)'' ఇట్లు పలికి తండ్రికి ప్రదక్షిణము గావించి, తల్లియగు కౌసల్యను చూచుటకై రాముడు వెడలెను.

ఆ సమయమున కౌసల్య రాముని శుభము గోరి శ్రీ విష్ణుభగవానుని పూజించుచుండెను (78). అంతకు పూర్వము ఆమె హోమమును చేయించి బ్రాహ్మణులకు ధనమును దక్షిణలిచ్చెను. పిమ్మట మౌనము వహించి ఏకాగ్ర చిత్తముతో శ్రీవిష్ణుభగవానుని ధ్యానించుచుండెను (79).

అంతఃస్థమేకం ఘనచిత్ప్రకాశం
నిరస్తసర్వాతిశయస్వరూపమ్,
విష్ణుం సదానందమయం హృదబ్జే
సా భావయంతీ న దదర్శ రామమ్. 80

అందరికిని అంతర్యామి అయినవాడు, అద్వితీయుడు, చిద్ఘనప్రకాశస్వరూపుడు, తన ప్రభావముతో అందరి అతిశయమును పారద్రోలు స్వభావము కలవాడు, సదానందమయుడగు మహావిష్ణువును తన హృదయమునందు ధ్యానించుచున్న ఆమె రాముని (రాకను) గమనించలేదు. (80).

ఇది శ్రీమదధ్యాత్మరామాయణాంతర్గత ఉమామహేశ్వర సంవాదములో
అయోధ్యాకాండ - తృతీయ సర్గము ॥ 3 ॥

****



శ్రీరామచంద్రుడు అడవికి వెళ్ళ నిశ్చయించుకొని తల్లి కౌసల్యాదేవి వద్దకు వెళ్ళుట

ఓం

# చతుర్థ సర్గము

## శ్రీరాముడు తల్లి అనుజ్ఞ తీసికొనుట, సీతా లక్ష్మణ సమేతుడై వనవాసమునకు సంసిద్ధుడగుట

శ్రీ మహాదేవ ఉవాచ

తతః సుమిత్రా దృష్ట్వైనం
రామం రాజ్ఞీం ససంభ్రమా,
కౌసల్యాం బోధయామాస
రామోఽయం సముపస్థితః. 1

శ్రుత్వైవ రామనామైషా బహిర్దృష్టిప్రవాహితా,
రామం దృష్ట్వా విశాలాక్షమాలింగ్యాంకే న్యవేశయత్. 2

మూర్ధ్న్యవఘ్రాయ పస్పర్శ గాత్రం నీలోత్పలచ్ఛవి.
భుంక్ష్వ పుత్రేతి చ ప్రాహ మిష్టమన్నం క్షుధార్దితః. 3

రామః ప్రాహ న మే మాతర్భోజనావసరః కృతః.
దండకాగమనే శీఘ్రం మమ కాలోఽద్య నిశ్చితః. 4

కైకేయీవరదానేన సత్యసంధః పితా మమ,
భరతాయ దదౌ రాజ్యం మమాప్యారణ్యముత్తమమ్. 5

చతుర్దశ సమాస్తత్ర హ్యుషిత్వా మునివేషధృక్,
ఆగమిష్యే పునః శీఘ్రం న చింతాం కర్తుమర్హసి. 6

తచ్ఛ్రుత్వా సహసోద్విగ్నా మూర్ఛితా పునరుత్థితా,
ఆహ రామం సుదుఃఖార్తా దుఃఖసాగరసంప్లుతా. 7

యది రామ వనం సత్యం యాసి చేన్నయ మామపి.
త్వద్విహీనా క్షణార్ధం వా జీవితం ధారయే కథమ్. 8

యథా గౌర్బాలకం వత్సం త్యక్త్వా తిష్ఠేన్న కుత్రచిత్.
తథైవ త్వాం న శక్నోమి త్యక్తుం ప్రాణాత్ప్రియం సుతమ్.
9

భరతాయ ప్రసన్నశ్చేద్రాజ్యం రాజా ప్రయచ్ఛతు,
కిమర్థం వనవాసాయ త్వామాజ్ఞాపయతి ప్రియమ్. 10

శ్రీమహాదేవుడిట్లనెను – ''పార్వతీ! దేవేరియగు సుమిత్ర రాముని చూచి, సంభ్రమముతో కౌసల్యను ధ్యానము నుండి మేలుకొలిపి, రాముడు వేచియున్నాడని తెలిపెను (1). రామునిపేరు వినగానే ఆమె సమాధిదశనుండి వెలికి వచ్చెను. విశాలనేత్రుడగు రాముని చూచి ఆలింగనము చేసికొని, ఒడిలో చేర్చుకొనెను (2). ఆమె రాముని శిరమును మూర్కొని నల్లకలువవలె శ్యామలమైన అతని మేనును నిమురుచు ''నాయనా! ఆకలిగొని వుంటివేమో! కొంచెము మధురాన్నము తినుమా!'' అని పలికెను (3).

అంత శ్రీరాముడిట్లనెను ''అమ్మా! ఇది భోజనము చేయు (మ, ఆనందము పొందెడి తీరిక యగు) సమయము కాదు. నేనిపుడు శీఘ్రముగా దండకారణ్యమునకు పోవువేళగా నిశ్చయించబడినది (4). సత్యప్రతిజ్ఞుడగు నా తండ్రి దేవియగు కైకకు వరము దానముగా భరతునకు అయోధ్యా రాజ్యమును, నాకు అత్యుత్తమమైన అరణ్యరాజ్యమును ప్రసాదించెను (5). అచట మునివేషముతో పదునాల్గు సంవత్సరములు ఉండి నేను వెంటనే మరలివచ్చెదను. నీవు ఏ విధముగను చింతింప తగదు (6)''.

ఆకస్మికముగా ఇట్టి మాటలు (వెలువడుట) విని కౌసల్య మూర్ఛిల్లెను. మరల కొంతవడికి స్పృహలోనికి వచ్చి, దుఃఖసాగరమున మగ్నురాలై ''రామా! నీవు నిజముగ వనమున కేగ నిశ్చయించినచో, నన్నును నీవెంట గొనిపొమ్ము. నీవులేక నేను అరక్షణమైనను ఎటుల జీవించియుండగలను! (7- 8). గోవు తన లేగను వదలి మరియొకచోట ఉండలేనట్లు, నేనును నా ప్రాణ ప్రియ పుత్రుడవైన నిన్ను విడిచి యుండలేను (9).

మహారాజునకు భరతుడన్న (అంత) ఇష్టమే యున్నచో అతనికి రాజ్యము ఇచ్చునుగాక! కాని ప్రియపుత్రుడ వగు నీకు వనవాసమేల విధించుచున్నాడు? (10).

కైకేయ్యా వరదో రాజా సర్వస్వం వా ప్రయచ్ఛతు,
త్వయా కిమపరాద్ధం హి కైకేయ్యా వా నృపస్య వా. 11

పితా గురుర్యథా రామ
తవాహమధికా తతః,
పిత్రాఽఽజ్ఞప్తో వనం గంతుం
వారయేయమహం సుతమ్. 12

యది గచ్ఛసి మద్వాక్యముల్లంఘ్య నృపవాక్యతః,
తదా ప్రాణాన్పరిత్యజ్య గచ్ఛామి యమసాదనమ్. 13

లక్ష్మణోఽపి తతః శ్రుత్వా కౌసల్యావచనం రుషా,
ఉవాచ రాఘవం వీక్ష్య దహన్నివ జగత్త్రయమ్. 14

ఉన్మత్తం భ్రాంతమనసం కైకేయీవశవర్తినమ్,
బద్ధ్వా నిహన్మి భరతం తద్బంధూన్మాతులానపి. 15

అద్య పశ్యంతు మే శౌర్యం లోకాన్ప్రదహతః పురా,
రామ త్వమభిషేకాయ కురు యత్నమరిందమ. 16

ధనుష్పాణిరహం తత్ర నిహన్యాం విఘ్నకారిణః,
ఇతి బ్రువంతం సౌమిత్రిమాలింగ్య రఘునందనః. 17

శూరోఽసి రఘుశార్దూల మమాత్యంతహితే రతః,
జానామి సర్వం తే సత్యం కింతు తత్సమయో న హి. 18

యదిదం దృశ్యతే సర్వం
రాజ్యం దేహాదికం చ యత్,
యది సత్యం భవేత్తత్ర
ఆయాసః సఫలశ్చ తే. 19

భోగా మేఘవితానస్థవిద్యుల్లేఖేవ చంచలాః,
ఆయురప్యగ్నిసంతప్తలోహస్థజలబిందువత్. 20

యథా వ్యాలగలస్థోఽపి భేకో దంశానపేక్షతే,
తథా కాలాహినా గ్రస్తో లోకో భోగానశాశ్వతాన్. 21

కైకేయికి వరమిచ్చి మహారాజు ఆమెకు సర్వస్వము సమర్పించును గాక! (దానికి అవరోధము ఏమున్నది?) కాని నీవు ఆయనకు గాని, ఆమెకు గాని ఏవిధమగు అపకారము చేసితివి? రామా! తండ్రి నీకు గురుసమానుడైన, నేను అంతకంటెను అధికురాలను. నిన్ను అతడు వనవాసమునకు పొమ్మనిన, నేను నిన్ను వలదని వారించుచున్నాను. నీవు నా ఆజ్ఞను ఉల్లంఘించి వనముల కేగినచో నేను ప్రాణములు త్యజించి యమలోకమునకు పోయెదను'' (11-13).

లక్ష్మణుడు కూడా కౌసల్యాదేవి యాడిన మాటలు విని రోషావేశముతో, ముల్లోకములు దహించువానివలె చూచుచు ఇట్లనెను (14) - ''అన్నా! ఉన్మత్తుడు, భ్రాంత చిత్తుడు, కైకేయీ వశవర్తుడైన దశరథుని బంధించి, భరతుని, అతని సహాయకులగు మేనమామలను, ఇతర బంధువుల నందరిని నేను చంపివైచెదను (15). పూర్వము సమస్త లోకములను భస్మీపటలము చేసిన (రుద్రుని) కాలాగ్ని సదృశమగు నా శౌర్యమును అందరు చూచెదరు గాక! శత్రుదమనా! రామా! నీవు రాజ్యాభిషేకమునకు సిద్ధము కమ్ము (16). ఇందుకు విఘ్నము కలిగించువారిని అందరిని నేను ధనుర్బాణములు ధరించి చంపివేయుదును'' అని లక్ష్మణుడు పలుకగా రాఘవుడు అతనిని ఆలింగనము చేసికొని ''రఘునందనా! నీవు కడుంగడు శూరుడవు. నాయొక్క పరమహితమునందే నిరతుడవు. నీవు పలికిన (ముల్లోకములు భస్మము చేసిన కాలాగ్ని సమానమగు పౌరుషము ప్రదర్శించెదననిన) మాటలు యథార్థములే! నేనెరుగుదును. కాని (అట్టి పరాక్రమ ప్రదర్శనమునకు) ఇది సమయము కాదు (18). మనకు దృశ్యమానమగు రాజ్యాదులు, దేహము మొదలగునవి సత్యములే అయినచో నీ సంరంభము, ప్రయత్నము సఫలమే అయ్యెడిది (19).

కాని ఈ భోగములు మేఘసమూహమునందు త్రుటిలో మెరసి (మరుక్షణమే) మాయమగు మెఱపుతీవలవలె చంచలములు. కాలిన ఇనుముపై బడిన జలబిందువులవలె క్షణికములు (20). పాము నోటబడి (మరణింపబోవుచున్న) కప్ప, ఆ పాము నోటిలోని మృదుమాంసఖండము తినుటకు యత్నించునటుల లోకులు కాలరూపమగు సర్పముచే గ్రసింపబడుచును, అనిత్యమైన భోగములకై ప్రాకులాడుదురు (21).

కరోతి దుఃఖేన హి కర్మతంత్రం
శరీరభోగార్థమహర్నిశం నరః,
దేహస్తు భిన్నః పురుషాత్సమీక్ష్యతే
కో నామ తత్ర భోగః పురుషేణ భుజ్యతే. 22

పితృమాతృసుతభ్రాతృదారబంధ్వాదిసంగమః,
ప్రపాయామివ జంతూనాం నద్యాం కాష్ఠౌఘవచ్చలః. 23

ఛాయేవ లక్ష్మీశ్చపలా ప్రతీతా
తారుణ్యమంబూర్మివదధ్రువం చ,
స్వప్నోపమం స్త్రీసుఖమాయురల్పం
తథాపి జంతోరభిమాన ఏషః. 24

సంసృతిః స్వప్నసదృశీ సదా రోగాదిసంకులా,
గంధర్వనగరప్రఖ్యా మూఢస్తామనువర్తతే. 25

ఆయుష్యం క్షీయతే యస్మాదాదిత్యస్య గతాగతైః,
దృష్ట్వాన్యేషాం జరామృత్యూ కథంచిన్నైవ బుధ్యతే. 26

స ఏవ దివసః సైవ రాత్రిరిత్యేవ మూఢధీః,
భోగాననుపతత్యేవ కాలవేగం న పశ్యతి. 27

ప్రతిక్షణం క్షరత్యేతదాయురామఘటాంబువత్,
సపత్నా ఇవ రోగౌఘాః శరీరం ప్రహరంత్యహో. 28

జరా వ్యాఘ్రీవ పురతస్తర్జయంత్యవతిష్ఠతే,
మృత్యుః సహైవ యాత్యేష సమయం సంప్రతీక్షతే. 29

దేహేఽహంభావమాపన్నో-
రాజాహం లోకవిశ్రుతః,
ఇత్యస్మిన్మనుతే జంతుః
కృమివిడ్భస్మసంజ్ఞితే. 30

త్వగస్థిమాంసవిణ్మూత్రరేతోరక్తాదిసంయుతః,
వికారీ పరిణామీ చ దేహ ఆత్మా కథం వద. 31

యమాస్థాయ భవాన్లోకం దగ్ధుమిచ్ఛతి లక్ష్మణ,
దేహాభిమానినః సర్వే దోషాః ప్రాదుర్భవంతి హి. 32

కేవలము శారీరిక భోగములకై మానవుడు రేయింబవళ్ళు అతి కష్టము సహించి వివిధములైన పనులు చేయుచుండుటన్న ఎంత ఆశ్చర్యము! ఒకవేళ శరీరము ఆత్మ కన్న భిన్నమైనదని తెలిసినను పురుషుడు ఏ భోగమునైనను ఎటుల అనుభవించగలుగును (22). తల్లి, తండ్రి, పుత్రులు, సోదరులు, స్త్రీలు, బంధువులు - వీరెల్లరి సమాగమము చలివేంద్రముకడ చేరిన ప్రాణులవలె, నదీ ప్రవాహమున కూడిన కట్టెలవలె క్షణికమైనది (23). ఇది స్పష్టముగా గోచరించు విషయమే - సంపద ఛాయవలె చంచలమైనది. యౌవనము నీటిఅలలవలె అనిత్యము. స్త్రీ సుఖము స్వప్నము వలె మిథ్య. ఆయువు అత్యంతము అల్పము. ఇది స్పష్టము. అయినను ప్రాణులు వీటిని శాశ్వతమని భావింతురు. లోకము స్వప్న సదృశము. శరీరము రోగాది సంకులము. గంధర్వ నగరమువలె మిథ్య అయినది. (ఆకాశము నందు చేరిన మేఘముల గుంపును గంధర్వ నగరము అందురు) అయినను మూఢజనులు సదా దీనిని సత్యమని భావించి అనుకరింతురు (25). నిత్యము సూర్యోదయాస్తమయములతో మానవుల ఆయువు నశించుచున్నది. నిత్యము ఇతరుల వార్ధక్యమును మరణమును చూచుచునే యున్నాము. అయినను మూఢుడు దీనిని గుర్తించుటలేదు (26). నిరంతరము ఆ విధముగనే రేయింబవళ్ళు సాగుచునే యున్నవి. అయినను మూఢమతి యగు పురుషుడు భోగముల వెనుకనే పరుగిడుచున్నాడు. కాలగతిని పరికించుట లేదు (27). పచ్చికుండలోని నీటివలె ఆయువు ప్రతిక్షణము క్షీణించుచునే యున్నది. రోగములు శత్రువులవలె శరీరమును బాధించుచునేయున్నవి (28). వృద్ధాప్యము ఆడుపులివలె భయపెట్టుచు ముందు నిలిచియే యున్నది. మృత్యువుకూడ దాని వెంటనే నడచుచు (అంత్య) సమయమునకై ప్రతీక్షించుచున్నది (29). నేను లోక ప్రసిద్ధుడనగు రాజానని అహంభావముతో మానవుడు ఏ శరీరము చూచుకొని భావించుచున్నాడో, చివరకు ఆ శరీరమే కృమిగా, మలముగా, భస్మముగా మారిపోవుచున్నది (30).

లక్ష్మణా! నీవే తెలుపుము! దేని నాశ్రయించి ఈ లోకమును దగ్ధము చేయ సంకల్పించితివో, ఆ దేహము చర్మముతో, ఎముకలతో, మాంసముతో, మలమూత్రములతో, శుక్రముతో, కల్పితమై వికారియైనది. షడ్విధ పరిణామ లక్షణము కలది. అట్టి నశ్వరమైన దేహము ఏ విధముగా ఆత్మ కాగలదు. సోదరా! దేహాత్మాభిమానము గల పురుషుని యందే సమస్త దోషములు ప్రకటమగుచుండును (32).

దేహోఽహమితి యా బుద్ధిరవిద్యా సా ప్రకీర్తితా.
నాహం దేహశ్చిదాత్మేతి బుద్ధిర్విద్యేతి భణ్యతే. 33

అవిద్యా సంసృతేర్హేతుర్విద్యా తస్యా నివర్తికా.
తస్మాద్యత్నః సదా కార్యో విద్యాభ్యాసే ముముక్షుభిః.
కామక్రోధాదయస్తత్ర శత్రవః శత్రుసూదన. 34

తత్రాపి క్రోధ ఏవాలం మోక్షవిఘ్నాయ సర్వదా.
యేనావిష్టః పుమాన్హంతి పితృభ్రాతృసుహృత్సఖీన్. 35

క్రోధమూలో మనస్తాపః క్రోధః సంసారబంధనమ్.
ధర్మక్షయకరః క్రోధ స్తస్మాత్క్రోధం పరిత్యజ. 36

క్రోధ ఏష మహాన్ శత్రుస్తృష్ణా వైతరణీ నది.
సంతోషో నందనవనం శాంతిరేవ హి కామధుక్. 37

తస్మాచ్ఛాంతిం భజస్వాద్య శత్రురేవం భవేన్న తే.
దేహేంద్రియమనఃప్రాణబుద్ధ్యాదిభ్యో విలక్షణః. 38

ఆత్మా శుద్ధః స్వయంజ్యోతిరవికారీ నిరాకృతిః.
యావద్దేహేంద్రియప్రాణైర్భిన్నత్వం నాత్మనో విదుః. 39

తావత్సంసారదుఃఖౌఘైః పీడ్యంతే మృత్యుసంయుతాః.
తస్మాత్త్వం సర్వదా భిన్నమాత్మానం హృది భావయ. 40

బుద్ధ్యాదిభ్యో బహిః సర్వ-
మనువర్తస్వ మా ఖిదః.
భుంజన్ ప్రారబ్ధమఖిలం
సుఖం వా దుఃఖమేవ వా. 41

ప్రవాహపతితం కార్యం కుర్వన్నపి న లిప్యసే.
బాహ్యే సర్వత్ర కర్తృత్వమావహన్నపి రాఘవ. 42

నేను దేహమును అనెడి బుద్ధికి 'అవిద్య' యని పేరు. 'నేను దేహమును కాను - చేతనత్వముగల ఆత్మను' అనెడి బుద్ధి 'విద్య' యని తెలుపబడును (33). 'అవిద్య' జనన మరణ రూప సంసారమునకు కారణమైనది. 'విద్య' దానిని నివర్తింప చేయునది. కావున మోక్షాసక్తి కలవారు ఎల్లపుడు విద్యను అనగా జ్ఞానమును సంపాదించుకొనుటకు యత్నింప వలయును. ఓ శత్రుదమనా! కామక్రోధాదులు యీ సాధన యందు విఘ్నములు కలిగించు శత్రువులు (34). అందునను వాస్తవమున మోక్షమార్గమున విఘ్నము కలిగించుటకు కేవలము ఒక్క క్రోధమే చాలును. అది ఆవేశించినచో పురుషుడు తల్లిదండ్రులను, మిత్రులను, బంధువులను కూడ వధించును (35). మనస్సు సంతాపము చెందుటకు మూలము క్రోధము. క్రోధమే సంసారబంధనము కలిగించునది; ధర్మము నశింపచేయునది. కావున నీవు క్రోధము వదలిపెట్టుము (36). ఈ క్రోధము మహాశత్రువు. తృష్ణయే వైతరణీ నది. సంతోషము నందనవనము. శాంతియే కామధేనువు (37). కావున నీవు శాంతి వహింపుము. అట్లు చేసిన నీకు శత్రువు ఎవ్వడూ ఉండడు. ఆత్మ యనునది దేహము, ఇంద్రియములు, మనస్సు, ప్రాణము, బుద్ధి మొదలగు వానికన్న భిన్నమై, శుద్ధమై, స్వయంప్రకాశకమై, అవికారియై, నిరాకారమై యుండునది. మానవుడు దేహేంద్రియ ప్రాణాదులకంటె ఆత్మ భిన్నమైన దని తెలియునంతవరకు మృత్యుపాశమున బంధింపబడి, సాంసారిక దుఃఖసమూహముచేత పీడింపబడుచునే యుండును. కావున సర్వదా నీ హృదయములో బుద్ధ్యాదుల కన్న ఆత్మను భిన్నమైన దానిగా అనుభవములోనికి తెచ్చుకొనుము. ఈ సమస్త బాహ్య వ్యవహారమును అనువర్తింపుము. అంతియేకాక ప్రారబ్ధము సుఖరూపమైనను, దుఃఖరూపమైనను దానినే అనుభవించుచు, శోకమును విడువుము (38-41). రఘునందనా! బాహ్య ఇంద్రియములద్వారా ఏ కార్యము వచ్చినను ఫలాపేక్ష లేకుండ చేయుచు పోయిన, నీవు బంధములలో చిక్కవు.

అంతః శుద్ధస్వభావస్త్వం లిప్యసే న చ కర్మభిః,
ఏతన్మయోదితం కృత్స్నం హృది భావయ సర్వదా. 43

సంసారదుఃఖైరఖిలైర్బాధ్యసే న కదాచన,
త్వమప్యంబ మయాఽఽదిష్టం హృది భావయ నిత్యదా. 44

సమాగమం ప్రతీక్షస్వ న దుఃఖైః పీడ్యసే చిరమ్,
న సదైకత్ర సంవాసః కర్మమార్గానువర్తినామ్. 45

యథా ప్రవాహపతితప్లవానాం సరితాం తథా,
చతుర్దశ సమాసంఖ్యా క్షణార్ధమివ జాయతే. 46

అనుమన్యస్వ మామంబ దుఃఖం సంత్యజ్య దూరతః,
ఏవం చేత్సుఖసంవాసో భవిష్యతి వనే మమ. 47

ఇత్యుక్త్వా దండవన్మాతుః పాదయోరపతచ్చిరమ్,
ఉత్థాప్యాంకే సమావేశ్య ఆశీర్భిరభ్యనందయత్. 48

సర్వే దేవాః సగంధర్వా బ్రహ్మవిష్ణుశివాదయః,
రక్షంతు త్వాం సదా యాంతంతిష్ఠంతం నిద్రయా యుతమ్. 49

ఇతి ప్రస్థాపయామాస సమాలింగ్య పునః పునః,
లక్ష్మణోఽపి తదా రామం నత్వా హర్షాశ్రుగద్గదః. 50

ఆహ రామ మమాంతఃస్థః
సంశయోఽయం త్వయా హృతః,
యాస్యామి పృష్ఠతో రామ
సేవాం కర్తుం తవాదిశ. 51

అనుగృహ్ణీష్వ మాం రామ నోచేత్ప్రాణాంస్త్యజామ్యహమ్,
తథేతి రాఘవోఽప్యాహ లక్ష్మణం యాహి మాచిరమ్. 52

ప్రతస్థే తాం సమాధాతుం గతః సీతాపతిర్విభుః,
ఆగతం పతిమాలోక్య సీతా సుస్మితభాషిణీ. 53

స్వర్ణపాత్రస్థసలిలైః పాదౌ ప్రక్షాల్య భక్తితః,
పప్రచ్ఛ పతిమాలోక్య దేవ కిం సేనయా వినా. 54

మరియు అంతఃకరణమునందు రాగద్వేషములు లేక శుద్ధస్వభావము కలిగియుండుట చేత నిన్ను కర్మ అంటకుండును. నా యీ మాటలను నీవు ఎప్పుడును హృదయమున ధరించుము. అట్లు చేయుట వలన నీవు సాంసారిక దుఃఖముల చేత బాధింపబడక ఉండెదవు'' ఇట్లు తమ్మునితో చెప్పి, రాముడు తల్లితో ''అమ్మా! నీవు కూడ నా యీ పలుకులను హృదయములో నుంచుకొనుము. మరల నా రాకకై ప్రతీక్షించుచుండుము. నీవు ఎక్కువకాలము దుఃఖము పొందనక్కరలేదు! ప్రారబ్ధకర్మానుసారమున ప్రాణులందరు సర్వదా ఒక్క యెడనే కలిసి యుండుట సాధ్యము కాదు (45). ఎట్లనగా నదీప్రవాహమున పడి కొట్టుకొనిపోవుచున్న పడవలు ఎల్లవేళల కలసియుండవు కదా! తల్లీ! ఈ పదునాల్గు సంవత్సరముల వ్యవధి అరక్షణమువలె గడచిపోవును. నీవిక దుఃఖమును వదలిపెట్టి నేను వనము పోయివచ్చుటకు అనుజ్ఞనిమ్ము. నీవట్లు చేసిననే వనమున నేను సుఖముగ నుండగలుగుదును''(46-47) అని పలికి తల్లి పాదముల వ్రాలెను. అంతట తల్లి యాతనిని లేవనెత్తి ఒడిలో చేర్చుకొని ఆశీఃపూర్వకముగా అభినందించెను (48). ''నాయనా! నీవు నడచువేళ, కూర్చుండువేళ, నిద్రించువేళ, అన్నివేళల గంధర్వసహితులై సర్వదేవతలు, బ్రహ్మవిష్ణు శివాదులు నిన్ను సర్వదా కాపాడుచుందురు గాక'' (49).

ఇట్లని పలికి పలుమారు రాముని హృదయమునకు హత్తుకొని, తల్లి అతనిని వీడ్కొలిపెను. అంతట లక్ష్మణుడు (రాముని ధీరత్వమునకు) కన్నులలో ఆనందాశ్రువులు నిండగా, గద్గదస్వరముతో ఇట్లనెను - ''అగ్రజా! నీవు నా మనస్సులోని సందేహమును తొలగించితివి. ఇంక నేను నీ సేవ చేయుటకు అనుసరించెదను. నీవు అందులకై అజ్ఞాపింపుము (50-51). అన్నా! నీవు నాపై దయ చూపుము. లేకున్న నేను ప్రాణములు వీడెదను'' అనగా విని రాఘవుడు లక్ష్మణునితో ''అట్లే రమ్ము! ఆలసింపకుము'' అని చెప్పెను (52). అనంతరము సీతాపతియగు రామచంద్రమూర్తి, సీతను సమాధానపరచుటకై తన మందిరమున కేగెను. అంతట సుస్మితభాషిణియగు సీత పతి రాకను గమనించి, సువర్ణపాత్ర యందు నీటిని గైకొని భక్తితో పాదములను కడిగెను. ఆమె ఇట్లడిగెను - ''నాథా! ఉదయముననే ఎవటికేగితిరి, సేనావారములేక, శ్వేతఛత్రము లేక, రాజోచిత కిరీట భూషణాదులు లేక వచ్చినారేల?




శ్రీరామచంద్రుడు సీతను అడవికి రావలదని నచ్చచెప్పుటకు సీతవద్దకు వెడలుట

అగతోఽసి గతః శుభ్ర శ్వేతచ్ఛత్రం చ తే కుతః,
వాదిత్రాణి న వాద్యంతే కిరీటాదివివర్జితః. 55

సామంతరాజసహితః సంభ్రమాన్నాగతోఽసి కిమ్,
ఇతి స్మ సీతయా పృష్టో రామః సస్మితమబ్రవీత్. 56

రాజ్ఞా మే దండకారణ్యే రాజ్యం దత్తం శుభేఽఖిలమ్,
అతస్తత్పాలనార్థాయ శీఘ్రం యాస్యామి భామిని. 57

అద్యైవ యాస్యామి వనం త్వం తు శ్వశ్రూసమీపగా,
శుశ్రూషాం కురు మే మాతుర్న మిథ్యావాదినో వయమ్. 58

ఇతి బ్రువంతం శ్రీరామం సీతా భీతాబ్రవీద్వచః,
కిమర్థం వనరాజ్యం తే పిత్రా దత్తం మహాత్మనా. 59

తామాహ రామః కైకేయ్యై రాజా ప్రీతో వరం దదౌ,
భరతాయ దదౌ రాజ్యం వనవాసం మమానఘే. 60

చతుర్దశ సమాస్తత్ర వాసో మే కిల యాచితః,
తయా దేవ్యా దదౌ రాజా సత్యవాదీ దయాపరః. 61

అతః శీఘ్రం గమిష్యామి మా విఘ్నం కురు భామిని,
శ్రుత్వా తద్రామవచనం జానకీ ప్రీతిసంయుతా. 62

అహమగ్రే గమిష్యామి వనం పశ్చాత్త్వమేష్యసి,
ఇత్యాహ మాం వినా గంతుం తవ రాఘవ! నోచితమ్. 63

తామాహ రాఘవః ప్రీతః స్వప్రియాం ప్రియవాదినీమ్,
కథం వనం త్వాం నేష్యేఽహం బహువ్యాఘ్రమృగాకులమ్. 64

రాక్షసా ఘోరరూపాశ్చ సంతి మానుషభోజినః,
సింహవ్యాఘ్రవరాహాశ్చ సంచరంతి సమంతతః. 65

కట్వమ్లఫలమూలాని భోజనార్థం సుమధ్యమే,
అపూపాని వ్యంజనాని విద్యంతే న కదాచన. 66

మంగళవాద్య ఘోష ఆగిపోయినదేమి? మంత్రి సామంతులతో వైభవముగా రావలసిన మీరు సామాన్యమానవునివలె వచ్చుటకు కారణమేమి?'' ఈ మాటలకు చిరునవ్వుతో రాముడిట్లు బదులు పల్కెను (53-56).

''కల్యాణీ! తండ్రిగారు నాకు దండకారణ్యమను సంపూర్ణరాజ్యము నిచ్చినారు. కావున భామినీ! దానిని పాలించుటకే నేను శీఘ్రముగా అచ్చటికి పోయెదను (57). నేను ఇపుడే వనమునకు పోవుచున్నాను. నీవు నీ అత్తకడ నుండి సేవలు చేయుచుండుము. నేను చెప్పెడిది పరిహాసము కాదు'' (58).

శ్రీరాముడీ విధముగా పలుకగా సీత భీతురాలై ఇట్లనెను - ''మహాత్ములగు మీ తండ్రి మీకు వనరాజ్యమేల యిచ్చెను?'' (59). రాముడిట్లు బదులుచెప్పెను - ''పుణ్యశీలా! మా తండ్రి పరమప్రీతితో కైకేయికి వరములిచ్చిన కారణమున భరతునకు (ఈ) రాజ్యము, నాకు వనవాసము అనుగ్రహించిరి (60). కైకేయి నా పదునాలుగేండ్ల వనవాసమును వరముగా యాచించినది. అందులకు నాపై అపారమగు దయ, అనురాగముగల మహారాజు తన ప్రతిజ్ఞ సత్యము చేయుటకు సమ్మతింపవలసి వచ్చినది (61). కాన భామినీ! శీఘ్రముగా నేను కానకేగెదను. నీవు ఎట్టి విఘ్నమును కలిగింపవద్దు''.

రాముని పలుకులు విని సీత ప్రీతియుక్తముగా ఇట్లు చెప్పెను - ''నాథా! మునుముందుగా వనమునకు నేను నడచెదను. నా వెనుక మీరు రండు. రాఘవా! నన్ను వదలి తాము అడవికేగుట ఉచితము కాదు'' (62-63)

రాముడు ప్రసన్నుడై, ప్రియభాషిణియగు సీతాదేవితో ఇట్లనెను - ''నేను నిన్ను వ్యాఘ్రాది క్రూర మృగములు అనేకములు నిండిన ఘోరాటవికి ఎటుల గొనిపోగలను? (64). అచట నరమాంస భక్షకులగు ఘోరాకారులగు రాక్షసులుందురు. అన్నిదిక్కుల సింహ వ్యాఘ్ర ఖడ్గమృగములు సంచరించుచుండును (65). సుమధ్యమా! అచట తినుటకు చేదుగ, పుల్లగ నుండు ఫలములే లభించును. అంతియే కాని అపూపాది వ్యంజనములు ఏవియు భుజింప లభింపవు (66).

కాలే కాలే ఫలం వాపి
విద్యతే కుత్ర సుందరి,
మార్గో న దృశ్యతే క్వాపి
శర్కరాకంటకాన్వితః. 67

గుహాగహ్వరసంబాధం ఝిల్లీదంశాదిభిర్యుతమ్,
ఏవం బహువిధం దోషం వనం దండకసంజ్ఞితమ్. 68

పాదచారేణ గంతవ్యం శీతవాతాతపాదిమత్,
రాక్షసాదీన్ వనే దృష్ట్వా జీవితం హాస్యసేఽచిరాత్. 69

తస్మాద్భద్రే గృహే తిష్ఠ శీఘ్రం ద్రక్ష్యసి మాం పునః,
రామస్య వచనం శ్రుత్వా సీతా దుఃఖసమన్వితా. 70

ప్రత్యువాచ స్ఫురద్వక్త్రా కించిత్కోపసమన్వితా,
కథం మామిచ్ఛసే త్యక్తుం ధర్మపత్నీం పతివ్రతామ్. 71

త్వదనన్యామదోషాం మాం ధర్మజ్ఞోఽసి దయాపరః,
త్వత్సమీపే స్థితాం రామ కో వా మాం ధర్షయేద్వనే. 72

ఫలమూలాదికం యద్యత్తవ భుక్తావశేషితమ్,
తదేవామృతతుల్యం మే తేన తుష్టా రమామ్యహమ్. 73

త్వయా సహ చరంత్యా మే కుశాః కాశాశ్చ కంటకాః,
పుష్పాస్తరణతుల్యా మే భవిష్యంతి న సంశయః. 74

అహం త్వాం క్లేశయే నైవ భవేయం కార్యసాధినీ,
బాల్యే మాం వీక్ష్య కశ్చిద్వై జ్యోతిశ్శాస్త్రవిశారదః. 75

ప్రాహ తే విపినే వాసః పత్యా సహ భవిష్యతి,
సత్యవాదీ ద్విజో భూయాద్గమిష్యామి త్వయా సహ. 76

అన్యత్కించిత్ప్రవక్ష్యామి శ్రుత్వా మాం నయ కాననమ్,
రామాయణాని బహుశః శ్రుతాని బహుభిర్ద్విజైః. 77

సీతాం వినా వనం రామో గతః కిం కుత్రచిద్వద,
అతస్త్వయా గమిష్యామి సర్వథా త్వత్సహాయినీ. 78

ప్రియా! అట్టి ఫలములు కూడ ఎల్లపుడు లభించు ఆశయు ఉండదు. అడవిలో జనసంచారము లేకపోవుట వలన ఎల్లెడల గడ్డి కప్పబడియుండుటచే మార్గము కానరాదు. ఒకవేళ ఉన్నను కంకరరాళ్ళు, ముళ్లతో నిండియుండును. ఎటు చూచినను బిలములు, గుహలు కానవచ్చును. రొదలతో కీచురాళ్లు, బాధించు అడవియీగలు మెండుగా నుండును. ఇట్లు దండకావనము దినదిన గండము (67-68).

''కల్యాణీ! ఆ వనములో చలి, ఎండ, గాలి వంటి వాని తాకిడి సహించుచు కాలినడకను పోవలసి ఉండును. నీవు అరణ్యమున రాక్షసాదుల భయంకర రూపమును చూచినంతనే ప్రాణములు వీడెదవు (69). భద్రా! నీ వి(ం)టనే నిలిచెదవు గాక! మరలివచ్చు నన్ను అచిర కాలముననే చూచెదవు గాక!''

ఈమాటలు విని సీతాదేవి దుఃఖితయై, కొంచెము కినుక వహించి, పెదవులు అదరుచుండగా ఇట్లనెను 'నాథా! మీరు ధర్మజ్ఞులు, దయాళువులు. నేను మీ అనన్య భక్తురాలను, దోషరహితను, పతివ్రతను. మీ ధర్మపత్నినైన నన్ను యింటిలోనే వదలిపోవలెనను ఆలోచన మీ మనసున ఎటుల పొడసూపినది? ఇది సమంజసమా! అయినను నేను మీ సన్నిధిలో నుండగా క్రూరమృగములు, రాక్షస గణములు నన్నెట్లు బాధించును (70-72). మీరు తినగా మిగిలిన ఫలమూలాదులు నాకు అమృత సమానములు కాగలవు. వానితో సంతుష్టురాలనై ఆనందముగ నుండెదను (73). మీతో సంచరించుచున్న నాకు కుశకంటకాదులు సైతము పూలపాన్పు వంటి వగుటలో ఎట్టి సందేహమును లేదు (74). నేను మీకు ఏ విధమైన కష్టము కలిగించను. పైగా మీ కార్యమునకు సహాయకురాలిగా నుండును. బాల్యములో ఒక జ్యోతిష్కుడు ''నీవు నీ పతితో వనవాసము చేయుదువు'' అని చెప్పియున్నాడు. ఆ శాస్త్రవేత్త వాక్యములు సత్యములు కావలెను కదా! నేను తప్పక మీతో వనమునకు వచ్చెదను (75-76). మరియొక మాట చెప్పుచున్నాను. వినుడు. మీరు ఎందరో బ్రాహ్మణుల ద్వారా ఎన్నియో రామాయణ గాథలు వినియుందురు (77).

అందెందైనను సీత తోడు లేక రాముడు వనమున కేగెనా! చెప్పుడు. కావున నేను మీకు సర్వథా సహాయకురాలనై అవశ్యము మీ తోడ వచ్చెదను (78). మీరు నన్ను వీడి వెళ్ళినచో

యది గచ్ఛసి మాం త్యక్త్వా ప్రాణాంస్త్యక్ష్యామి తేఽగ్రతః,
ఇతి తం నిశ్చయం జ్ఞాత్వా సీతాయా రఘునందనః. 79

అబ్రవీద్దేవి గచ్ఛ త్వం వనం శీఘ్రం మయా సహ,
అరుంధత్యై ప్రయచ్ఛాశు హారానాభరణాని చ. 80

బ్రాహ్మణేభ్యో ధనం సర్వం దత్త్వా గచ్ఛామహే వనమ్,
ఇత్యుక్త్వా లక్ష్మణేనాశు ద్విజానాహూయ భక్తితః. 81

దదౌ గవాం వృందశతం ధనాని వస్త్రాణి
దివ్యాని విభూషణాని,
కుటుంబవద్భ్యః శ్రుతశీలవద్భ్యో
ముదా ద్విజేభ్యో రఘువంశకేతుః. 82

అరుంధత్యై దదౌ సీతా ముఖ్యాన్యాభరణాని చ,
రామో మాతుః సేవకేభ్యో దదౌ ధనమనేకధా. 83

స్వకాంతః పురవాసిభ్యః సేవకేభ్యస్తథైవ చ,
పౌరజానపదేభ్యశ్చ బ్రాహ్మణేభ్యః సహస్రశః. 84

లక్ష్మణోఽపి సుమిత్రాం తు కౌసల్యాయై సమర్పయత్,
ధనుష్పాణిః సమాగత్య రామస్యాగ్రే వ్యవస్థితః. 85

రామః సీతా లక్ష్మణశ్చ జగ్ముః సర్వే నృపాలయమ్. 86

శ్రీరామః సహ సీతయా నృపపథే
గచ్ఛన్ శనైః సానుజః
పౌరాన్ జానపదాన్కుతూహలదృశః
సానందముద్వీక్షయన్,
శ్యామః కామసహస్రసుందరవపుః
కాంత్యా దిశో భాసయన్
పాదన్యాసపవిత్రితాఖిలజగత్
ప్రాపాలయం తత్పితుః. 87

మీ ఎదుటనే ప్రాణములు విడిచెదను''.

సీతాదేవి దృఢనిశ్చయమును ఎరిగి, రాముడు ''దేవీ! ఆలసింపక నీవు కూడ బయలుదేరుము. వేగమే నా వెంట వనమునకు రమ్ము. ఈ సమస్తాభరణములు, హారములు గురుపత్నియగు అరుంధతి కిచ్చివేయుము. (79-80). మన ధనము నంతయు బ్రాహ్మణులకిచ్చి వనములకు బయలుదేరుదము'' అని పలికెను. లక్ష్మణుని ద్వారా బ్రాహ్మణులను పిలిపించి రఘుకులతిలకుడు బహు కుటుంబీకులు, వేదవిదులు, శీలవంతులగు బ్రాహ్మణులకు భక్తిశ్రద్ధలతో వందలాది ఆవుల మందలను, విశేష ధనము, అశేష భూషణాంబరములను సమర్పించెను (81-82).

సీత కూడ తన ముఖ్యాభరణములను, ఇతర వస్తువులను అరుంధతీ దేవి కిచ్చెను. తన తల్లిని సేవించు దాస వర్గమునకు రాముడు విరివిగా ధనమొసగెను (83). ఈ విధముగా రాముడు అంతఃపురవాసులగు సేవకులకు, పురవాసులకు, దేశవాసులకు, బ్రాహ్మణులకు పుష్కలముగా ధనమును ఇచ్చెను. (84) లక్ష్మణుడు కూడ తన తల్లియగు సుమిత్రను కౌసల్యకు సమర్పించెను. తాను ధనుర్ధారియై రాముని ఎదుట నిలిచెను.

అనంతరము సీతారామ లక్ష్మణులు దశరథుని భవనమునకు వెళ్లిరి (85-86). వేనవేల మన్మథుల సాటియగు సుందరతర శరీర దీధితులతో దిశలు ప్రకాశింపజేయుచు, శ్యామలవర్ణుడు రాఘవుడు సీతతో, తన తమ్మునితో కూడి తన పాదన్యాసముచే జగత్తును పవిత్రము చేయుచు, తమను అత్యంత కుతూహలముతో పరికించుచున్న పౌరులను, జానపదులను ఆనందముగా వీక్షించుచు , రాజమార్గమున నడచుచు, దశరథుడున్న మందిరము చేరెను (87).

ఇది శ్రీమదధ్యాత్మరామాయణాంతర్గత ఉమామహేశ్వర సంవాదములో
అయోధ్యాకాండ - చతుర్థ సర్గము ॥ 4 ॥

----****----

ఓం

# పంచమ సర్గము

## శ్రీరాముడు వనమున కేగుట

### శ్రీమహాదేవ ఉవాచ

అయాంతం నాగరా దృష్ట్వా మార్గే రామం సజానకిమ్.
లక్ష్మణేన సమం వీక్ష్య ఊచుః సర్వే పరస్పరమ్. 1

కైకేయ్యా వరదానాది శ్రుత్వా దుఃఖసమావృతా.
ఐత రాజా దశరథః సత్యసంధం ప్రియం సుతమ్. 2

స్త్రీహేతోరత్యజత్కామీ తస్య సత్యాత్మతా కుతః,
కైకేయీ వా కథం దుష్టా రామం సత్యం ప్రియంకరమ్. 3

వివాసయామాస కథం క్రూరకర్మాతిమూఢధీః,
హే జనా నాత్ర వస్తవ్యం గచ్ఛామోఽద్యైవ కాననమ్. 4

యత్ర రామః సభార్యశ్చ సానుజో గంతుమిచ్ఛతి,
పశ్యంతు జానకీం సర్వే పాదచారేణ గచ్ఛతీమ్, 5

పుంభిః కదాచిద్దృష్టా వా జానకీ లోకసుందరీ,
సాపి పాదేన గచ్ఛంతీ జనసంఘేష్వనావృతా. 6

రామోఽపి పాదచారేణ గజాశ్వాదివివర్జితః,
గచ్ఛతి ద్రక్ష్యథ విభుం సర్వలోకైకసుందరమ్. 7

రాక్షసీ కైకయీనామ్నీ జాతా సర్వవినాశినీ,
రామస్యాపి భవేద్దుఃఖం సీతాయాః పాదయానతః. 8

బలవాన్విధిరేవాత్ర పుంప్రయత్నో హి దుర్బలః,
ఇతి దుఃఖాకులే వృందే సాధూనాం మునిపుంగవః. 9

అబ్రవీద్వామదేవోఽథ సాధూనాం సంఘమధ్యగః,
మానుశోచత రామం వా సీతాం వా వచ్మి తత్త్వతః. 10

ఏష రామః పరో విష్ణురాదినారాయణః స్మృతః.
ఏషా సా జానకీ లక్ష్మీర్యోగమాయేతి విశ్రుతా. 11

శ్రీమహాదేవుడిట్లనెను - సీతాలక్ష్మణులతో సహా రాముడు వచ్చుటను చూచి కైకేయీ వర ప్రదాన సమాచారము తెలిసిన నగరవాసులు దుఃఖపూరితులై, మార్గమున తమలో తాము ఇట్లు చెప్పుకొనసాగిరి. "అయ్యో! కామవశుడైన దశరథమహారాజు ఒక్క స్త్రీ కారణముగా సత్యసంధుడగు తన ప్రియపుత్రుని వదలిపెట్టెను. ఇంక సత్యసంధత ఎక్కడిది? ఇంతవరకు శ్రీరాముని మిక్కిలి ప్రేమతో చూచుచు శ్లాఘించెడి కైకేయి ఇంత దుష్టురాలు ఎందులకైనది? సత్యవాదియు, ప్రియదర్శనుడగు రామునికి వనవాసమేల విధించినది? ఆమె అంత క్రూరకర్మురాలు, బుద్ధిహీనురాలుగా మారుటకు కారణమేమి? కారణము అవగతమగుట లేదు. సోదరులారా! మనమిచట ఇక ఉండతగదు. మనము కూడ సీతారామలక్ష్మణులు చేరెడి అడవికే పోవుదము. అటు చూడుడు! జానకి పాదచారియై వెడలుచున్నది. త్రిలోక సుందరి యగు ఆమె ఏనాడైనను పురుషుల కంట బడెనా? ఆమె కూడ నేడు ఎట్టి ఆవరణము (తెర) లేక జనసమూహము గుండా నడచుచు పోవుచున్నదే? (1-6). జనులారా! సర్వలోకైక సుందరుడగు రాముని చూడుడు. నేడాతడు గజాశ్వముల నధిరోహింపకయే పాదచారియై పోవుచున్నాడు? (7). కైకేయి అను పేరుగల ఈ రాక్షసి అందరి నాశముకే పుట్టినది. సీత ఈరీతి పాదచారియై పోవుచుండ రామునకు కూడ ఎంతయో దుఃఖము కలుగును (8). కాని మనమేమి చేయగలము? దైవగతి ప్రబలము. పురుష ప్రయత్నము దానిముందు దుర్బలము. ఇట్లు దుఃఖార్తులైన సాధు హృదయులగు పౌరులను చూచి, వారి మధ్యనే యున్న వామదేవుడను మునిపుంగవుడు ఇట్లు పలికెను - "మీరెవరును రాముని గూర్చిగాని, సీతను గురించిగాని శోకింపవలదు. నిజము చెప్పెదను, వినుడు (9-10). ఈ రాముడు సాక్షాత్తుగ ఆదినారాయణ స్వరూపమగు శ్రీమహావిష్ణువు. ప్రకృతికన్నను పరుడు. ఈ జానకి యోగమాయగా ఖ్యాతి చెందిన మహాలక్ష్మీదేవి (11).

అసౌ శేషస్తమన్వేతి లక్ష్మణాఖ్యశ్చ సాంప్రతమ్,
ఏష మాయాగుణైర్వ్యక్తస్తత్తదాకారవానివ. 12

ఏష ఏవ రజోయుక్తో బ్రహ్మాభూద్విశ్వభావనః,
సత్త్వావిష్టస్తథా విష్ణుస్త్రిజగత్ప్రతిపాలకః. 13

ఏష రుద్రస్తామసోఽంతే జగత్ప్రలయకారణమ్,
ఏష మత్స్యః పురా భూత్వా భక్తం వైవస్వతం మనుమ్. 14

నావ్యారోప్య లయస్యాంతే పాలయామాస రాఘవః,
సముద్రమథనే పూర్వం మందరే సుతలం గతే. 15

అధారయత్స్వపృష్ఠేఽద్రిం కూర్మరూపీ రఘూత్తమః,
మహీ రసాతలం యాతా ప్రలయే సూకరోఽభవత్. 16

తోలయామాస దంష్ట్రాగ్రే తాం క్షోణీం రఘునందనః,
నారసింహం వపుః కృత్వా ప్రహ్లాదవరదః పురా. 17

త్రైలోక్యకంటకం రక్షః పాటయామాస తన్నఖైః,
పుత్రరాజ్యం హృతం దృష్ట్వా హ్యదిత్యా యాచితః పురా.18

వామనత్వముపాగమ్య యాచ్ఞయా చాహరత్ప్రభుః,
దుష్టక్షత్రియభూభారనివృత్త్యై భార్గవోఽభవత్. 19

స ఏవ జగతాం నాథ ఇదానీం రామతాం గతః,
రావణాదీని రక్షాంసి కోటిశో నిహనిష్యతి. 20

మానుషేణైవ మరణం తస్య దృష్టం దురాత్మనః,
రాజ్ఞా దశరథేనాపి తపసారాధితో హరిః. 21

పుత్రత్వాకాంక్షయా విష్ణోస్తదా పుత్రోఽభవద్ధరిః,
స ఏవ విష్ణుః శ్రీరామో రావణాదివధాయ హి. 22

గంతాద్యైవ వనం రామో లక్ష్మణేన సహాయవాన్,
ఏషా సీతా హరేర్మాయా సృష్టిస్థిత్యంతకారిణీ. 23

రాజా వా కైకయీ వాపి నాత్ర కారణమణ్వపి,
పూర్వేద్యుర్నారదః ప్రాహ భూభారహరణాయ చ. 24

లక్ష్మణుడను పేర అన్నను అనుగమించుచున్న ఇతడు సాక్షాత్తుగ ఆదిశేషుడు. భగవానుడగు పురుషోత్తముడే వేర్వేరు ఆకారములతో (మత్స్యకూర్మవారాహాది రూపములతో) అవతరించినాడు (12).

ఈతడే రజోగుణయుక్తుడై విశ్వసృష్టిగావించు బ్రహ్మ అయినాడు. సత్త్వగుణ విశిష్టుడై త్రిలోకరక్షకుడగు విష్ణుభగవానుడగుచున్నాడు (13). అట్లే కల్పాంతమున తమోగుణాశ్రయమంది యీతడే జగత్ప్రళయము చేయు రుద్రుడగుచున్నాడు. పూర్వకాలమున ఈ రాఘవుడే మత్స్యరూపము దాల్చి తన భక్తుడగు వైవస్వత మనువును నావపై నెక్కించి ప్రళయకాలమున రక్షించెను. సముద్ర మథన సమయమున మందరాచలము పాతాళమునకు దిగిపోసాగెను. (14-15). అపుడు ఈ రఘూత్తముడే కూర్మరూపము ధరించి, దానిని ఉద్ధరించి వెన్నున నిలిపెను. ప్రళయకాలమున భూగోళము రసాతలమునకు వెడలిపోగా ఇతడు సూకర రూపుడయ్యెను (16). భూమిని తన కోరపైనిడి పైకి తెచ్చెను. ఒకనాడు ప్రహ్లాదునికి వరమిచ్చుటకు నృసింహరూపధారణ చేసెను (17). ముల్లోకములకు కంటకప్రాయుడైన హిరణ్యకశిపుని తన నఖములతో చీల్చివైచెను. ఒకమారు తన కుమారుడు ఇంద్రుడు రాజ్యభ్రష్టుడు కాగా అదితి, ఈతనిని ప్రార్థించెను (18). అంత వీతడు వామన రూపము దాల్చి యాచనా పూర్వకముగా ఇంద్రరాజ్యమును తిరిగి ఇచ్చి వేసెను. భూమికి భారముగా పరిణమించిన దుష్టక్షత్రియ గణముల నాశమొనర్చుటకు ఇతడు భృగుకుమారుడైన పరశురాముని రూపుదాల్చెను (19). ఈ జగత్ప్రభువే ఈ సమయమున రామునిగా అవతరించినాడు. ఇపుడీతడు రావణాది కోట్లాది రాక్షసుల హతమార్చును (20). రావణుని మరణము మానవుని చేతిలో నిశ్చితమై యున్నది. దశరథమహారాజు తన పూర్వజన్మమున విష్ణుభగవానునికై తపస్సు చేసి ఆరాధించి, ఆతడు తనకు పుత్రుడై జన్మింప గోరెను. అందువలన శ్రీమహావిష్ణువు ఆయనకు పుత్రుడాయెను. మహావిష్ణువే ఈ శ్రీరాముడు. ఇపుడీతడు రావణ వధార్థమై లక్ష్మణసహితుడై నేడే వనముల కేగును. ఈ సీత జగదుత్పత్తి స్థితి లయములు గావించు భగవానుని యోగమాయ (21-23). వీరు అడవుల కేగుటకు రాజా గాని, కైకేయిగాని ఈషణ్మాత్రము కారణభూతులు గారు. నిన్నటి దినముననే నారదుడు రాముని భూభారము తొలగింప యత్నింప ప్రార్థించినాడు (24).

రామోఽప్యాహ స్వయం సాక్షాచ్ఛ్వో
గమిష్యామ్యహం వనమ్,
అతో రామం సముద్దిశ్య
చింతాం త్యజత బాలిశాః. 25

రామరామేతి యే నిత్యం జపంతి మనుజా భువి,
తేషాం మృత్యుభయాదీని న భవంతి కదాచన. 26

కా పునస్తస్య రామస్య దుఃఖశంకా మహాత్మనః,
రామనామ్నైవ ముక్తిః స్యాత్కలౌ నాన్యేన కేనచిత్. 27

మాయామానుషరూపేణ విడంబయతి లోకకృత్,
భక్తానాం భజనార్థాయ రావణస్య వధాయ చ. 28

రాజ్ఞశ్చాభీష్టసిద్ధ్యర్థం మానుషం వపురాశ్రితః,
ఇత్యుక్త్వా విరరామాథ వామదేవో మహామునిః. 29

శ్రుత్వాతేఽపి ద్విజాః సర్వే రామంజ్ఞాత్వా హరిం విభుమ్,
జహుర్హృత్సంశయగ్రంథిం రామమేవాన్వచింతయన్. 30

య ఇదం చింతయేన్నిత్యం రహస్యం రామసీతయోః,
తస్య రామే దృఢా భక్తిర్భవేద్విజ్ఞానపూర్వికా. 31

రహస్యం గోపనీయం వో యూయం వై రాఘవప్రియాః,
ఇత్యుక్త్వా ప్రయయౌ విప్రస్తేఽపి రామం పరం విదుః.32

తతో రామః సమావిశ్య పితృగేహమవారితః,
సానుజః సీతయా గత్వా కైకేయీమిదమబ్రవీత్. 33

ఆగతాః స్మో వయం మాతస్త్రయస్తే సమ్మతం వనమ్,
గంతుం కృతధియః శీఘ్రమాజ్ఞాపయతు నః పితా. 34

ఇత్యుక్తా సహసోత్థాయ చీరాణి ప్రదదౌ స్వయమ్,
రామాయ లక్ష్మణాయాథ సీతాయై చ పృథక్పృథక్. 35

రామస్తు వస్త్రాణ్యుత్సృజ్య వన్యచీరాణి పర్యధాత్,
లక్ష్మణోఽపి తథా చక్రే సీతా తన్న విజానతీ. 36

హస్తే గృహీత్వా రామస్య లజ్జయా ముఖమైక్షత,
రామో గృహీత్వా తచ్చీరమంశుకే పర్యవేష్టయత్. 37

అపుడు రాముడే స్వయముగా రేపు (నేడు) వనముల కేగుచున్నానని ఆతనితో చెప్పినాడు. కావున అమాయిక జనులారా! మీరు చింతింప వలదు (25). ఈ లోకమున నిత్యము రామనామము జపించువారు మృత్యుభయము పొందరు (26). ఇంక రామునికి దుఃఖము కలుగునను శంక ఎక్కడిది? కలియుగమున ఒక్క రామనామమువలననే ముక్తి లభించును. వేరెట్టి ఉపాయము చేత కలుగదు (27). జగత్కర్తయగు ఈ ప్రభువు భక్తులకు తన గుణగానము చేయునవకాశము ప్రసాదించుటకు, రావణసంహారము గావించుటకు, మాయామానుషవేషమున లోకమున లీలలు గావించు చున్నాడు. అంతేకాదు. దశరథుని మనోరథము నెరవేర్చుటకు కూడ ఇతడు మానవశరీరము దాల్చియున్నాడు'' ఈ విధముగా పలికి వామదేవుడు విరమించెను (28 – 29).

ఈ మాటలు విని అచటివారందరు శ్రీరాముని సర్వవ్యాపియగు మహావిష్ణువుగా గుర్తించి, తమ హృద్గతమైన సంశయము విడిచి, శ్రీరామునే స్మరింపసాగిరి (30). అపుడు వామదేవుడు మరల 'జనులారా! ప్రతిదినము సీతారాముల రహస్యమును మననము చేయువానికి శ్రీరాముని యెడల దృఢభక్తి ఏర్పడును (31). మీరందరు శ్రీరాముని మిక్కిలి ప్రేమించువారు. కావున ఈ రహస్యమును శ్రీరాముని సగుణసాకార స్వరూపమును మీకు తెల్పితిని. కావున మీరు దీనిని సదా గుప్తముగ నుంచుడు''అని వారికి తెల్పి, విప్రవరుడైన వామదేవుడు అటునుండి వెడలిపోయెను. పురజనులు శ్రీరాముని పరమాత్మగా గుర్తించిరి (32).

అనంతరము రాముడు నేరుగా తండ్రియున్న మందిరము ప్రవేశించెను. సీతాలక్ష్మణ సహితుడై అచటికి చేరి కైకతో ''అమ్మా! మీ ఆజ్ఞానుసారము మేము మువ్వురము వనముకేగుటకు సిద్ధమై వచ్చితిమి. మమ్ములను తండ్రిగారు శీఘ్రముగా ఆజ్ఞాపింతురు గాక!'' (34) అని పలికెను. వెంటనే కైకేయి లేచి నిలిచి, స్వయముగానే సీతారామ లక్ష్మణులకు వేర్వేరు నారచీరలిచ్చెను (35). అపుడు రాముడు రాజోచిత వస్త్రములు వీడి, వనవాసులు దాల్చునట్టి ఆ వస్త్రములు ధరించెను. లక్ష్మణుడు అట్లే చేసెను. కాని సీత ఆ వస్త్రములు ఎటుల ధరింపవలెనో తెలియక, చేత బట్టుకొని, రామునివంక సిగ్గుతో చూచుచుండెను. అంత రాముడు ఆమె ధరించిన వస్త్రముపైనే దానిని చుట్టెను (36–37).

తద్దృష్ట్వా రురుదుః సర్వే రాజదారాః సమంతతః,
వసిష్ఠస్తు తదాకర్ణ్య రుదితం భర్త్సయన్ రుషా. 38

కైకేయీం ప్రాహ దుర్వృత్తే రామ ఏవ త్వయా వృతః,
వనవాసాయ దుష్టే త్వం సీతాయై కిం ప్రయచ్ఛసి. 39

యది రామం సమన్వేతి సీతా భక్త్యా పతివ్రతా,
దివ్యాంబరధరా నిత్యం సర్వాభరణభూషితా. 40

రమయత్వనిశం రామం వనదుఃఖనివారిణీ,
రాజా దశరథోఽప్యాహ సుమంత్రం రథమానయ. 41

రథమారుహ్య గచ్ఛంతు వనం వనచరప్రియాః,
ఇత్యుక్త్వా రామమాలోక్య సీతాం చైవ సలక్ష్మణమ్. 42

దుఃఖాన్నిపతితో భూమౌ రురోదాశ్రుపరిప్లుతః,
ఆరురోహ రథం సీతా శీఘ్రం రామస్య పశ్యతః. 43

రామః ప్రదక్షిణం కృత్వా పితరం రథమారుహత్,
లక్ష్మణః ఖడ్గయుగలం ధనుస్తూణీయుగం తథా. 44

గృహీత్వా రథమారుహ్య నోదయామాస సారథిమ్,
తిష్ఠ తిష్ఠ సుమంత్రేతి రాజా దశరథోఽబ్రవీత్. 45

గచ్ఛ గచ్ఛేతి రామేణ నోదితోఽచోదయద్రథమ్,
రామే దూరం గతే రాజా మూర్ఛితః ప్రాపతద్భువి. 46

పౌరాస్తు బాలవృద్ధాశ్చ వృద్ధా బ్రాహ్మణసత్తమాః,
తిష్ఠ తిష్ఠేతి రామేతి క్రోశంతో రథమన్వయుః. 47

రాజా రుదిత్వా సుచిరం మాం నయంతు గృహం ప్రతి,
కౌసల్యాయా రామమాతురిత్యాహ పరిచారకాన్. 48

కించిత్కాలం భవేత్తత్ర జీవనం దుఃఖితస్య మే,
అత ఊర్ధ్వం న జీవామి చిరం రామం వినా కృతః. 49

తతో గృహం ప్రవిశ్యైవ కౌసల్యాయాః పపాత హ,
మూర్ఛితశ్చ చిరాద్బుద్ధ్వా తూష్ణీమేవావతస్థివాన్. 50

రామస్తు తమసాతీరం గత్వా తత్రావసత్సుఖీ.
జలం ప్రాశ్య నిరాహారో వృక్షమూలేఽస్వపద్విభుః. 51

ఈ దృశ్యమును చూచి రాణివాసమున నున్న స్త్రీలు అందరు విలపించిరి. వశిష్ఠుడా రోదనములు విని, క్రుద్ధుడై కైకేయిని గర్హించి ఇట్లనెను - ''దుష్టురాలా! నీవు కేవలము రాముని వనవాసమునే గదా కోరినది! మరిక సీతకు కూడ వల్కలము లేల యిచ్చితివి? (38- 39). పతివ్రతయగు సీత భక్తివశమున రామునివెంట పోదలచినచో సమస్తాభరణ భూషితయై దివ్య వస్త్రములతోనే వెడలుగాక! (40). ఆమె రాముని వనవాస దుఃఖమును దూరము చేయుచు అతనిని ఆనందింపచేయుగాక!''

అంత మహారాజు సుమంత్రునితో ఇట్లనెను ''సుమంత్రా! నీవు రథమును తెమ్ము! (41). వనచరప్రియు లగు వీరు రథారూఢులై అడవికి పోవుదురు''. ఇట్లు పలికి సీతాలక్ష్మణ సమేతుడైన రాముని చూచి, దుఃఖితుడై నేలకూలెను. కన్నుల నీరు ధారల రోదించసాగెను. అపుడు రామునివంక చూచుచు సీత తొందరగా రథమును అధిరోహించెను (42-43). రాముడు తండ్రికి ప్రదక్షిణ నమస్కారాదులు గావించి రథము నెక్కెను. అతని వెన్నంటి రెండు ఖడ్గములను, రెండు ధనువులను, తూణీరములను ధరించి లక్ష్మణుడును రథము నధిరోహించి సారథి సుమంత్రుని ప్రేరేపించెను. దశరథమహారాజు 'సుమంత్రా! నిలునిలు'మని పలుకసాగెను (44-45). కాని రాముడు 'పదపద'మని త్వరపెట్టెను. తోడనే సుమంత్రుడు రథమును ముందుకు తోలెను. రాముడు దూరమునకు వెడలగనే రాజు మూర్ఛితుడై నేలపై కూలెను (46). అనంతరము ఆబాల వృద్ధులగు సమస్త పురవాసులు, జ్ఞానవృద్ధులగు మునులు, బ్రాహ్మణశ్రేష్ఠులు అందరు 'రామా! నిలునిలు' అని ఆక్రోశించుచు రథము వెనుక పరువెత్తిరి (47). దశరథుడు రోదించి రోదించి సేవకులతో ''నన్ను రామమాతయగు కౌసల్య మందిరమునకు గొనిపోవుడు. దుఃఖార్తుడనైన నా ప్రాణములు కొంతకాలమైనను నిలుచు అవకాశమున్నది. అపైన నేను జీవించలేను. ఏలననగా రామునితో నాకు చిరకాలపు వియోగము ఏర్పడినది (48-49)''. పిమ్మట అతడు కౌసల్య యింటికి చేరుటతోడనే మూర్ఛితుడై నేల వ్రాలెను. కొంతవడికి తెలివి తెలిసి; స్వకృతమునకు లజ్జితుడై మౌనము వహించెను (50).

అట రాముడు తమసానదీ తటము చేరి; సుఖముగ నుండెను. రాత్రివేళ నిరాహారియై నీటిని మాత్రము త్రావి, సీతా




సీతారామలక్ష్మణులు అడవికి వెడలుట

సీతయా సహ ధర్మాత్మా ధనుష్పాణిస్తు లక్ష్మణః,
పాలయామాస ధర్మజ్ఞః సుమంత్రేణ సమన్వితః. 52

పౌరాః సర్వే సమాగత్య స్థితాస్తస్యావిదూరతః,
శక్తా రామం పురం నేతుం నోచేద్గచ్ఛామహే వనమ్. 53

ఇతి నిశ్చయమాజ్ఞాయ తేషాం రామోఽతివిస్మితః,
నాహం గచ్ఛామి నగరమేతే వై క్లేశభాగినః. 54

భవిష్యంతీతి నిశ్చిత్య సుమంత్రమిదమబ్రవీత్,
ఇదానీమేవ గచ్ఛామః సుమంత్ర రథమానయ. 55

ఇత్యాజ్ఞప్తః సుమంత్రోఽపి రథం వాహైరయోజయత్,
ఆరుహ్య రామః సీతా చ లక్ష్మణోఽపి యయుర్ద్రుతమ్. 56

అయోధ్యాభిముఖం గత్వా కించిద్దూరం తతో యయుః,
తేఽపి రామమదృష్ట్వైవ ప్రాతరుత్థాయ దుఃఖితాః. 57

రథనేమిగతం మార్గం పశ్యంతస్తే పురం యయుః
హృది రామం ససీతం తే ధ్యాయంతస్తస్థురన్వహమ్. 58

సుమంత్రోఽపి రథం శీఘ్రం నోదయామాస సాదరమ్,
స్ఫీతాన్ జనపదాన్ పశ్యన్రామః సీతాసమన్వితః. 59

గంగాతీరం సమాగచ్ఛచ్ఛృంగవేరావిదూరతః,
గంగాం దృష్ట్వా నమస్కృత్య స్నాత్వా సానందమానసః.
60

శింశుపావృక్షమూలే స నిషసాద రఘూత్తమః,
తతో గుహో జనైః శ్రుత్వా రామాగమమహోత్సవమ్.
61

సఖాయం స్వామినం ద్రష్టుం హర్షాత్తూర్ణం సమాపతత్,
ఫలాని మధుపుష్పాది గృహీత్వా భక్తిసంయుతః. 62

సహితుడై ఒక వృక్షము క్రింద నిదురించెను. ధర్మాత్ముడగు లక్ష్మణుడు ధనుర్ధారియై సుమంత్రుని తోడ కావలా కాయుచు నిలిచెను (51-52).

అనుసరించి వచ్చిన పురజనులు అందరు వచ్చి సమీపమున ఉండిరి. వారు "శ్రీరాముని మళ్లించుటకు మేము సమర్థులమైనచో అయోధ్యకు పోవుదుముగాక! లేనిచో అతనితో అడవికి పోయెందము గాక" అని నిశ్చయించుకొనిరి. వారి దృఢ నిశ్చయమును తెలిసికొని రాముడు "నేను నగరమునకు తిరిగి వెడలుటలేదు. నాతోడ వీరు వనమునకు వచ్చిన కష్టముల పాలగుదురు" అను ధర్మసంకటమున క్షణకాలము నిశ్చేష్టుడై సుమంత్రునితో "ఇపుడే పయనమగుదుము గాక! రథమును గొని రమ్ము" అని పలికెను (53-55).

శ్రీరాముడిట్లు ఆజ్ఞాపించగా సుమంత్రుడు రథమునకు అశ్వములను పూన్చెను. దానిని సీతారామ లక్ష్మణులు అధిరోహించి వడిగా పయనమైరి (56). సుమంత్రుడు రథమును కొంతదూరము అయోధ్య వంకకు నడపించి పిమ్మట, వనమువంకకు మరలించెను. ప్రాతఃకాలమున పురవాసులు మేల్కాంచి శ్రీరాముని పొడగానక మిక్కిలి దుఃఖించిరి (57). రథచక్రముల జాడనుబట్టి మరల అయోధ్యకు చేరిరి. అనుదినము హృదయములో సీతారాములనే ధ్యానించుకొనుచు, అక్కడ నివసింపసాగిరి (58).

అట సుమంత్రుడు శీఘ్రముగా, సాదరముగా రథమును ముందుకు నడపెను. రాముడు సీతా లక్ష్మణ సహితుడై సర్వసమృద్ధములగు ప్రదేశముల చూచుచు, శృంగవేరపురము దాపుననేయున్న గంగాతీరము చేరెను. గంగను దర్శించి నమస్కరించి ప్రసన్నమనస్కుడై అందు స్నానము చేసెను. పిదప రఘువంశదీపకుడు రాముడు శింశుపావృక్షము నీడ కూర్చుండెను. ఆ సమయమున గుహుడు పరిజనుల ద్వారా రామ శుభాగమనవార్త వినెను (59 - 61). వార్త చెవిని సోకిన వెనువెంటనే తన సఖుడు, స్వామి యగు రాముని దర్శించుటకై పరమానందముతో, భక్తితో, ఫల మధు పుష్పాదులను చేకొని కదలివచ్చెను (62). తాను కొనివచ్చిన

రామస్యాగ్రే వినిక్షిప్య దండవత్ప్రాపతద్భువి,
గుహముత్థాప్య తం తూర్ణం రాఘవః పరిషస్వజే. 63

సంపృష్టకుశలో రామం గుహః ప్రాంజలిరబ్రవీత్,
ధన్యోఽహమద్య మే జన్మ నైషాదం లోకపావన. 64

బభూవ పరమానందః స్పృష్ట్వా తేఽంగం రఘూత్తమ,
నైషాదరాజ్యమేతత్తే కింకరస్య రఘూత్తమ. 65

త్వదధీనం వసన్నత్ర పాలయాస్మాన్ రఘూద్వహ,
ఆగచ్ఛ యామో నగరం పావనం కురు మే గృహమ్. 66

గృహాణ ఫలమూలాని త్వదర్థం సంచితాని మే,
అనుగృహ్ణీష్వ భగవన్ దాసస్తేఽహం సురోత్తమ. 67

రామస్తమాహ సుప్రీతో వచనం శృణు మే సఖే,
న వేక్ష్యామి గృహం గ్రామం నవ వర్షాణి పంచ చ. 68

దత్తమన్యేన నో భుంజే ఫలమూలాది కించన,
రాజ్యం మమైతత్తే సర్వం త్వం సఖా మేఽతివల్లభః. 69

వటక్షీరం సమానాయ్య జటాముకుటమాదరాత్,
బబంధ లక్ష్మణేనాథ సహితో రఘునందనః. 70

జలమాత్రం తు సంప్రాశ్య సీతయా సహ రాఘవః,
ఆస్తృతం కుశపర్ణాద్యైః శయనం లక్ష్మణేన హి. 71

ఉవాస తత్ర నగరప్రాసాదాగ్రే యథా పురా,
సుష్వాప తత్ర వైదేహ్యా పర్యంక ఇవ సంస్కృతే. 72

తతోఽవిదూరే పరిగృహ్య చాపం
సబాణతూణీరధనుః స లక్ష్మణః,
రరక్ష రామం పరితో విపశ్యన్
గుహేన సార్ధం సశరాసనేన. 73

సామగ్రిని రాముని సన్నిధియందుంచి, సాష్టాంగ దండప్రణామము చేసెను. రాముడు వెనువెంటనే అతనిని లేవనెత్తి ఆలింగనము చేసికొనెను (63).

శ్రీరాముడు కుశలమడుగగా గుహుడు చేతులు జోడించి "లోకపావనా! నేను ధన్యుడను. నా యీ నిషాద జన్మము సఫలమైనది (64). మీ శరీర సంస్పర్శమున నేను పరమానందమును పొందితిని. రఘువరా! నిషాదుడనగు ఈ దాసుని రాజ్యము నీదియే! నీవిచ్చటనే యుండి మమ్ము పాలింపుము. నగరమునకు వచ్చి, నా గృహము పావనము చేయుము (65-66). దేవా! నీకై సేకరించి తెచ్చిన యీ ఫలమూలాదులను స్వీకరింపుము. సురోత్తమా! నేను నీ దాసుడను. నాపై కృప చూపుము" అని ప్రార్థించెను (67).

రాముడీ మాటలకు అత్యంతము ప్రీతి చెంది "మిత్రమా! నేను ఈ పదునాల్గేడులు గ్రామమును గాని, గృహమును గాని ప్రవేశింపను. అన్యులొసంగిన ఫలమూలాదులు భుజింపను. నీవన్నరీతి యీ రాజ్య మంతయు నాదే. నీవు నాకు అత్యంత ప్రియసఖుడవే (69)" అని బదులు పలికెను.

తదుపరి రఘునందనుడు మఱ్ఱిపాలు తెప్పించి కేశపాశముల నవరించుకొని, లక్ష్మణునితో సహా జటాజూటము ధరించెను (బంధించుకొనెను) (70). సీతా సమేతుడై జలమును మాత్రము త్రాగెను. అంతట లక్ష్మణుడు కుశపత్రాదులతో శయ్య నేర్పరచెను. తొలుత అయోధ్యానగర ప్రాసాదమున చక్కగా నేర్పరచబడిన (హంసతూలికా) తల్పము నందువలె, సుఖముగా సీతా సహితుడై కుశశయ్యపై పవళించెను (71-72). వారికి చేరువగానే ధనుర్బాణ తూణీరములు ధరించి, లక్ష్మణుడు ధనుర్ధారియైన గుహునితోగూడి అన్నివంకల పరికించుచు సీతారాములను కావలి కాచెను (73).

ఇది శ్రీమదధ్యాత్మరామాయణాంతర్గత ఉమామహేశ్వర సంవాదములో
అయోధ్యాకాండ - పంచమ సర్గము ॥ 5 ॥

----****----